అక్టోబర్
2022

సంపుటి :18 సంచిక : 5

198

వెల రూ. 15/-

MARXISTU

# మార్క్సిస్టు

సైద్ధాంతిక మాసపత్రిక

ఈ సంచికలో........

అణు ఇంధనం: ప్రజలకు భారం, ప్రమాద భరితం
చరిత్ర వక్రీకరణ: ప్రజాస్వామ్యం పై దాడి
స్వావలంబనతోనే పారిశ్రామికాభివృద్ధి
మతతత్వం - సామాజిక సమస్యలు
తెలంగాణాలో విస్తరించిన భూ పోరాటం
మౌర్య సమాజంలో కులవ్యవస్థ, మతాలు
పారిశ్రామిక పునాదిని నాశనం చేస్తున్న మోడీ ప్రభుత్వం
ఇటలీ ఎన్నికలు - ఇయు సంక్షోభం
మళ్లీ ముందుకొచ్చిన బ్యాంకుల ప్రైవేటీకరణ
కర్తవ్య పథం పేరుతో మరోమోసం

నివాళి

# అణు ఇంధనం: ప్రజలకు భారం, ప్రమాద భరితం

**సువ్రత్ రాజు, ఎంవి రమణ**

(సువ్రత రాజు మరియు యంవి.రమణగారలు భౌతిక శాస్త్రవేత్తలు. వారు 'అణ్వాయుధాల నిషేధము మరియు శాంతి' సంస్థ భాగస్వామ్యంతో పనిచేస్తున్నారు.)

అణు సాంకేతికత అపాయకరమైనది. ఈ సంవత్సరం మార్చి 3వ తేదీ ఆ విషయాన్ని ప్రపంచానికి తెలియజెప్పింది. ఆనాటి మిలిటరీ పోరులో ఐరోపాలోనే అతి పెద్దదైన జపోరీజాజియా (ఉక్రెయిన్) అణు విద్యుత్ కర్మాగారంలో అగ్ని ప్రమాదం జరిగింది. ఆ మంటలు శీతలీకరణ వ్యవస్థను, విద్యుత్ సరఫరాను లేదా దాని వాడేసిన ఆయిల్ కొలనును ఆవరించివుంటే పెను ప్రమాదం జరిగివుండేది. అదృష్టవశాత్తూ అలా జరుగలేదు.



ఉక్రెయిన్‌లోని జపోరిజాఇయా అణువిద్యుత్ కేంద్రం

11 సంవత్సరాల నాడు జపాన్ ప్రజలు అంతటి అదృష్టానికి నోచుకోలేదు. భూకంపము, అనంతర సునామీలతో 2011 మార్చి 11న, జపాన్‌లోని ఫుకుషిమా అయ్‌చీ అణు విద్యుత్ ప్రాజెక్టు రియాక్టర్లు పెను ప్రమాదాలకు గురయ్యాయి. భూకంపం సంభవించటంతో రియాక్టర్లను మూసేశారు. సునామీతో శీతలీకరణ వ్యవస్థ కూలిపోయింది. ఫలితంగా ముఖ్యమైన రేడియో యాక్టివ్ కోర్‌లో పెరిగిన ఉష్ణోగ్రతలకు రియాక్టర్లు కరిగిపోయాయి.

ఫుకుషిమా విధ్వంసం అనంతర ప్రకంపనలు జపాన్‌ను దాటి బైటి ప్రాంతాలను కూడా ప్రభావితం చేశాయి. వాతావరణంలో సంభవిస్తున్న ప్రతికూల మార్పులతో ప్రపంచంలోని ఎక్కువ ప్రాంతాల్లో అణువిద్యుత్ ప్రాజెక్టులు మూలన పడుతున్నాయి. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన 10 అణు రియాక్టర్లను ఏర్పరచనున్నట్లు 2021 డిసెంబరు 15న భారత ప్రభుత్వం పార్లమెంటుకు తెలియజేసింది. అదనంగా మరో 28 రియాక్టర్ల యేర్పాటుకు అనుమతిని మంజూరు చేసింది. వాటిలో 24 రియాక్టర్లను ఫ్రాన్స్, అమెరికా, రష్యాల నుండి దిగుమతి చేసుకుంటున్నట్లు వెల్లడించింది. జపాన్ అణువిద్యుత్ ప్రమాదం అనంతరం అణు పరిశ్రమ గురించి ప్రపంచం లోనూ, దేశంలోను ఆందోళనకరమైన ధోరణులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో భారత్ అవలంభిస్తున్న అణు విధానం తప్పుదోవ పడుతున్నట్లు అర్థమౌతున్నది. ఈ విధంగా సమకూరే అణు విద్యుత్తు ఆర్థికంగా గిట్టుబాటు కాదు. అది భారత వాతావరణ పరిరక్షణ లక్ష్యాల సాధనకు అనుగుణంగానూ లేదు.

అణు విద్యుత్ కేంద్రాల స్థాపనకు భారీ పెట్టుబడులు వెచ్చించాలి. పైగా ఇటీవల నిర్మించబడిన అణు విద్యుత్ కేంద్రాల నిర్మాణ ఖర్చులు అంచనాలకు మించి భారీగా పెరిగిపోయాయి. అందుకు సౌత్ కరోలినా(అమెరికా) లోని 'విసి సమ్మర్ న్యూక్లియర్ ప్రాజెక్టు' చక్కని ఉదాహరణగా నిలుస్తుంది. నిర్మాణ ఖర్చులు అంచనాలకు మించి 9 బిలియన్ డాలర్ల (షుమారు రు. 72000ల కోట్లు)కు పైగా పెరిగినందున ఆ ప్రాజెక్టును అర్థంతరంగా వదిలేశారు.

అందుకు భిన్నంగా పునరుత్పాదక సాంకేతిక పరిజ్ఞానం (రెన్యువబుల్ టెక్నాలజీ) వినియోగంతో విద్యుత్ చౌకగా తయారౌతున్నది. 2009-21మధ్య కాలంలో సౌర కాంతివిపీడన( సోలార్ ఫొటోవోల్టాయిక్స్) మరియు గాలిమర (విండ్ టర్బైన్స్)ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి వ్యయం వరుసగా 90 శాతం మరియు 72 శాతం తగ్గినట్లు అమెరికాకు చెందిన వాల్‌స్ట్రీట్ కంపెనీ 'లెజార్డ్' అంచనావేసింది. 1920లో 'అంతర్జాతీయ ఎనర్జీ ఏజన్సీ', సౌర విద్యుత్‌ను " విద్యుత్‌శక్తిలో నూతన రారాజు" గా అభివర్ణించింది.

2030నాటికి తన అణు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 114.9 గిగా(100కోట్లు) వాట్‌లకు విస్తరించనున్నట్లు 2008లో అమెరికా ప్రకటించింది. పై అంచనాను 83.3 గిగావాట్‌లకు తగ్గించుకుంటున్నట్లు 2021లో అదే అమెరికా తెల్పటం ప్రపంచ వ్యాపితంగా అణు విద్యుత్‌పట్ల నెలకొన్న పరిస్థితికి అద్దంపడుతున్నది. 1996 నాటికి ప్రపంచ విద్యుత్ ఉత్పత్తిలో అణు విద్యుత్ వాటా 17.5శాతం వుండగా, 2020 నాటికి ఆ వాటా కేవలం 10శాతానికి పడిపోయింది.

'ఫుకుషిమా' ప్రమాదం తర్వాత భారత్ కూడా అణు విద్యుత్ కేంద్రాలను నెలకొల్పటాన్ని గణనీయంగా తగ్గించుకుంది. 2008లో నాటి 'అణు విద్యుత్ కమీషన్' ఛైర్మన్ అనీల్ కకోడ్కర్ '2050 నాటికి మన విద్యుత్ వ్యవస్థాపక సామర్థ్యం 650 గిగావాట్లుగా వుంటుందోని ప్రకటించాడు. అతని తర్వాత ఆ పదవి చేపట్టిన శ్రీకుమార్ బెనర్జీ ఆ లక్ష్యాన్ని ' 2020 నాటికి 35 గిగావాట్స్'కు కుదించారు. కానీ నేటికి ఆ వ్యవస్థాపక సామర్థ్యం కేవలం 6.78 గిగావాట్స్‌కే పరిమితమైపోయింది.

**ఆచరణ సాధ్యంకాని దిగుమతులు**

పై లక్ష్యాలనుబట్టి భారత్, అమెరికాల

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


**1. అణు ఇంధనం: ప్రజలకు భారం, ప్రమాద భరితం**
సుప్రత్ రాజు, ఎంవి రమణ .......2

**2. చరిత్ర వక్రీకరణ: ప్రజాస్వామ్యం పై దాడి**
ఆధిత్య ముఖర్జీ ........4

**3. స్వావలంబనతోనే పారిశ్రామికాభివృద్ధి**
సంజయ్ రాయ్ ......11

**4. మతతత్వం - సామాజిక సమస్యలు**
బి.వి.రాఘవులు ..... 14

**5. తెలంగాణాలో విస్తరించిన భూ పోరాటం**
ఎస్.వీరయ్య ..... 19

**6. మౌర్య సమాజంలో కులవ్యవస్థ, మతాలు**
ఎం.వి.ఎస్.శర్మ ...... 21

**7. పారిశ్రామిక పునాదిని నాశనం చేస్తున్న మోడీ ప్రభుత్వం**
ఎ.కోటిరెడ్డి....... 24

**8. ఇటలీ ఎన్నికలు - ఇయు సంక్షోభం**
ఎస్ వెంకట్రావు...... 28

**9. మళ్లీ ముందుకొచ్చిన బ్యాంకుల ప్రైవేటీకరణ**
సిపి చంద్రశేఖర్..... 31

**10. కర్తవ్య పథం పేరుతో మరోమోసం**
హరీష్ ఖారె..... 33



**సంపాదకుడు :**
**ఎస్.వెంకట్రావు**

**సంపాదక వర్గం :**
**పాటూరు రామయ్య**
**బి.వి.రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్.వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరఫున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్.వెంకట్రావు**
**ఫోన్: ఎడిటర్ : 94900 99333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org


# సంక్షోభం

ఆర్థిక సంక్షోభం, సామాజిక సంక్షోభం, రాజకీయ సంక్షోభం, యుద్ధ సంక్షోభం... ద్రవ్య పెట్టుబడి చోదిత నయా-ఉదారవాద విధానాలు నేడు మొత్తం పెట్టుబడిదారీ ప్రపంచాన్ని సంక్షోభాల సుడిగుండంలోకి నెట్టేశాయి. దాంతో మూడు దశాబ్దాల క్రితం "వాషింగ్టన్ ఏకాభిప్రాయం" పేరుతో ప్రారంభమైన సామ్రాజ్యవాద ప్రపంచీకరణ పూర్తిగా విఫలమై తుది అంకానికి వచ్చిందని అనేక మంది పెట్టుబడిదారీ పండితులే చెబుతున్నారు. 2008లో అమెరికాలో ప్రారంభమైన ఆర్థిక సంక్షోభం తరచూ వచ్చే సంక్షోభాల వంటిది కాదనీ, ఇది వ్యవస్థాగతమైన సంక్షోభం అని ఆర్థిక వేత్తలు చెప్పిన విషయం నిజమేని రుజువవుతున్నది.

ఆర్థిక రంగానికి సంబంధించి ప్రతి రోజూ చెడు వార్తలే వినాల్సి వస్తున్నది. ప్రజలు అప్పుల పాలైనారు. దేశాలు అప్పులపాలైనాయి. పెరుగుదతున్న అప్పులు, తరుగుతున్న ఉపాధి, వేతనాలు, సంక్షేమాల్లో కోతలతో పెట్టుబడిదారీ దేశాలన్నిటా ప్రజా జీవన పరిస్థితులు దిగజారుతున్నాయి. నిన్నటి వరకు కోవిడ్ వల్ల ఆర్థిక కష్టాలు వచ్చాయన్నారు. అంతకు ముందు చైనాపై అమెరికా ప్రకటించిన వాణిజ్య యుద్ధం ఆర్థిక పరిస్థితులను దిగజార్చిందని చెప్పారు. నేడు రష్యా-ఉక్రెయిన్ యుద్ధం వల్ల ధరలు పెరుగుతున్నాయని చెబుతున్నారు. రానున్న కాలంలో ద్రవ్యోల్బణంతో పాటు ఆర్థిక మాంద్యం కూడా పెరిగి సంక్షోభం మరింత తీవ్రమవుతుందనీ, 2023 ఆర్థికంగా మరింత గడ్డుకాలమని అంచనాలు వెలువచుతున్నాయి. నయా-ఉదారవాద విధానాల నిర్వహించడం కోసం జి7 దేశాలు అభివృద్ధి చెందుతున్న మరిన్ని దేశాలను కలుపుకుని జి20 గ్రూపును ఏర్పాటు చేశాయి. కానీ ఇది కూడా ప్రపంచ ఆర్థిక మందగమనాన్ని అపలేకపోతున్నది. వాస్తవానికి నేడు ఈ దేశాల కూటమే నిట్టనిలువునా చీలిపోయి ఏమీ చేయలేని నిస్సహాయతలోకి పోయింది. అందువల్ల నయా-ఉదారవాద ఆర్థిక ఏర్పాటుతో ప్రపంచ ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దడం సాధ్యం కాదని తేలిపోయింది.

కాకులను కొట్టి గద్దలకు పెట్టే ఆర్థిక విధానాల వల్ల ఆర్థిక అసమానతలు మరింత తీవ్రంగా పెరగడమే ఈ సంక్షోభానికి కారణం. ఈ విధానాల వల్ల కొద్ది మంది వద్ద సంపద విపరీతంగా పోగుపడుతోంది. మరోవైపు విస్తారమైన ప్రజల ఆర్థిక పరిస్థితి నానాటికీ తీసికట్టు నాగంభొట్లు అన్నట్లుంది. ప్రపంచ ఆర్థిక ఫోరమ్ లెక్కల ప్రకారం ప్రపంచ జనాభాలోని 10 శాతం ధనికుల చేతిలో 76 శాతం సంపద పోగుపడింది. పేదలైన కింది 50 శాతం ప్రజల వద్ద కేవలం 2 శాతం సంపద మాత్రమే ఉంది. ఆదాయాల పంపిణీ కూడా అదేవిధంగా ఉంది. విశేషమేమిటంటే కరోనా వచ్చినా, ఆర్థిక మాంద్యం వచ్చినా కార్పొరేట్ పెట్టుబడిదారుల లాభాలు పెరుగుతూనే ఉన్నాయి. సంక్షోభ భారాలన్నీ ప్రజల మీదనే పడుతున్నాయి. వారి జీవన పరిస్థితులు శీఘ్రంగా దిగజారిపోతున్నాయి.

సంక్షోభం కేవలం ఆర్థిక రంగానికే పరిమితం కాలేదు, కాదు. సామాజిక, రాజకీయ రంగాల్లో కూడా అది ప్రతిబింబిస్తోంది. ప్రపంచ వ్యాపితంగా పెరుగుతున్న వలసలు, ఉద్రిక్తతలు, యుద్ధ కూటముల ఏర్పాట్లు, చివరికి యుద్ధాలకు దారితీస్తున్న పరిస్థితులలో కూడా ప్రతిబింబిస్తోంది. సంక్షోభ భారాలకు వ్యతిరేకంగా కార్మికవర్గం, సామాన్య ప్రజానీకం అన్ని ఖండాల్లోనూ పోరాటాల బాట పడుతోంది. మరోవైపు ప్రజల ఐక్యతను చెడగొట్టి కార్పొరేట్ దోపిడీని రక్షించడానికి అయా దేశాల్లో మితవాద శక్తులు పెరుగుతున్నాయి, కొన్ని చోట్ల అధికార పగ్గాలు చేపడుతున్నాయి. ఇటలీ ఎన్నికలో ఫాశిస్టు ముస్సోలినీ వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న పచ్చిమితవాద పార్టీ అధికారంలోకి రావడం తాజా ఉదాహరణ. మన దేశంలో కూడా మోడీ ప్రభుత్వం వచ్చిన తరువాత అనుసరించిన నయా-ఉదారవాద, మతతత్వ విధానాలు దేశ ప్రజలను ఆర్థికంగా దయనీయ పరిస్థితుల్లోకీ, సామాజిక ఉద్రిక్తతల్లోకీ నెట్టేశాయి.

అందువల్ల నేటి సంక్షోభం నయా-ఉదారవాద విధానాల వైఫల్యాన్ని చూపించడమే కాదు ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాల తక్షణావశ్యకతను కూడా తెలియజెప్పుతున్నది. ఈ విధానాలను ఓడించాలన్న లక్ష్యంతో ఐక్యంగా అనేక సంఘాలు, సంస్థలు పోరాడిన అనుభవాలూ, ఆ విధానాల ఓటమే లక్ష్యంగా ఎన్నికలలో ఐక్యంగా పోటీ చేసి నెగ్గి ప్రత్యామ్నాయ ప్రభుత్వాలను ఏర్పాటు చేసిన అనుభవాలూ లాటిన్ అమెరికా దేశాలలో చూస్తున్నాం. మన దేశలంలో ఐదు వందలకు పైగా రైతు సంఘాలు ఐక్యంగా పోరాడి మోడీ తెచ్చిన నల్ల వ్యవసాయ చట్టాలను రద్దు చేయించి విజయం సాధించిన అనుభవమూ మనముందుంది. ఆ అనుభవాలనుండి స్ఫూర్తిని పొంది నయాఇఉదారవాద విధానాలను అమలు చేసే ప్రభుత్వాలకు ప్రత్యామ్నాయాన్ని రూపొందించుకోవాలి.

ఈ మాసం ముఖ్యాంశం

# చరిత్ర వక్రీకరణ: ప్రజాస్వామ్యం పై దాడి



రచయిత ప్రముఖ చరిత్రకారులు

**ఆదిత్య ముఖర్జీ**

తను ఒక ప్రజాస్వామ్య, సార్వ భౌమ దేశంగా రూపొందాలని కలలుగని, ఆ కలలను సాకారం చేసుకోవడానికి భారతదేశం దాదాపు వందేళ్ల సుదీర్ఘకాలం స్వాతంత్ర్య పోరాటం సాగించింది. దాని ఫలితంగానే 1947లో బ్రిటిష్ సామ్రాజ్య వాదుల నుంచి స్వాతంత్ర్యాన్ని సంపాదించు కున్నాం. ఆ మౌలికాంశాల 'చరిత్ర'ను వక్రీకరించి, ధ్వంసం చేయాలనే ప్రయత్నాలను ఈ రోజు మనం చూస్తున్నాం. భారతజాతి రాజ్యం మనుగడ, దాని స్వభావమే ఈ రోజు ప్రశ్నర్థకంగా మారాయి.

ఇ.పి థామ్సన్ మాటల్లో చెప్పాలంటే "సకల బోధనలకు ఆది గురువు, సకల మానవ జ్ఞాన సంగమం, మానవీయ శాస్త్రాల మహారాణి అయిన చరిత్ర ఈ మధ్య కాలంలో కరకు కత్తులకు బలి కాబోతున్నది". భారతదేశంలోని మితవాద రాజకీయ పార్టీలు చరిత్రను ఎలా వక్రీకరించి, తమకు అనుకూలంగా ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తున్నాయో ఈ వ్యాసంలో చర్చిద్దాం.

చరిత్ర ఈనాడు, ఏనాడైనా సైద్ధాం తిక ప్రభావాలకు, బహుళ వ్యాఖ్యానాలకు అతీతంగా ఉండాలి. సాధారణ శాస్త్రీయ అవగాహన కాక ప్రత్యేకమైన అవగాహనతో ఉండాలి. ఇ.పి.థామ్సన్ మాటల్లోనే, 'చరిత్ర, .. మానవీయ శాస్త్రాలన్నిటిలో ప్రత్యేకమైనది. ఏ మాత్రం సంక్షిప్తంగా ఉండకూడదు. ఏనాడూ, ఎన్ని వేల ఏళ్లయినా, ఆ జ్ఞానానికి ఇతర జ్ఞానాలేవీ దరిదాపులకు కూడా చేరలేవు. కఠినమైన చారిత్రక, తార్కిక విధానాలను అనుసరించి పొందినది ఆ జ్ఞానం. రుజువులతో నిరూపించబడింది. దానినే మనం శాస్త్రీయ విధానం అంటుంటాం.

ఇంతటి క్రమశిక్షణతో రూపొందించిన అభ్యాసాన్ని చరిత్రగా పిలుస్తూ, రకరకాల సామాజిక శక్తుల సేవలకు వినియోగిస్తాం. ఒకవైపు పాలకులు తమ పాలనను, చరిత్రను వారి వారి విధానాలను సమర్థించుకోడానికి వాడుకుంటుంటారు. సామాజిక ఉద్యమకారులు తమ అభ్యుదయ, లేదా మితవాద భావాల ప్రచారానికి, వారి వాదనలను సమర్థించుకోవడానికి వాడుకుంటుంటారు. మరోవైపు ఈనాడు భారతదేశంలో జరుగుతున్నట్టు మానవీయ శాస్త్రాలకు తలమానికమైన చరిత్రకు 'నిరూపణలు', తప్పని వాదించడం, 'కొత్త రుజువులను' తెచ్చిపెట్టడం, వాస్తవాల స్థానంలో నమ్మకాలు, పురాణాలు, ఇతిహాసాలను పెట్టేందుకు రాజకీయ శక్తులు ప్రయత్నాలు చేస్తున్నాయి.

మానవీయ, సామాజిక శాస్త్రాలు అభివృద్ధి చెందడం ప్రారంభించిన 19 శతాబ్దం, 20వ శతాబ్దం తొలినాళ్లలో ప్రపంచంలో అత్యధిక భాగం సామ్రాజ్యవాదుల పాలనలో ఉంది. వారు యూరోపియన్లు కావచ్చు. పశ్చిమ దేశాలేవైనా కావచ్చు. వారి ఆధిపత్యంలో, ఏలుబడిలో ప్రపంచంలో అధిక భాగం ఉండేది. అందువలన సామ్రాజ్యవాద, యూరప్ కేంద్ర ప్రభావాలు, అన్నివేళలా కాకపోయినా, అడపాదడపా అయినా ఉండేవి. ఆధునిక చరిత్ర అధ్యయనాలు పెరుగుతున్న కాలంలోనే సామ్రాజ్యవాదుల జోక్యం ఉండడంతో, సామ్రాజ్యవాద దృక్పథ ప్రభావం చరిత్ర అధ్యయనాల పై పడింది. 20వ శతాబ్దం మధ్య వరకు భారతదేశ చరిత్ర కూడా ఇటువంటి ప్రభావానికి లోనైంది.

భారతదేశ చరిత్రకు సామ్రాజ్య వాదులు ఇచ్చిన వివరణ భారత సమాజాన్ని విభజించడానికి, ఆ విభజనకు చట్టబద్ధత కల్పించడానికి ఉపయోగపడింది. సామ్రాజ్యవాదులు భారతదేశ చరిత్రను చూపించిన తీరు ఆధారంగానే ఈ రోజు దేశంలో విచ్ఛిన్నకర, ఫాసిస్టు శక్తులు భారతదేశ చరిత్రను చూపుతూ, అదే నిజమైన దేశభక్తిగా తప్పుడు ప్రచారానికి దిగుతున్నాయి. సామ్రాజ్యవాదుల చారిత్రక వివరణ ఆధారంగానే లక్షలాది మైనారిటీ మతస్థులకు ప్రజాతంత్ర హక్కులు లేకుండా చేస్తున్నారు. సామ్రాజ్యవాదులు భారతదేశ చరిత్రకు ఏ విధమైన వివరణ ఇచ్చారో చూద్దాం:

18వ శతాబ్దంలో బ్రిటిష్ వ్యాపారులు మొదటిసారిగా భారతదేశం గడ్డపై అడుగిడిన నాటికి భారతదేశ ప్రపంచ వ్యాపారం, బ్రిటిష్ వారి కన్నా ఎనిమిది రెట్లు అధికంగా ఉండేది. బ్రిటిష్ పత్రికలు ప్రాక్ దేశస్థులను పొగడ్తలతో ముంచెత్తాయి. భారతదేశ చరిత్రను, నాగరికతను పొగడడమే కాదు. ఒక్కొక్కసారి తమ కన్నా ఉన్నతమైనదిగా చూపించారు. అప్పుడు భారతీయుల నుంచి నేర్చుకోవాలనే తత్వాన్ని ప్రదర్శించారు. వ్యాపారం చేసుకోవటానికి వచ్చిన వారికి భారతీయ సమాజాన్ని మార్చాల్సిన అవసరం ఆనాడు లేదు.

పందొమ్మిదో శతాబ్దం మొదట్లో ప్రపంచంలో మొదటి పారిశ్రామిక దేశంగా బ్రిటన్ అవతరించింది. ఆ తరువాత పారిశ్రామిక పెట్టుబడి ఏర్పడింది. ఆ తర్వాత రెండో దశలో వలసలు ఏర్పరచుకోడానికి బయలుదేరింది. అప్పుడే అది భారతదేశంలో "ఆటవిక పరిస్థితులు ఉన్నాయని, వాటిని మార్చాల్సిన అవసరం ఉందని' రాగాలు తీయడం మొదలు పెట్టింది. ఆ రకంగా వేగంగా పెరుగుతున్న బ్రిటిష్ ఆర్థిక వ్యవస్థకు

విధేయంగా ఉండాలని కోరుకుంది. వినిమయ, స్వేచ్ఛ- సామ్రాజ్యవాద ఆలోచనలు చేసేవారు ఉద్భవించారు. దాంతో అందరూ ధర్మకర్త, సంస్కృతీకరించే ధ్యేయం, అభివృద్ధి, ఆధునీకరించడం మొదలైన విషయాలు మాట్లాడ్డం ప్రారంభించారు. ఇవన్నీ తెల్లవాడి భుజాలపై పడ్డ భారాలయ్యాయి. క్రమంగా విద్యలో శిక్షణ ఇవ్వడం మొదలయింది. వలస ప్రజలు ఆదిమకాలంలోనే ఉండిపోయారనీ, వారిని 'స్వీయ పాలన దిశగా' నడిపించాలని చెప్పటం ప్రారంభించారు. బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారి మెకాలే అన్నట్టు భారతీయులు స్వేచ్ఛా వ్యాపారాన్ని అనుమతించగల 'నాగరికులు', విద్యావంతులు'. భారతదేశ చరిత్రను, 'హిందువుల పాలన' అని, ఆ తరువాతి కాలాన్ని 'ముస్లిం పాలన' అని బ్రిటిష్ చరిత్రకారులు వివరణ ఇవ్వడం మొదలు పెట్టారు. మధ్యయుగాల్లో 'బ్రిటిష్' (క్రిస్టియన్లు కాదు) వారు, ముస్లింల నిరంకుశత్వం నుండి భారత దేశాన్ని ఎలా విముక్తి చేశారో చూపారు. పంతొమ్మిదో శతాబ్దం చివరి వరకు ఇదే పరిస్థితి కొనసాగింది.

> “ పందొమ్మిదో శతాబ్దం చివరికి వచ్చేసరికి సామ్రాజ్య వాదపు మూడో దశ, ద్రవ్యపెట్టుబడి అవిర్భవించింది. పారిశ్రామికీకరణ మరింత విస్తరించి ప్రపంచంలోని అనేక దేశాలకు, ప్రధానంగా పశ్చిమదేశాలకు పాకింది. దానితో కొత్త కొత్త వలసలకు, ఉన్న వలసలపై అధిపత్యానికి కుమ్ములాటలు మొదలయ్యాయి. ఈ కుమ్ములాటలు కేవలం తమ తమ దేశంలో ఉత్పత్తి చేసిన వినిమయ వస్తువుల అమ్మకం చేసుకునే మార్కెట్ల కోసమే కాదు, ముడిసరుకుల కోసం కూడా. ”

పందొమ్మిదో శతాబ్దం చివరికి వచ్చేసరికి సామ్రాజ్యవాదపు మూడో దశ, ద్రవ్యపెట్టుబడి అవిర్భవించింది. పారిశ్రామికీకరణ మరింత విస్తరించి ప్రపంచంలోని అనేక దేశాలకు, ప్రధానంగా పశ్చిమదేశాలకు పాకింది. దానితో కొత్త కొత్త వలసలకు, ఉన్న వలసలపై అధిపత్యానికి కుమ్ములాటలు మొదలయ్యాయి. ఈ కుమ్ములాటలు కేవలం తమ తమ దేశంలో ఉత్పత్తి చేసిన వినిమయ వస్తువుల అమ్మకం చేసుకునే మార్కెట్ల కోసమే కాదు, ముడిసరుకుల కోసం కూడా. అప్పు ఇచ్చేవాడికి, తీసుకునే వాడికి ఉండే బంధం సరుకు అమ్మేవాడికి కొనే వాడికి మధ్య బంధం కన్నా గట్టిగా ఉంటుంది. అందువలనే వారు వలస దేశస్థులకు తమను తాము పాలించుకోడం రాదనడం ప్రారంభించారు. అందువల్లనే వలస దేశాలను తాము పరిపాలించాల్సిన అగత్యం ఏర్పడిందని ప్రచారం చేశారు. ఇప్పుడిక దేశాన్ని వదిలి పోయే ఆలోచనే వలస పాలకులకు లేదు. 1880లో అప్పటి బొంబాయి గవర్నర్, సర్ రిచర్డ్ టెంపుల్ మాటల్లో, “ఇంగ్లాండ్ భారతదేశాన్ని తన ఆధీనంలోనే ఉంచుకోవాలి... మానవత్వంతో చెప్పుకోవాలంటే, 'ఇక్కడ బ్రిటిష్ ప్రభుత్వ పాలన నిరంతరంగా కొనసాగుతుందనే నమ్మకంతో పెద్ద మొత్తంలో బ్రిటిష్ పెట్టుబడి నిలిచిపోయింది.”

శాశ్వతంగా వలస పాలన కొనసాగడానికి, చట్టబద్ధత కల్పించడానికి చెప్పుకొనే కారణం భారతీయులకు పరిపాలన చేతకాకపోవడం ఒక్కటే కాదు. వారి చరిత్రలో, భూగోళంలో, సంస్కృతిలో, మతాచారాలలో, వాతావరణంలో, కుటుంబ వ్యవస్థలో, సామాజిక సంస్థలలో, జనాభా పొందికలో కూడా లోపాలు ఉన్నాయనీ, ఇక్కడ ప్రజలు మతపరంగా, కులపరంగా విభజించబడి ఉన్నారనీ, ప్రజాతంత్ర సూత్రాలకనుగుణంగా పాలన జరిగితే, అత్యధికులైన హిందువులు మతపరమైన మైనారిటీలను అంటే ప్రధానంగా ముస్లింలను, ఇతర మిషనరీలను అణచివేస్తారని ప్రచారం చేశారు. హిందూ దేశ ప్రజలు, అనాదిగా తమ మత గుర్తింపు కారణంగా పూర్తిగా వేరుగా ఉన్నట్టు ప్రచారం జరిగింది. కుల, మతపరమైన గుర్తింపు ఇతర అన్ని గుర్తింపుల కన్నా, అంటే - ఆర్థిక, రాజకీయ, సామాజిక సాంస్కృతిక తదితర గుర్తింపుల కన్నా ప్రధానమైనవిగా చెప్పుకోవడం మొదలయింది. మొదటి వలసదేశమైన ఐర్లాండ్ లాగానే భారతదేశంలో కూడా సుదీర్ఘకాలం వలస పాలన కొనసాగడంతో ప్రజల మధ్య ఉన్న విభజనలు స్వతంత్రం పొందిన తరువాత కూడా కొనసాగుతుండడం దురదృష్టకరం.

జాతీయ స్వతంత్ర పోరాట కాలంలోనే భారతీయ మేధావులు భారతదేశ చరిత్రను, సమాజాన్ని సూక్ష్మంగా పరిశీలించడం మొదలు పెట్టారు. మొదటితరం జాతీయవాది దాదాభాయ్ నౌరోజీ 19వ శతాబ్దం మధ్యలో వలసవాదాన్ని తీవ్రంగా దుయ్యబట్టారు. దశాబ్దాల తరువాత మార్క్స్‌తో పాటుగా లెనిన్, హాబ్సన్, రోజా లగ్జెంబర్గ్‌లు వలసవాదాన్ని తీవ్రంగా విమర్శించారు. వలసవాదం అభివృద్ధికి బాటలు వేస్తుందన్న అపోహను తమ తీవ్రమైన మేధోపర చర్చలతో తుత్తునియలు చేశారు. ఆ తరువాతి కాలంలో మహాత్మా గాంధీ, నెహ్రూ, సుభాష్ చంద్ర బోస్, భగత్ సింగ్, మౌలానా ఆజాద్‌లు ప్రపంచంలోని వలసవాదంలోని అనేక పార్శ్వాలను, చరిత్రను వివరించారు, విమర్శించారు.

మతం ఆధారంగా సమాజం విడివడి ఉందన్న వలసవాదుల వివరణ హిందూ ముస్లింల మధ్య జరిగిన ఘర్షణలను, తగిలిన గాయాలను పదేపదే గుర్తుకు తెస్తుంది. ఉదాహరణకి 1951లో కె.ఎం.మున్షి.. మొహమ్మద్ ఘజిని అనే ముస్లిం ఆక్రమణదారుడు సోమనాథ్ ఆలయాన్ని ధ్వంసం చేయడాన్ని గురించి ప్రస్తావించారు. ఘజిని రాజు వెయ్యేళ్ళ కిందట, 1026లో గుడిని ధ్వంసం చేశాడు అనడంతో అచేతనంగానే హిందవులు దానిని జాతీయ విపత్తుగా పరిగణిస్తారు. నిజానికి 19వ శతాబ్దపు వలస దృక్పథం నుండి మున్షి ఈ విధంగా రాశారు. హిందువుల మీద ముస్లింలు మొదటిసారిగా ఆక్రమణ చేశారనీ, దానికి ప్రతీకారం తీర్చుకోవాలనీ 1843లో మొదటి సారిగా బ్రిటిష్ శాసనసభలో ప్రస్తావించబడింది అని రాశారు. రెండు జాతుల సిద్ధాంతమే ఇందుకు కారణం. హిందువులు, ముస్లింలు రెండు వేర్వేరు జాతులనే సిద్ధాంతం. హిందువులు, ముస్లింలు వేర్వేరనే మౌలికాంశం ఆధారంగానే 19 శతాబ్దం నుండి వలస వాదులు చేసిన చరిత్ర రచనలు ఉన్నాయి. అనేక ఆధారాలు సేకరించి, చరిత్రలో అటువంటిదేమీ జరగలేదని సాక్ష్యాధారాలు చూపించటం ద్వారా ప్రఖ్యాత చరిత్రకారిణి రొమిల్లా థాపర్ వలసవాదులు చెబుతున్న చరిత్ర తప్పని నిరూపించారు. మత సంస్థలు సంపద కేంద్రాలుగా చూడబడేవని, అందువలన దండయాత్రలు జరిగినప్పుడల్లా వాటిని ఆక్రమించుకొనే ప్రయత్నాలు జరిగేవని, సంపద కొల్లగొట్టబడేదని - ఇది ప్రాచీన, మధ్య యుగాలలో భారతదేశంలో సర్వ సాధారణంగా

> **“ భారతదేశ చరిత్రలోని ఇటువంటి ఘర్షణల జ్ఞాపకాలు వెలికితీసి విభేదాలను పెంచే ప్రయత్నాలను జాతీయోద్యమ కాలంలోని మేధావులు చేయలేదు. పైగా వాస్తవ భారత సమాజాన్ని ముందుకుతెచ్చి అది మతాన్ని, కులాన్ని అనేక కొత్త మతాల - బౌద్ధం, జైన, సిక్కు అవిర్భవాన్ని, సూఫీ, భక్తి ఉద్యమాలను గురించి వివరించారు. వారు భారతదేశ సాంస్కృతిక చరిత్రపై దృష్టి పెట్టి, ఎన్ని తేడాలు ఉన్నప్పటికీ కలిసి జీవించగల నేర్పు, ఇముడ్చుకునే తత్వం, పరిష్కరించుకునే సమర్థత తదితరాలను ముందుకుతెచ్చారు. ”**

జరుగుతూనే ఉండేదని రాశారు. సోమనాథ్ దేవాలయం ధ్వంసం అయిన 150 సంవత్సరాల తరువాత దానిని ఒక హిందూ రాజు పునర్నిర్మించాడని, అందులో మొహమ్మద్ గురించిన ప్రస్తావన ఎక్కడా లేదని రాశారు. 250 సంవత్సరాల తరువాత హిందువుల భూములలో మసీదు కట్టుకోడానికి ముస్లింలను స్థానిక హిందూ పాలకులు, పూజారులు, వ్యాపారులు అనుమతించిన విషయాన్ని ఉటంకించారు. సామ్రాజ్యవాదుల మిత్రులు, మతతత్వ శక్తులు చాలా రోజుల తరువాత ఆ 'జ్ఞాపకాలను' తవ్వి తీసే వరకు, ఎక్కడా ఎటువంటి 'భయాలకు', తావున్నట్టు కనిపించ లేదు. హిందువుల జ్ఞాపకాలలో అటువంటి భయానక ఘర్షణలు లేవు.

భారతదేశ చరిత్రలోని ఇటువంటి ఘర్షణల జ్ఞాపకాలు వెలికితీసి విభేదాలను పెంచే ప్రయత్నాలను జాతీయోద్యమ కాలంలోని మేధావులు చేయలేదు. పైగా వాస్తవ భారత సమాజాన్ని ముందుకుతెచ్చి అది మతాన్ని, కులాన్ని ఇతర అనేక కొత్త మతాల – బౌద్ధం, జైన, సిక్కు – అవిర్భవాన్ని, సూఫీ, భక్తి ఉద్యమాలను గురించి వివరించారు. వారు భారతదేశ సాంస్కృతిక చరిత్రపై దృష్టి పెట్టి, ఎన్ని తేడాలు ఉన్నప్పటికీ కలిసి జీవించగల నేర్పు, ఇముడ్చుకునే తత్వం, సర్దుబాటు చేసుకునే విధానం, పరిష్కరించుకునే సమర్థత ఘర్షణ పడటం కన్నా మార్పులను ఆహ్వానించే నైజం తదితరాలను ముందుకుతెచ్చారు. మతాలతో, కులాలతో సంబంధం లేకుండా భాష, సంగీతం, కవిత్వం, చిత్రకళ, శిల్పం, తాత్విక చింతనలపై దృష్టి పెట్టారు. బుద్ధుడు, గురునానక్, కబీర్, మీరాబాయి, రామానుజం, అమిర్ ఖుస్రో మొదలైన వారి వలన భిన్న సంస్కృతుల సమాహారం ఎలా ఏర్పడిందో వివరించారు. (అమిర్ ఖుస్రో 700 ఏళ్ల కిందట హిందీలో రాసిన పాటలు ఇప్పటికీ కోట్లాది మతాలవారు ప్రేమగా పాడుకుంటారు) ఈ విధానానికి రూపశిల్పి నెహ్రూ. 1940లలో రాసిన డిస్కవరీ అఫ్ ఇండియాలో వివిధ దేశాలతో వ్యాపారాలు చేయడం, దాడులు, వలసల కారణంగా ఇతరులతో కలవడం వలన భారతీయ సంస్కృతి భిన్నత్వాన్ని తనలో ఇముడ్చుకుని, కలుపుకుని ఎంతో ఘనమైనదయిందని రాశారు. 5,000 ఏళ్ల కిందటి సింధు నాగరికత నుండి ద్రావిడ, ఆర్య – మధ్య ఆసియా నుండి వచ్చిన ఇరానియన్, గ్రీక్, పార్థియన్, బాక్ట్రియన్ సింథియాన్, హుణ, అరబ్, తుర్క్, ప్రాచీన క్రిస్టియన్, జ్యూయిష్, జొరాష్ట్రియన్, ఆఫ్ఘన్, మొఘల్ సంస్కృతుల వరకు భాతీయ సంస్కృతిలో కలిసినవే. అవన్నీ వాటి వాటి గుర్తులను విడిచిపెట్టాయి. ఒక్కదానిపై ఒకటి పొరలు పొరలుగా పేర్చబడిన ఈ సంస్కృతులలో కొన్ని నిగూఢంగా దాగి ఉన్నాయి. కొన్ని చెరిగి పోయాయి. విభిన్న మతాలు, భాషలు, కులాల వారితో కలిసి జీవించడానికి భారత ప్రజలు అలవాటు పడ్డారు. వలసవాదులే వారిని భయభ్రాంతులను చేశారు. భిన్నత్వాన్ని ఆహ్వానించే ఈ చైతన్యపూరితమైన రాజీలకు వలసవాదం గండి కొట్టడమే కాక, వాటిని ఘనీభవింప చేసింది. అంతే కాదు, ఆ విభేదాలను పెంచింది కూడా.

సామ్రాజ్యవాదులు రాజకీయ దృక్పథానికే ప్రధానంగా పరిమితమయ్యారు. వలసవాద రాజ్య అధీనంలో ఉన్న విద్యా విధానంలో చెప్పుకోదగ్గ స్థాయిలో మార్పులను తీసుకురాలేదు. కేవలం స్వతంత్రం వచ్చిన తరువాత పాఠ్యాంశాలలో చేసిన మార్పుల వలనే భారతదేశ చరిత్రలో మార్పులు వచ్చాయి. యూరప్/సామ్రాజ్యవాదం కేంద్రంగా మతతత్వ దృక్పథంతో రూపొందించిన చరిత్రను 1960, 1970 దశాబ్దాలలో దేశంలోని ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలలో ప్రశ్నించడం మొదలయింది. భారతదేశ సామాజిక వ్యవస్థ నిర్మాణం, రాజకీయం, ఆర్థిక అంశాలు, చరిత్రల (ప్రాచీన చరిత్ర నుండి ఆధునిక చరిత్ర, సమకాలీన చరిత్ర వరకు) అన్నిటినీ ప్రశ్నించడం ప్రారంభించారు.

1960లలో నేషనల్ కౌన్సిల్ అఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్.సి.ఇ. ఆర్.టి) ద్వారా దేశంలోని పిల్లల్లో ఈ విధమైన నూతన జ్ఞానం పాదు కొల్పి ఫలితాలు పొందే ప్రయత్నం జరిగింది. రొమిల్లా థాపర్, బిపిన్ చంద్ర, ఆర్.ఎస్.శర్మ, సతీష్ చంద్ర మొదలైన వారు తమ కాలాన్ని వెచ్చించి బడి పిల్లల కోసం – పదకొండేళ్ల నుండి పదో తరగతి పిల్లల వరకు పాఠ్య పుస్తకాలు రచించారు. అందులో ప్రాచీన చరిత్ర నుండి ఆధునిక చరిత్ర వరకు పాఠాలు ఉన్నాయి. తమ సామాజిక కర్తవ్యంగా ఆ చరిత్రకారులు ఈ పనిని చేశారు. ఉదాహరణకి రొమిల్లా థాపర్ ఆరో తరగతి పిల్లలకు పాఠ్య పుస్తకం రాశారు. నాకు తెలిసినంత వరకు ఇటువంటి ప్రయోగం మరే దేశంలోనూ జరగలేదు. దాని ఫలితాలు అమోఘం. ఈ కృషి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు, మన్ననలు పొందింది. ఇప్పటికి 50 ఏళ్ళు గడిచినా ఆ పుస్తకాలు కొనసాగుతున్నాయి. 2000 సంవత్సరం తరువాత మితవాద మతతత్వ రాజకీయ ఒత్తిడులకు లోనై ఎన్‌సిఇఆర్‌టి వాటి ప్రచురణలు నిలిపి వేసినా విద్యార్థులలో, ఉపాధ్యాయులలో వాటికి ఇప్పటికీ మంచి గుర్తింపు ఉంది.

నిజానికి నయా–ఉదారవాద, మతతత్వ శక్తులు శాస్త్రీయ, లౌకిక, వలసవాద వ్యతిరేక చరిత్రపై దాడి ప్రారంభించారు. కేంబ్రిడ్జ్ స్కూల్ నుండే 1960లలో మొదటిసారిగా ఈ దాడి ప్రారంభమయింది. వారు జాతీయ స్వతంత్ర పోరాటాలను, విలువలను ఎగతాళి చేశారు. మోరిస్ డి మోరిస్ 1960లలో రాసిన 'ఆర్థిక చరిత్ర'లో, 1980 లలో తీర్థంకరు రాయ్ రాసిన 'కేంబ్రిడ్జ్ ఎకనామిక్ హిస్టరీ'లో, తీర్థంకరు రాయ్, మేఘ్నా దేశాయ్ కలిసి రాసిన 'కొత్త శతాబ్దం'లో వలసవాద నమూనాను సమర్థించారు. వారసత్వంగా వచ్చిన సామ్రాజ్యవాద వ్యవస్థని ధ్వంసం చేసి కొత్తగా స్వయం సమృద్ధితో కూడిన స్వతంత్ర ఆర్థిక వ్యవస్థను నిర్మించడం – 'నెహ్రూవియన్ స్పృహ' పైదాడి చేశారు. ఒకనాటి వలసవాదం, ఈ నాటి నయా – ఉదారవాదం వారి దృష్టిలో గొప్పవి. 'నెహ్రూ

> తమది ఒక సాంస్కృతిక సంస్థ అని వాదనలు చేస్తూ ఆర్ఎస్ఎస్ మతం ఆధారంగా ప్రజలను వేరు చేస్తూ, విద్వేషాలు పెంచుతూ వచ్చింది. సరస్వతి శిశు మందిర్ ద్వారా విద్యా సంస్థలు నెలకొల్పి, తన సిద్ధాంతాన్ని ప్రచారం చేస్తూనే ఉంది. అప్పటి అధినాయకుడు గోల్వాల్కర్ చేత 1952లో మొదటి సారిగా ఈ సంస్థలను స్థాపించడం జరిగింది.

వియన్ అంగీకారం' వలన అనేక దశాబ్దాలు వృధాగా గడిచిపోయాయని వారి అభిప్రాయం.

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఏర్పడిన నాటి నుండే అది శాస్త్రీయ లౌకిక చరిత్రపై దాడి చేయడం మొదలయింది. స్వతంత్రం వచ్చిన వెంటనే 'ఆర్ఎస్ఎస్‌ని ఒక ప్రైవేటు సైన్యం కలిగిన సంస్థ అని, నాజీలు అనుసరించిన విధానాలనే అనుసరిస్తున్న సంస్థ' అని నెహ్రూ అన్నారు. "ఆర్ఎస్ఎస్ మనస్తత్వం అంతా ఫాసిస్టు మనస్తత్వమే.'' గాంధీ హత్యానంతరం ఆర్ఎస్ఎస్ పై నిషేధం విధించబడింది. సర్దార్ పటేల్ హోం మంత్రిగా ఉన్న సమయంలోనే 25,000 మంది ఆర్ఎస్ఎస్ క్రియాశీల కార్యకర్తలు ఖైదు చేయబడ్డారు. ఒకసారి నిషేధం ఎత్తివేయగానే ఖైదీలు విడుదల అయ్యారు. ఆర్ఎస్ఎస్ మళ్ళీ యధావిధిగా తన పనులు తాను చేసుకుపోయింది. ఈ విషయాన్ని నెహ్రూ పదే పదే హెచ్చరిస్తూవచ్చారు.

తమది ఒక సాంస్కృతిక సంస్థ అని వాదనలు చేస్తూ ఆర్ఎస్ఎస్ మతం ఆధారంగా ప్రజలను వేరు చేస్తూ, విద్వేషాలు పెంచుతూ వచ్చింది. సరస్వతి శిశు మందిర్ ద్వారా విద్యా సంస్థలు నెలకొల్పి, తన సిద్ధాంతాన్ని ప్రచారం చేస్తూనే ఉంది. అప్పటి అధినాయకుడు గోల్వాల్కర్ చేత 1952లో మొదటి సారిగా ఈ సంస్థలను స్థాపించడం జరిగింది. (గోల్వాల్కర్‌కి చరిత్ర, భౌగోళిక శాస్త్రాలలో ఉన్న పటుత్వం గురించి చెప్పుకోవాలి! ఆయన ఆర్యులు ఉత్తరాన్నించి వచ్చారంటారు. ఉత్తర ధృవం ఒకప్పుడు భారతదేశంలోనే ఉండేదంటారు. అది ఈ నాటి బీహార్, ఒరిస్సా ప్రాంతంలో ఉండేదట. ఆర్యులు ఇక్కడే ఉండిపోయారు గాని కాలక్రమంలో ఉత్తర ధ్రువం మాత్రం ఇప్పుడు ఉన్న స్థానానికి కదిలి పోయిందట!)

ఆర్ఎస్ఎస్ అంగలు పంగలుగా అభివృద్ధి చెందింది. 1977 కల్లా ఆర్ఎస్ఎస్ 500 బడులు తెరిచింది. 1993కి 6000, 1999కి వాటి సంఖ్య 14000కి చేరింది. అప్పుడప్పుడు కేంద్రంలో, యుపి, గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో తన అధికారాన్ని వినియోగించుకుని బడుల పరిధి దాటి ఆర్ఎస్ఎస్ తన సిద్ధాంతాన్ని విస్తృతంగా వ్యాపింపచేసుకుంది. ఐదో తరగతి చదువుతున్న 9-10ఏళ్ల పిల్లలలో ఇస్లాం గురించి తప్పుడు అవగాహన పెంచింది. వారు "ఒక చేతిలో కత్తి మరో చేతిలో ఖురాన్ పట్టుకొచ్చారు, ఎక్కడికి వెళ్లినా వారి సైన్యం నాలుగు చెరగులా చుట్టుముడుతుంది. ప్రధాన స్థలాలు, విశ్వవిద్యాలయాలు ధ్వంసం చేస్తారు, గ్రంథాలయాలను, మత గ్రంధాలను కాల్చేస్తారు, అమ్మలనూ, అక్కచెల్లెళ్ళను అవమానపరుస్తారు, దయ, న్యాయం అనేవి వాళ్లకు లేనే లేవు" అని ప్రచారం గావించారు. (నిజానికి హిందూ మతతత్వ వాదులే బాబ్రీ మసీదును కూల్చారు. పూణే లోని భండార్కర్ గ్రంథాలయాన్ని ధ్వంసం చేశారు. 2002 గుజరాత్ అల్లర్లలో అమ్మలనూ, అక్కలను అవమానపరిచారు.)

ఇతర ఆర్ఎస్ఎస్ ప్రచురణలలో క్రైస్తవులను జాతి వ్యతిరేకులుగా, భారతదేశ ఐక్యతకు భంగం కలిగించే వారిగా చూపుతారు. "ఈ మతాన్ని అనుసరించేవారి కుట్రపూరిత విధానాల వలెనే భారతదేశం విభజించబడింది. ఈ రోజుకీ నాగాలాండ్, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్, బీహార్, కేరళ, దేశంలోని ఇతర ప్రాంతాలలో వారు జాతివ్యతిరేక కార్యకలాపాలకు పాటుపడుతూనే ఉంటారు. వారు దేశ సమగ్రతకు ముప్పు" అని చెబుతారు. "గుజరాత్ బడులలో హిట్లర్‌ని కీర్తిస్తూ పాఠాలు ఉన్నాయి. అదే సమయంలో మక్కాలోని కాబాని శివలింగంగా చెపుతున్నారు. పదమూడో శతాబ్దంలో ఢిల్లీని మొదటి సారిగా పాలించిన కుతుబ్ ఉద్దీన్ ఐబక్ ఢిల్లీలోని కట్టించిన కుతుబ్ మినార్‌ని నాలుగవ శతాబ్దంలో హిందూ రాజుగా పాలించిన సముద్రగుప్తుడు కట్టించిన విష్ణు స్తంభంగా చెబుతున్నారు. ఈ విధంగా ఆర్ఎస్ఎస్ బడులకు మాత్రమే పరిమితం కాకుండా మతత్వాన్ని, తప్పుడు చరిత్రను ప్రచారం చేస్తున్నది.

ముస్లింలు, క్రిస్టియన్లు విదేశీయులని, వారికి దేశం పట్ల ఉన్న విధేయత ప్రశ్నించదగ్గదని ఆర్ఎస్ఎస్ అభిప్రాయం. హిందువుల పుణ్యభూమి భారతదేశమే. కానీ ముస్లింలు, క్రైస్తవుల పుణ్యభూములైన మక్కా జెరూసలెం విదేశాలలో ఉన్నాయి. అందువలన హిందూదేశం కేవలం హిందువులది అని వారు చెబుతారు. భారతదేశంలో ఉన్న ఇతరులకి పౌరహక్కులు లేకుండా చేసే ప్రయత్నమే ఇది. ఈ సూత్రం ప్రకారం యూరప్, అమెరికా, లేదా దక్షిణ కొరియాలో ఉన్న క్రిస్టియన్లు ఆయాదేశాల పౌరులుగా ఉండలేరు. కారణం వారి పవిత్రభూమి పాలస్తీనాలో ఉంది. జర్మనీలో ఉన్న జర్మనులలాగే భారతదేశంలో ఉన్న హిందువులే స్వచ్ఛమైన జాతివారని, జర్మనీలో ముస్లింలు, క్రిస్టియన్లలాగా భారతదేశంలో కూడా వారు మైనారిటీలు అని ఇంకా భయంకరమైన వాదన చేస్తున్నారు.

ఆర్ఎస్ఎస్ నాయకత్వంలోని మతతత్వ శక్తులు అధికారానికి చేరువవుతున్న కొద్దీ, తమ సామ్రాజ్యవాద యజమానులలాగే వారూ లౌకిక, శాస్త్రీయ చరిత్రను మతతత్వ చరిత్రగా మారుస్తున్నారు. 1977-79లో జనతాపార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత మొదటిసారిగా ఒక పెద్దదాడి జరిగింది. పేరుపడ్డ పండితులు రాసిన పాఠ్యపుస్తకాలను నిషేధించారు. అయితే ఆనాడు ఆ సంస్థలు కొంతమేరకైనా స్వతంత్రంగా పనిచేస్తున్నాయి. అందువలన ఆ ప్రయత్నాన్ని అడ్డుకోగలిగాయి. పుస్తకాలు బతికి బయటపడ్డాయి.

1999లో ఎన్‌డిఏ అధికారంలోకి వచ్చినప్పుడు భారతీయ జనతా పార్టీ (ఆర్ఎస్ఎస్ రాజకీయ విభాగం) నాయకత్వ స్థానంలో ఉంది. అందువలన నిర్ణయాలు తీసుకోగల స్థానాలలో ఉన్న ఎన్‌సిఆర్‌టి, యుజిసి, ఐసిఎస్ఎస్ఆర్, ఐసిహెచ్ఆర్‌ల అధికారులను ముందు ఆ స్థానాల నుండి తొలగించారు. మత భావనలు దెబ్బతింటున్నాయనే పేరు మీద ఆర్ఎస్ శర్మ, రొమిల్లా థాపర్, బిపిన్ చంద్ర, సతీష్ చంద్ర మొదలైన వారి పాఠ్యాంశాలు తొలగించారు. ఏయే భాగాలు తొలగించాలో ఆర్ఎస్ఎస్ ప్రచురణ ముందే తెలియచేసింది - భారతీయతకు శత్రువులు : మార్క్స్, మెకాలే, మదరసా పిల్లలు. కొత్తగా ఎన్‌సిఇఆర్‌టి

> “ 2004లో మతతత్వవాదులు అధికారం నుండి తొలగించబడిన తర్వాత మతపరమైన దాడుల జోరు కాస్తంత తగ్గింది. యుద్ధ ప్రాతిపదికన మతతత్వాన్ని ఎదిరించ డానికి ఈ కాలాన్ని ఉపయోగించుకోవడంలో లౌకికవాదులు విఫలమయ్యారు. ”

డైరెక్టర్‌గా నియమితులైన జెఎస్ రాజపుట్ ఇందులో ఒక వ్యాసం రాశారు. అమర్త్య సేన్, కె.ఆర్.నారాయణన్‌తో సహా లౌకిక పండితులందరూ జాతి వ్యతిరేకులుగా చిత్రించబడ్డారు. ఆర్ఎస్ఎస్ అధినేత కె.ఎస్. సుదర్శన్ వాళ్ళని హిందూ వ్యతిరేక, యూరో సెంట్రిక్ అని ముద్రవేశారు. స్వయం నియమిత హిందూ జాతి రక్షకులు రొమిల్లా థాపర్, ఆర్ఎస్ శర్మ, అర్జున్ దేవ్‌లను ఖైదు చేయాలనీ విద్యాశాఖ మంత్రి మురళి మనోహర్ జోషి ఇంట్లో జరిగిన సమావేశంలో డిమాండ్ చేశారు. ఈ చరిత్రకారులను 'మేధో తీవ్రవాదులు' అని, వారు' దేశ సరిహద్దులలో ఉన్న తీవ్ర వాదులకన్నా ప్రమాదకరమని' వారిని తప్పనిసరిగా ఎదుర్కోవాలని చెబుతూ మంత్రి ఈ ఫాసిస్టు ధోరణికి అగ్నిలో ఆజ్యం పోసినట్టు చేశాడు.

2004లో మతతత్వవాదులు అధికారం నుండి తొలగించబడిన తర్వాత మతపరమైన దాడుల జోరు కాస్తంత తగ్గింది. యుద్ధ ప్రాతిపదికన మతతత్వాన్ని ఎదిరించ డానికి ఈ కాలాన్ని ఉపయోగించుకోవడంలో లౌకికవాదులు విఫలమయ్యారు.

2014లో బిజెపి జాతీయ స్థాయిలో అధికారంలోకి వచ్చింది. విద్యాసంస్థలను మతతత్వం వైపు నడిపించడానికి కొత్త ఊపునిచ్చింది. లౌకిక చరిత్రకు సంబంధించిన పుస్తకాలపై మళ్ళీ దాడి మొదలయింది. 2019లో బిజెపికి స్వంతంగా మెజారిటీ వచ్చింది. అగ్రభాగాన నిలిచిన చరిత్రకారుల రచనలపై మళ్లీ దాడి ప్రారంభించారు. పబ్లిక్ పాలసీ రీసెర్చ్ సెంటర్ ఏర్పడింది. డాక్టర్. సుమీత్ భాసిన్‌పే దానికి డైరెక్టర్‌గా నియమించారు. దేశవ్యాప్తంగా అన్ని విద్య సంస్థలను పర్యవేక్షించే యుజిసి, విశిష్ట పాండిత్యం గల చరిత్రకారులతో ఏ విధమైన చర్చ లేకుండా, బిఏ చరిత్ర పాఠ్యాంశాలను నిర్ణయించింది. స్వాతంత్ర్యానంతరం భారతదేశ చరిత్ర కారులలో ఎన్నదగిన వారిగా పేరుపొందిన ఇర్ఫాన్ హబీబ్ ఈ పాఠ్యాంశాల మార్పులను వివరంగా విమర్శిస్తూ, “ఇవి కేవలం తప్పులతో కూడుకున్నవి, భారతదేశ చరిత్రను మతతత్వ చరిత్రగా వ్యంగంగా చిత్రించడం మాత్రమే కాదు, అసమర్థ వంతంగా, విద్యతో సంబంధం లేనివిగా కూడా రాయబడ్డాయి” అని చెప్పారు. ఈ చరిత్ర పుస్తకాలలో జాతి పిత మహాత్మాగాంధీ హత్య కావించబడిన విషయాన్ని రాయడం కూడా మరిచిపోయారు. భారతదేశ జాతీయోద్యమానికి నాయకుడై 30 ఏళ్లపాటు స్వతంత్రపోరాటాన్ని నడిపి, తొమ్మిదేళ్లు కారాగారవాసం చేసిన నెహ్రూ ప్రస్తావన లేదు. పైగా దేశాన్ని పట్టి పీడిస్తున్న ప్రతి విషయానికి నెహ్రూను కారణంగా చూపారు. అందుకు కారణం ఆయన ముస్లిం వారసత్వం దాచబడినట్టు కథనాలు! ఆర్ఎస్ఎస్ పత్రికలో రాసిన ఒక వ్యాసంలో గాంధీని చంపిన గాడ్సే నెహ్రూని ఎందుకు వదిలేశాడా అని బాధ పడ్డారు.

పాఠ్యాంశాల్లో చరిత్ర అన్వయింపు మార్చే క్రమం నుండి ఇప్పుడు చాలా దూరం ప్రయాణించడం జరిగింది. అందమైన ఊహాజనిత గతాన్ని ప్రజల హృదయాలలో ముద్ర వేయడానికి ఇప్పుడు కృషి జరుగుతున్నది. మెజారిటీ మతస్థులు మీడియాని తమదిగా సొంతం చేసుకోవాలి. తాము బలయినట్టు భావించాలి. అదే సమయంలో మైనారిటీలను చూసి మెజారిటీ మతస్థులు భయపడాలి. అంటే మైనారిటీల వలన తమకు ఆపద ఉందని భ్రమపడాలి. ఇదే ఫాసిస్టు పాలకులు చిరకాలంగా వండి వార్చిన వంటకం. దీనిని జాసన్ స్టాన్లీ అనే యేల్ విశ్వవిద్యాలయం తత్వవేత్త అద్భుతంగా చిత్రించారు.

ఇక్కడ కొన్ని ఉదాహరణలను ప్రస్తావించవచ్చు. మన ప్రధాని నరేంద్ర మోడీ అధికారం చేపట్టిన కొన్ని నెలల తరువాత, అక్టోబర్ 2014లో ముంబైలో ఒక కొత్త ఆసుపత్రి భవనాన్ని ప్రారంభించారు. సభికులలో పెద్ద పెద్ద వైద్య నిపుణులు ఉన్నారు. ప్రాచీన భారతదేశంలో ప్లాస్టిక్ సర్జన్‌లు ఉండి ఉంటారని ఆ సభలో మోడీ పేర్కొన్నారు. సైన్స్ అండ్ ఇంజనీరింగ్ ఫెయిర్ ప్రారంభిస్తూ బెంగాల్ గవర్నర్ చరిత్రకి, విజ్ఞానశాస్త్రానికి కూడా అపచారం చేశారు. మహాభారతంలో ప్రధాన నాయకుడు అర్జునుడు అణు శక్తిగల అస్త్రాలువాడాడట! ఆర్ఎస్ఎస్ అధినాయకుడైన ఇంజనీరింగ్ విద్యార్థి కెఎస్ సుదర్శన్ అలనాటి భరద్వాజ మహర్షి, రాజా భోజుడు 'విమానాలు ఎలా నిర్మించాలో వర్ణించారని' సెలవిచ్చారు. అంతేకాదు ఎన్నిరకాల విమానాలు ఉన్నాయో వివరంగా చెప్పారని, ఏయే విమానం ఎంత ఎత్తులో ప్రయాణించగలదో, ఎటువంటి సమస్యలను ఎదుర్కొంటుందో కూడా వివరించారట.

ఇన్ని ఘన విజయాలు సాధించినప్పటికీ ఈ రోజు హిందువులకు ముస్లింలే పెద్ద ఆపద! ముస్లింలు చేసిన దౌర్జన్యాల గురించే క్రమం తప్పకుండా మాట్లాడుతుంటారు. ఢిల్లీకి కూతవేటు దూరంలో ఉన్న హర్యానా గ్రామాలలో ప్రజలు ప్రతిరోజూ చర్చించుకునే విషయం ఇదే. నేను ఒక సారి హర్యానా వెళ్లినప్పుడు అక్కడ చరిత్రకారుడిని అని నన్ను పరిచయం చేసుకున్నాను. అప్పుడు నన్ను కూడా అక్కడి ప్రజలు అడిగిన విషయం : 'జంధ్యాలు' తెచ్చిచూపించే వరకు మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు రాత్రి నిద్రపోయేవాడు కాదట కదా అని. అంటే ఎంతమంది హిందువులు చంపబడ్డారో లేదా మతాలు మార్చుకున్నారో తెలుసుకునే వరకు నిద్ర పట్టదని. ఆ చక్రవర్తి పేరునున్న రోడ్డు పేరును బిజెపి మార్చింది. బాంగ్లాదేశ్ ముస్లింలు చెద పురుగులలాగా దేశమంతావ్యాపించారని, దేశ ఐక్యతకు ముప్పుగా మారారని గృహ మంత్రి అంటున్నారు. ప్రపంచవ్యాప్త ముస్లిం ప్రమాదాన్ని పదేపదే ప్రస్తావిస్తున్నారు. ప్రపంచ ముస్లింలు హిందువులకి వ్యతిరేకంగా చేతులు కలుపుతారని, అందువలన హిందువులు మెజారిటీగా ఉన్నా లాభం లేకుండా పోతున్నదని అంటున్నారు. అన్నిటికి మించి ముస్లింలు బహు భార్యత్వం కలిగి ఉన్నందువలన ఎక్కువమంది పిల్లలకు జన్మనిచ్చే అవకాశాలు ఉన్నాయని, వారి సంఖ్య పెరుగుతూ పోతుందని వాదన. దీనిని ఎదుర్కోడానికి భారతదేశంలోని అతిపెద్ద

రాష్ట్రమైన ఉత్తర ప్రదేశ్‌లోని బిజెపి ప్రభుత్వం పాపులేషన్ కంట్రోల్ బిల్లును ప్రవేశపెట్టింది. అటువంటి కుటుంబాలను శిక్షించడమే ఈ బిల్లు ఉద్దేశం. ఇటువంటిదే మరోటి 'లవ్ జిహాద్' ప్రచారం. బిజెపి పాలిత రాష్ట్రాలు లవ్ జిహాద్ వ్యతిరేక చట్టాల పేరుతో ముస్లింలపై దాడికి దిగాయి. వీటికి తోడుగా దేశద్రోహ చట్టం, ఉపా చట్టం ఉపయోగించి మైనారిటీలను ప్రధానమైన దోషులుగా చేయడం జరుగుతున్నది.

16వ శతాబ్దం నాటి మసీదును ధ్వంసం చేసి, అక్కడే రాముడి మందిరాన్ని కట్టి, జరిగిన ఆ చారిత్రిక తప్పిదానికి హిందువులు పగ తీర్చుకున్నట్లు ప్రచారం చేస్తున్నారు. 2021లో మోడీ రామ మందిర నిర్మాణం ప్రారంభించారు. 1991లో పార్లమెంటులో పాస్ అయిన ప్రార్థన స్థలాల చట్టాన్ని ఏమాత్రం ఖాతరు చేయలేదు. (1947 ఆగస్టు 15న ఏ ప్రార్థనా స్థలాలు ఏ విధంగా ఉన్నాయో అలాగే ఉంచాలని చేసిన చట్టం). కాశీలో ఉన్న జ్ఞానవాపి మసీదులో ఒక భాగం పడగొట్టి కాశీ విశ్వనాథుని దేవాలయం కట్టారని ఈ మధ్యే ప్రచారం ప్రారంభించారు. ఈ విధంగా 'చారిత్రిక తప్పిదాలు' సరి చేసుకుంటూ పోతున్నారు! హిందువుల గర్వానికి, లోతైన గాయాలు మానడానికి ఇవన్నీ చేస్తున్నట్టు చెప్పుకుంటున్నారు. హిందువులకు మానసిక తృప్తి కలిగిస్తున్నామంటున్నారు. ఇక్కడ మరుగున పడుతున్న విషయం హిందువులు ముస్లింలు అనేక వందల ఏళ్ల నుంచి కలిసి మెలిసి ఉంటున్నారు. అయోధ్య, కాశీ, మథురలలో పూజలు చేసుకుంటున్నారు. ఒకరి పూజా స్థలాలకు ఒకరు వెళుతున్నారు. చాలాచోట్ల ఉమ్మడి హద్దులు కలిగి ఉన్నారు.

> **“ఊహాత్మక గాయాలు, భయానక జ్ఞాపకాలు అంటూ ఉసిగొల్పడం జరుగుతున్నది. ముందే చర్చించుకున్నట్టు సోమనాథ్ గుడి గురించి సామ్రాజ్యవాదుల కాలంలో జరిగినది ఇదే. రాజకీయ ప్రయోజనాల కోసం సమాజాన్ని మెజారిటీ, మైనారిటీలుగా విభజించడం. ప్రస్తుతం బిజెపి నాయకులు 80 శాతం, 20 శాతం మంది మాట్లాడే భాష గురించి చర్చిస్తున్నారు. అంటే 80 శాతం హిందువులు, 20 శాతం ముస్లింలు మాట్లాడే భాష అని వారి అభిప్రాయం. అది హిందూ ఓట్లను కూడగట్టడానికే.”**

ఊహాత్మక గాయాలు, భయానక జ్ఞాపకాలు అంటూ ఉసిగొల్పడం జరుగుతున్నది. ముందే చర్చించుకున్నట్టు సోమనాథ్ గుడి గురించి సామ్రాజ్యవాదుల కాలంలో జరిగినది ఇదే. రాజకీయ ప్రయోజనాల కోసం సమాజాన్ని మెజారిటీ, మైనారిటీలుగా విభజించడం. ప్రస్తుతం బిజెపి నాయకులు 80 శాతం, 20 శాతం మంది మాట్లాడే భాష గురించి చర్చిస్తున్నారు. అంటే 80 శాతం హిందువులు, 20 శాతం ముస్లింలు మాట్లాడే భాష అని వారి అభిప్రాయం. అది హిందూ ఓట్లను కూడగట్టడానికే.

ముస్లిం వ్యతిరేక సెంటిమెంట్ రెచ్చగొట్టడానికి ఉమ్మడి వారసత్వాన్ని అంగీకరించేందుకు నిరాకరిస్తున్నారు. చరిత్రను వక్రీకరిస్తున్నారు. మొగలుల పాలనలో సాధించిన గొప్ప విజయాలను, ఉదాహరణకి షాజహాన్ అద్భుతమైన కట్టడం తాజ్ మహల్‌ని కూడా వివాదాస్పదం చేస్తున్నారు. తాజ్‌మ్మహల్ వివాదం 1960 లలో మొదలయింది. పురుషోత్తం నగేష్ ఓక్ అనే విపరీత మనస్కుడు మొదలు పెట్టాడు. క్రిస్టియానిటీ అంటే కృష్ణ నీతి అని, వాటికన్ ఒకనాటి వాటిక అని కాబా శివలింగమని అతడే మొదలు పెట్టాడు. వీటినన్నిటిని ఇదివరకటి రోజుల్లో పిచ్చి ప్రేలాపనలుగా చూసేవారు. ఇప్పుడు ఈ ఆలోచనలు ప్రధాన స్రవంతిలోకి అడుగు పెట్టాయి. విమర్శకులు జాతివ్యతిరేకులుగా హేళన చేయబడుతున్నారు. వామపక్ష లౌకికవాదులు పురాణాల్నీ, హిందువుల సెంటిమెంట్లనూ గౌరవించరని, ముస్లింలను, క్రిస్టియన్‌లను బుజ్జగిస్తుంటారని ప్రచారం జరుగుతున్నది.

మే 7వ తేదీ, హరిభూషణ్ ఠాకూర్ బాచువల్ అనే బీహార్ బిజెపి నాయకుడు, హిందువుల ప్రతి నాయకుడు రావణుడి ప్రతిరూపాలు తగల బెట్టినట్టే ముస్లింలను కూడా తగలబెట్టేస్తామని ప్రకటించాడు. హిందుత్వతో సంబంధాలు ఉన్న హిందూమత నాయకులు రాజ్యం జోక్యం చేసుకుంటుందన్న భయమేమి లేకుండా ముస్లింలను మూకుమ్మడిగా తెగ నరికేస్తామని బాహాటంగా ప్రతిసారి ప్రకటిస్తున్నారు. 2022 ఏప్రిల్ 16 వతేది జరిగిన చిన్నపాటి అల్లర్లలో కత్తులను ఊపి రెచ్చగొట్టిన సందర్భంలో స్థానిక బిజెపి నాయకుడు కపిల్ మిశ్రా వెంటనే ఇది ముస్లింల ద్రోహం అనే ప్రచారం మొదలు పెట్టాడు. “వారిని గుర్తించాలి. వారి ఇళ్లను కూల్చేయాలి” అని ప్రకటించాడు. కొన్ని గంటల వ్యవధిలోనే బుల్ డోజర్లు అక్కడ ప్రత్యక్షమయ్యాయి. ప్లానింగ్ ప్రకారం లేవంటూ ముస్లింల ఇళ్లను కూల్చేయడం జరిగిపోయింది. ముస్లిం మైనారిటీలను శిక్షించేందుకు బుల్డోజర్ ఒక ఊహాచిత్రంగా కనపడుతున్నది.

వాస్తవమైనవి, ఊహలతో కూడిన భయంకరమైన సంఘటనలను చరిత్ర నుండి నిరంతరంగా సేకరించి మెజారిటీ మతస్థులను ఒక వైపు, మైనారిటీలను మరోవైపు నిలిపే ప్రయత్నం జరుగుతున్నది. కేవలం రాజకీయ ప్రయోజనం పొందడానికే నిప్పుతో చెలగాటం

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్ధిష్ట వ్యాసాల పైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి**

,

**పిన్: 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

> **"చరిత్రను వక్రీకరించడం, పాత బాధలను వండి వార్చడం భారతదేశ మనుగడకు నష్టం కలిగిస్తుంది. భారతదేశ రాజ్యాంగం నిర్మించిన ప్రజాస్వామ్యం నాశనం అవుతున్నది. ఈ ప్రయత్నాలకి వ్యతిరేకంగా ప్రతిఘటన వేగం కూడా క్రమంగా పెరుగుతున్నది. బలపడుతున్నది."**

ఆడుతున్నారు. (భారతదేశంలో 20కోట్లమంది ముస్లింలు, 3.5 కోట్లమంది క్రైస్తవులు, 2.5 కోట్లమంది సిక్కులు ఉన్నారు.) ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే అంతర్యుద్ధం వచ్చే అవకాశాలు ఉన్నాయి. అది కేవలం ప్రజాతంత్ర వ్యవస్థను కూల్చేయడమే కాదు, రాజ్యం మనుగడకే ప్రమాదంగా మారుతుంది. రాజ్య స్థాపన చారిత్రిక క్రమం అని గుర్తించాలి. అది నిర్ణీతంగా జరిగిన సంఘటన కాదు. ఈ క్రమం ఎప్పుడయినా తిరగబడవచ్చు. అలా తిరగబడ్డ సంఘటనలు చూడడానికి ఎంతో వెనక్కి వెళ్ళక్కరలేదు. ఈ మధ్య 1990లలో యుగొస్లావియా ఒక దేశంగా రద్దయింది. 1971లో పాకిస్తాన్ రెండుగా విభజించ బడింది. 14వ శతాబ్దంలో టర్కీ ముస్లింలు, సెర్బ్‌లో నివసిస్తున్న క్రిస్టియన్లను ఓడించి అవమానించిన 'జ్ఞాపకాలకు' ప్రతిగా 1995లో 8000 మంది బోస్నిక్ ముస్లింలను యుగొస్లోవియాలోని సెబ్రెనికాలో ఊచకోత కోశారు. నిజానికి యుగోస్లావియాలో ముస్లింలు, క్రిస్టియన్లు శాంతియుతంగా జీవిస్తూనే ఉండేవారు. 'ముస్లిం నియంతృత్వం' జ్ఞాపకాలను ఆయుధాలుగా మలిస్తే భారతదేశం కూడా యుగోస్లావియా బాటలోకి వెళుతుంది.

మీ ఛెల్ గూగ్లి ఎల్మో టోర్రి అనే ఇటలీ పండితుడు, ఈ మధ్య కాలంలో భారతదేశం లౌకిక రాజ్యం నుండి హిందూ రాజ్యంగా వేగంగా మారుతున్నదని, అది కూడా ఆధిపత్యంతో, అణచివేతలతో జరుగుతున్నదని రాశారు. ఇది భారతదేశాన్ని ఇంకెంత మాత్రం పూర్తి ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకోలేని పరిస్థితికి దారి తీస్తుందని, ఈనాటి భారతదేశ పరిస్థితులను వర్ణించారు. నిజానికి స్వీడన్‌కి చెందిన డెం సంస్థ, అమెరికాకి చెందిన ఫ్రీడమ్ హౌస్, లేదా ఎకనామిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్‌లు భారతదేశాన్ని సంపూర్ణ ప్రజా స్వామ్య దేశంగా చూపడం లేదు. ప్రస్తుత పాలకుల మైనారిటీ వ్యతిరేక భావనలు, చట్టాలు, మానవ హక్కుల ఉల్లంఘనలు,' భావప్రకటన స్వేచ్ఛ అంతకంతకు తగ్గడం, మీడియా, పౌర సమాజం వెనక్కు వెళ్లిపోవడం– ఈ రకంగా మన దేశం సూచికలో దిగజారి పోడానికి కారణాలుగా ఉన్నాయి.

చరిత్రను వక్రీకరించడం, పాత బాధలను వండి వార్చడం భారతదేశ మనుగడకు నష్టం కలిగిస్తుంది. భారతదేశ రాజ్యాంగం నిర్మించిన ప్రజాస్వామ్యం నాశనం అవుతున్నది. ఈ ప్రయత్నాలకి వ్యతిరేకంగా ప్రతిఘటన వేగం కూడా క్రమంగా పెరుగుతున్నది. బలపడుతున్నది. నిజానికి 1999–2005 మధ్య ఇది మరింత బలంగా ఉండేది. 1977–79 మధ్య కాలంలో అంతకన్నా బలంగా ఉండింది. ఇదే ఆందోళన కలిగించే అంశం. బహుశా స్వతంత్రంగా ఉండ వలసిన సంస్థలన్నీ నిర్వీర్యం కావడం ఇందుకు కారణం అయి ఉండవచ్చు. అలా జరగడానికి మనమే అనుమతిచ్చాం. న్యాయం, పోలీసు, మీడియా, విద్య వ్యవస్థలను నియంత్రించే సంస్థలు అన్నీ మతతత్వానికి సహకరించకపోయినా, ప్రజాస్వామ్యం కూలిపోతుంటే పక్కన నిలబడి చోద్యం చూస్తున్నాయి. విశ్వవిద్యాలయాల నోళ్ళు పాశవికంగా నొక్కబడ్డాయి. భయం, అవకాశ వాద రాజ్యమేలుతోంది. ప్రజలు భిన్నా భిప్రాయాలు చెప్పడానికి, అసమ్మతి తెలియచేయడానికి శంకిస్తున్నారు. చరిత్రపై జరిగే ఇటువంటి దాడిని, కేవలం మెరుగైన చరిత్ర రాయడం ద్వారా మాత్రమే ఎదుర్కోలేం. సామాజిక స్థాయిలో పెద్ద ఎత్తున రాజకీయ జోక్యం అవసరం ఉంది. మెజారిటీ మతస్థులు ఇప్పటికే మతతత్వ భావనలకు లొంగి ఉన్నారని, అందువలన తమ ఓటు బ్యాంకు దెబ్బ తింటుందని భయపడుతూ, రాజ్యాంగం ద్వారా సంక్రమించిన పౌరసత్వ హక్కులతో సహా ప్రాథమిక హక్కులను మైనారిటిల నుండి గుంజుకుంటుంటే, బహిరంగంగా మూక దాడులు చేస్తుంటే, పోలీసుల ఆధీనంలోనే చంపబడుతుంటే మన ప్రత్యర్థి రాజకీయ పార్టీలు చలించడం లేదు.

మైనారిటీల జీవితాలను రక్షించాలని గాంధీ నెహ్రూ చెప్పే రోజులు ఇకలేవు. భారతదేశం మన స్వతంత్ర సమరయోధులు పోరాడిన, నిర్మించిన దేశం లాగా ఇంకెంత మాత్రం లేదు. రాజ్యాంగంలో మనం చేర్చుకున్న జాతీయోద్యమ విలువలు హింసతో ఉల్లంఘించ బడుతున్నాయి.

అయినా పరిస్థితులు ఇంకా పూర్తిగా చేయి దాటి పోలేదు. 2019లో మైనారిటీల పౌరసత్వ హక్కులను లక్ష్యంగా చేసుకున్న పౌరసత్వ చట్టాన్ని ప్రతిఘటించి మన యువతీయువకులు, మహిళలు తమ శక్తిని చాటుకున్నారు. నిరసనకారులు భారతదేశ ప్రజాతంత్ర రాజ్యాంగాన్ని తమకు రక్షగా వాడుకున్నారు. గాంధీ, భగత్‌సింగ్, నెహ్రూ, అంబేద్కర్‌లను తమ గుండెలపై పెట్టుకున్నారు. కరోనా పరిస్థితులను వాడుకుని ప్రజా ఉద్యమాన్ని తీవ్రంగా అణచివేయడం జరిగింది. మతతత్వ అల్లర్లను రెచ్చగొట్టారు. మన రైతులు, వ్యవసాయదారులు మళ్ళీ మన శక్తిని చూపారు. స్వతంత్ర పోరాటంలాగా 2020లో తెచ్చిన వ్యవసాయ చట్టాలను వెనక్కు తీసుకునే వరకు నెలల తరబడి పోరాడారు. వారిపై అంతులేని నిర్బంధాలు ప్రయోగించినా, పోరాటానికి మతం రంగు పులిమినా విజయం సాధించే వరకు పోరాడారు. దేశవ్యాపంగా అనేక పౌర సమాజాలు, కాన్స్టిట్యూషనల్ కండక్ట్ గ్రూపులు– సీనియర్‌లు, గౌరవనీయులు అయిన సివిల్ సర్వెంట్స్, దౌత్య నిపుణులు, సైనికశక్తిలో వివిధ విభాగాలలో పనిచేసిన పూర్వపు అధికారులు, ప్రభుత్వం రాజ్యాంగంలో ఉన్న ప్రజాతంత్ర పంథా నుండి వైదొలగుతున్నందుకు తీవ్రంగా విమర్శిస్తున్నారు. కొన్ని స్వతంత్ర మీడియా సంస్థలు, కొన్ని పత్రికలూ, కొంత మంది పాత్రికేయులు, వ్యక్తిగత హోదాలో కొందరు మేధావులు, రచయితలూ, కళా కారులూ, స్టాండప్ కమెడియన్లు, గాయకులు, చరిత్రకారులు, మానవహక్కుల కార్యకర్తలు, రాజ్య యంత్రాంగం ఎంతగా తీవ్రమైన అణచివేతకు పాల్పడుతున్నా ఎదిరించి నిలబడు తూనే ఉన్నారు.

**(అనువాదం: కె ఉషారాణి)**

# స్వావలంబనతోనే పారిశ్రామికాభివృద్ధి

సంజయ్ రాయ్



సామ్రాజ్యవాదులు విధించిన అంతర్జాతీయ శ్రమ విభజన నుండి విముక్తి పొంది, ఆర్థికాభివృద్ధిలో స్వావలంబన, పారిశ్రామిక వృద్ధి కొరకు నూతన మార్గాన్ని నిర్మించుకోవడం అనేది స్వతంత్ర భారతదేశ ప్రధాన వాగ్దానాలలో ఒకటి, 1838 వరకు భారతదేశం తూర్పు దేశాల్లో పారిశ్రామిక పునాదులు కలిగిన దేశాలలో ఒకటిగా ఉండటమే కాకుండా, దేశ సగటు పారిశ్రామిక వృద్ధిరేటు ప్రపంచ సగటు కంటే ఎక్కువగా ఉంది. వాస్తవానికి 1850ల నాటికే భారతదేశం లో పెద్ద స్థాయి పరిశ్రమలు ఉద్భవించాయి. కానీ వలస పాలకులు సుమారు ఒక శతాబ్దం పాటు ఉద్దేశపూర్వకంగా పారిశ్రామికీకరణను అడ్డుకోవటం వల్ల పరిశ్రమల్లోనూ, వాటికి అనుబంధంగా ఉన్న రంగాలలోనూ పాల్గొనే జనాభా వాటా తగ్గింది.

స్వాతంత్ర్యం వచ్చినప్పుడు మన పారిశ్రామికోత్పత్తి జిడిపిలో 6.6 శాతం ఉండగా ఉపాధి 1.8 శాతం మాత్రమే ఉంది. బ్రిటీష్ పాలన నుండి స్వాతంత్ర్యం పొందిన వెంటనే మన ముందు ఉన్న సవాలు భారతదేశానికి పారిశ్రామిక పునాదిని నిర్మించి, ఆర్థికాభివృద్ధికి మార్గాన్ని వేయడం. ఇది ప్రజల కష్టాలను తగ్గించటమే కాకుండా వలస పాలనలో కొనసాగిన నిర్మాణపరమైన పరాధీనత నుండి బయటపడేస్తుంది. పాశ్చాత్య దేశాలలోని పారిశ్రామిక వృద్ధి కోసం భారతదేశం నుండి వనరులను భారీగా దోపిడీ చేసి, దేశీయ ఉత్పత్తిదారులను వ్యూహాత్మకంగా నాశనం చేయడం ద్వారా బ్రిటన్‌లో తయారైన వస్తువులకు మార్కెట్‌ను సృష్టించే విధానాలను వలస వాదుల అనుసరించారు.

ఈ నేపథ్యంలో పరిశ్రమలకు మౌలిక సదుపాయాలు కల్పించటం, యంత్రాలను ఉత్పత్తి చేసే రంగంలో నిర్మాణానికి భారీ పెట్టుబడులు అవసరమని నవ భారత పాలక వర్గం గ్రహించగలిగింది. అభివృద్ధికి సుదీర్ఘ కాలం తీసుకునేవి, భద్రతలేనివి, తక్కువ లాభాలు వచ్చే రంగాలలో పెట్టుబడి పెట్టగలిగేంత వనరులు అప్పుడు భారతదేశంలోని పెట్టుబడిదారుల వద్ద లేవు. అందువల్ల 1944లోని బాంబే ప్రణాళికలో (స్వాతంత్ర్యానికి ముందు పారిశ్రామికవేత్తలు కూడా ప్రణాళికా రచనల్లో ఉండేవారు) పరిశ్రమలకు మౌలిక సదుపాయాలు కల్పించటం, చాలా అవసరమైన మౌలిక సదుపాయాల రంగాన్ని ప్రభుత్వ యాజమాన్యంలో నిర్మించడానికి ప్రజా ధనాన్ని సమీకరించాలని పారిశ్రామికవేత్తలు సూచించారు. అనుకున్న ప్రణాళికా కాలంలోనే మైనింగ్‌లో అపారమైన పురోగతి సాధించబడింది. మెషిన్లు తయారుచేయటం, రోడ్లు, ఓడరేవులు నిర్మించటం, ఇంకా వ్యవసాయ పనిముట్లు, ఆరోగ్యం, విద్య వంటి కీలకమైన మౌలిక సదుపాయాలకు అవసరమైన సాధనాలు సమకూర్చటం జరిగింది. జీడీపీ లోనూ, తలసరి ఆదాయంలోనూ గణనీయమైన పెరుగుదల వచ్చింది, పేదరికం తగ్గి ఆయుర్ధాయం పెరిగింది. ఇది కొత్తగా ఉద్భవించిన స్వతంత్ర భారత ప్రభుత్వపు ప్రాధాన్యతల ప్రకారం తన వనరులకు అనుగుణంగా, ప్రణాళికా సామర్ధ్యాలు అంచనా వేసి ప్రభుత్వ నియంత్రణ, మార్గదర్శకంలో ఏర్పడిన ఆర్థిక వ్యవస్థ వ్యూహం. దీనితో 1960ల మధ్య వరకు వేగవంతమైన పారిశ్రామికాభివృద్ధి జరిగి, సగటు వార్షిక పారిశ్రామిక వృద్ధి రేటు 6.7 శాతంగా నమోదు అయింది. తర్వాత ఒక దశాబ్దం పాటు పారిశ్రామిక వృద్ధి వార్షిక వృద్ధి రేటు 3.2 శాతంకు పడిపోయింది. కానీ ఎనభైల ప్రారంభంలో మళ్లీ కోలుకుంది. ఈ విధంగా ప్రభుత్వం అనేక విజయాలు సాధించినప్పటికీ, సామాన్య ప్రజల జీవితంలో ఎటువంటి సమూలమైన మార్పు జరగలేదు.

### ప్రణాళిక పాలన వైఫల్యం

గ్రామీణ రంగంలోని వినియోగ వ్యయంపై నియంత్రణను విధించడం ద్వారా మిగులును సేకరించి, వాటిని పెట్టుబడులుగా పెట్టటంపై ప్రణాళికా వ్యూహం ఆధారపడింది. వలసపాలన అనంతరం పెట్టుబడికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన

> “ వాస్తవానికి ప్రభుత్వం అందించిన ప్రోత్సాహకాలకు బదులుగా పారిశ్రామిక అభివృద్ధికి సంబంధించిన నిర్దిష్ట లక్ష్యాలను సాధించడానికి, పారిశ్రామిక వర్గాన్ని క్రమశిక్షణ లో ఉంచాలి. కాని అందుకు బదులుగా వారిపై మరింతగా ఆధారపడింది. యజమానులు తమ స్వ ప్రయోజనాలు మాత్రమే చూసుకునే కుటిల పెట్టుబడిదారీ విధానానికి ఈ పరిస్థితి దారితీసింది. ”

అవసరం ఉన్నప్పుడు, వినియోగ ఎంపికలకు ప్రాధాన్యత ఇస్తూ చేసిన వ్యూహం ఒక స్థాయికి మించి ఎదుగుదలను సాధించలేకపోయింది. దీనివల్ల గ్రామీణ ఆదాయంలో స్తబ్దత ఏర్పడి పారిశ్రామిక వస్తువుల డిమాండ్ పెరగటానికి ఆటంకాలు వచ్చాయి. ఈ సందర్భంలో భూ సంస్కరణలు అమలు జరిపినట్లయితే, ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లో ఈ పునఃపంపిణీ పారిశ్రామిక వృద్ధికి, పరిశ్రమలు విస్తరించేందుకు అవకాశం కల్పించేది. సంపద పునఃపంపిణీకి దారితీయగలిగి ఉండేవి. కానీ భూ సంస్కరణల ఎజెండా పూర్తిగా నెరవేరలేదు. మరోవైపు గుత్తాధిపత్యం పెరిగింది. భారతదేశంలోని పారిశ్రామికవేత్తలు రక్షిత మార్కెట్ నుండి భారీ రుణాలను సేకరించారు. పారిశ్రామికీకరణ ఆలస్యమైన అనేక దేశాలలో ప్రభుత్వాలు పరిశ్రమలకు నిర్దిష్ట ప్రోత్సాహకాలను అందించాయి. అయితే ఆ సందర్భాలలో ప్రభుత్వం పారిశ్రామిక వర్గాన్ని క్రమశిక్షణలో ఉంచింది. రాయితీల వంటివి తీసుకుని వాటిని స్థిరమైన పోటీ సామర్థ్యాలను నిర్మించడంలో ఉపయోగించాయి. ముందుగా పారిశ్రామి కీకరణ చెందిన దేశాలలో జరిగిన విధంగా కాకుండా భారతదేశంలో అనేక రంగాలలో సుదీర్ఘమైన పోటీ దశను దాటకుండానే తక్కువ పోటీతో కొంత మంది మాత్రమే మార్కెట్‌ను స్వాధీనం చేసుకొగలిగిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం అందించిన రాయితీల ద్వారా ఇది సాధ్యమైంది.

వాస్తవానికి ప్రభుత్వం అందించిన ప్రోత్సాహకాలకు బదులుగా పారిశ్రామిక అభివృద్ధికి సంబంధించిన నిర్దిష్ట లక్ష్యాలను సాధించడానికి, పారిశ్రామిక వర్గాన్ని క్రమశిక్షణలో ఉంచాలి. కాని అందుకు బదులుగా వారిపై మరింతగా ఆధారపడింది. యజమానులు తమ స్వ ప్రయోజనాలు మాత్రమే చూసుకునే కుటిల పెట్టుబడిదారీ విధానానికి ఈ పరిస్థితి దారితీసింది. అధిక ద్రవ్యోల్బణం, బ్లాక్ మార్కెటింగ్, ఆహార సంక్షోభం, పెరుగుతున్న పేదరికం మొదలగునవి స్వాతంత్ర్యానంతర భారతదేశంలో వివిధ ప్రాంతాలలో సామూహిక అశాంతికి ఆజ్యం పోసింది. దేశీయ డిమాండ్ నిరంతరంగా బలహీనంగా ఉంది. ఇటువంటి పరిస్థితిలో పెరుగుతున్న అసమానతల వంటి సమస్యలను పరిష్కరించకుండా వినియోగ వ్యయాన్ని తగ్గించడం ద్వారా పెట్టుబడిని సమీకరించడం వల్ల ప్రణాళికా వైఫల్యానికి దారితీసి పారిశ్రామిక అభివృద్ధి దెబ్బతింది. భారత ఆర్థిక వ్యవస్థలో ఉడుతున్న వైరుధ్యాలను సమన్వయపర్చటానికి సంస్కరణల అవసరం నిస్సందేహంగా ఉంది. అయితే సమాన ఆదాయ పంపిణీ ద్వారా భారతదేశ ప్రజల అవసరాలకు ప్రాధాన్యత ఇస్తూ వనరులపై ప్రజల నియంత్రణను ఎక్కువ చేయటం ద్వారా దేశీయ డిమాండ్‌ను పెంపొందించడమనే కీలకమైన సమస్యను పరిష్కరించడానికి బదులుగా సరళీకరణ విధానాలు అవలంబించారు. ఈ విధానాలు అంతర్జాతీయ ఏకీకరణ మార్గాన్ని అవలంబించటంతో స్వావలంబన ఎజెండాకు ఊపిరి ఆడకుండా చేసింది.

### మూడు దశాబ్దాల సంస్కరణలు

భారతదేశంలో నయా–ఉదారవాద ఆర్థిక సంస్కరణలు పరిస్థితిని మరింత దిగజార్చాయి. ఇది వనరులు, ఆదాయాన్ని కేటాయించే ప్రధాన యంత్రాంగంగా మాత్రమే మార్కెట్‌ను తయారుచేసింది. పేద దేశాల ఆర్థిక వ్యవస్థలను సరళీకృతం చేయడం ద్వారానే అంతర్జాతీయ పెట్టుబడులకు కొత్త అవకాశాల సృష్టి జరుగుతుంది అనే భావన వైపు తోసింది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో లోపలకి వచ్చే పెట్టుబడుల ప్రవాహం తోనే వృద్ధి, ఉపాధి పెరుగుదల జరుగుతుందనే భావన నయా – ఉదారవాద సంస్కరణల కీలకమైన ప్రచారం. 1980వ దశకం చివరలో వాణిజ్య సరళీకరణ ప్రారంభమైంది. ఆ కాలంలో విదేశీ మూలధన ప్రవాహం పారిశ్రామిక వృద్ధిని పెంచింది. అయితే అదే సమయంలో విదేశీ మారకద్రవ్య సంక్షోభం చివరకు పూర్తి సంస్కరణలకు దారితీసింది. వస్తువులు, సేవలు,

**‘మార్క్సిస్టు’కు మీ సందేహాలు రాయండి!**

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా.**

**సెల్: 9490099333** email: venkataraosankarapu@gmail.com

మూలధనపు సునాయాస ప్రవాహానికి అన్ని రకాల రక్షణ, టారిఫ్ అడ్డంకులు క్రమంగా తొలగించబడ్డాయి. అందువల్ల సరళీకరణ అనంతర కాలంలో భారతదేశంలో సగటు వృద్ధి, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ప్రవాహం పెరిగింది. కానీ వృద్ధి ప్రక్రియ ఉపాధి కల్పన నుండి వేరు చేయబడింది. ఉత్పాదక రంగాలలో విదేశీ మూలధన ప్రవాహం అభివృద్ధి చెందిన దేశాల నుండి ఉత్పత్తిని పేద దేశాలకు తరలించింది. అందువల్ల ప్రధానంగా చౌకైన సహజ వనరులు, నైపుణ్యం కలిగిన, నైపుణ్యం లేని కార్మికులతో పాటు భారత్, చైనా వంటి దేశాలలో అధికంగా పెరిగిన మధ్యతరగతి వల్ల పెరుగుతున్న మార్కెట్‌ను ఉపయోగించుకోవడం ద్వారా లాభం పొందింది. ఏది ఏమైనప్పటికీ, పరిశ్రమలలో ప్రధాన పెట్టుబడులు అభివృద్ధి చెందిన దేశ ప్రమాణాల ప్రకారంగా అధిక శ్రామికులు అవసరమైన రంగాలకు మాత్రమే పరిమితం చేయబడ్డాయి. అయితే ఆతిథ్య దేశాల వనరుల లభ్యతపరంగా చూస్తే అధిక పెట్టుబడులు అవసరమయ్యే రంగాలకు పరిమితమయ్యాయి. ఫలితంగా ఉత్పాదక కార్యకలాపాలలో విదేశీ పెట్టుబడులు తగినంత ఉపాధిని సృష్టించలేదు. మరీ ముఖ్యంగా విదేశీ నిధుల ప్రవాహంలో ఎక్కువ భాగం ఆర్థిక మార్కెట్ల వైపు మళ్లించబడుతూ ఊహాగానాలకు, ఊహాజనితమైన ఆస్తులను సృష్టించేందుకు దోహదపడుతుంది. అందువల్ల సరళీకరణ అనంతరం ఆర్థిక బుడగలు వృద్ధికి కీలకమైన చోదకాలుగా ఉద్భవించాయి. ఆర్థిక ఆధిపత్యం జాతి రాజ్యాల స్వయం ప్రతిపత్తిని దారుణంగా తగ్గించింది. ముఖ్యంగా, అంతర్జాతీయ పోటీ మార్కెట్‌లో తట్టుకుని నిలబడాలనుకుంటున్న ఈ దేశాల పాలక వర్గాలు ఎమెన్సీల అధీనంలో ఉండటం వల్ల, అంచనాల బుడగల మీద స్వారీ చేస్తూ వారి ఆర్థిక స్వేచ్ఛను చూసుకోవాలి. ఇది ఉపాధి నుండి వృద్ధిని విడదీయడానికి దారితీసింది. ధనిక, ఎగువ మధ్యతరగతి వర్గాలకు మాత్రమే వృద్ధి విస్తరణ పరిమితమై ఉండి. అసమానతల పెరుగుదలకు ఆజ్యం పోసింది.

**స్వావలంబనతో జరిగే వృద్ధి కోసం పోరాటం**

ప్రభుత్వ నిర్దేశిత మిశ్రమ ఆర్థిక వ్యవస్థ వ్యూహపు వైఫల్యం ప్రైవేట్ లాభాలకు ప్రాధాన్యత ఇచ్చి దేశ నిర్మాణంలో సామూహిక బాధ్యత విస్మరించటమే కారణమని చెప్పలేం. అయితే ఇటువంటి వ్యవహారాలను ప్రైవేట్ గుత్తాధిపత్యాలు హైజాక్ చేస్తున్నాయి, ఇవి రక్షిత మార్కెట్‌లో ఉండి, ప్రభుత్వ విధానాలను ప్రైవేట్ వారి లాభాల కొరకు వాడు కుంటు న్నాయి.

**“ ప్రభుత్వ నిర్దేశిత మిశ్రమ ఆర్థిక వ్యవస్థ వ్యూహపు వైఫల్యం ప్రైవేట్ లాభాలకు ప్రాధాన్యత ఇచ్చి దేశ నిర్మాణం లో సామూహిక బాధ్యత విస్మరించటమే కారణమని చెప్పలేం. అయితే ఇటువంటి వ్యవహారాలను ప్రైవేట్ గుత్తాధిపత్యాలు హైజాక్ చేస్తున్నాయి, ఇవి రక్షిత మార్కెట్ లో ఉండి, ప్రభుత్వ విధానాలను ప్రైవేట్ వారి లాభాల కొరకు వాడు కుంటున్నాయి. ”**




స్వావలంబనకు నిలువుటద్దం విశాఖ ఉక్కు ఫాక్టరీ: బిజెపి ప్రభుత్వం కుట్రపూరిత పద్ధతుల్లో దీన్ని ప్రయివేటు వారికి కారుచౌకగా అమ్మడానికి ప్రయత్నిస్తోంది

దోపిడీ, అణచివేత నిర్మూలన దిశగా స్వాతంత్ర్య పోరాటాన్ని విస్తరింపజేయాలనే తపనతో ఉన్న శ్రామిక ప్రజలలో పెరుగుతున్న సమూల సంస్కరణవాదం పట్ల పాలక వర్గాలు భయంగా ఉన్నాయి. గ్రామీణ భారతదేశంలోని ఈ శ్రామికవర్గం పెద్ద పారిశ్రామిక సంస్థలకు అనుకూలంగా ఉంటే, భూస్వామ్య శక్తులు వేరొక అభివృద్ధి పథానికి అనుకూలంగా ఉన్నాయి. మరొక వైపు పెరుగుతున్న అసమానతలు, డిమాండ్ దీర్ఘకాలిక కొరత ఆర్థికవృద్ధి మందగించటానికి దారితీశాయి.

మరోవైపు నయా – ఉదారవాద సంస్కరణల దశలో పాలకవర్గం అన్ని రకాల సామూహిక ఆందోళనలను తిరస్కరించడమే కాకుండా ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్ ఆస్తులుగా మార్చడానికి అనుకూలంగా వాదిస్తోంది. వాస్తవానికి ఆస్తుల ద్రవ్యోల్బణంపై ఆధారపడిన వృద్ధి పథం అసమానతలను సృష్టించడమే కాకుండా దానిపైనే చాలా బలంగా వర్థిల్లుతుంది. గత మూడు దశాబ్దాల సంస్కరణల ద్వారా ప్రపంచ మార్కెట్‌లో పోటీపడేలా తన పారిశ్రామిక సామర్థ్యాన్ని పెంపొందించు కోవడంలో భారతదేశం విఫలమవడమే కాకుండా ఈ కాలంలో మన ఎగుమతులలో దేశీయ విలువ జోడింపు కూడా బాగా పడిపోయింది. దీర్ఘకాలిక పారిశ్రామిక వృద్ధికి వ్యూహరచన కాకుండా, అంతర్జాతీయ ఉత్పత్తి వ్యవస్థ ఏకీకరణ ద్వారా కొత్త అంతర్జాతీయ శ్రమ విభజనలో ఒక భాగం అయ్యేలా ఎంఎన్‌సిలు దృష్టి సారించాయి. గత మూడు దశాబ్దాలలో భారతదేశంలోని శ్రామిక ప్రజలు జిడిపిలో తమ వాటాను భారీగా కోల్పోగా, కార్పొరేట్‌ల లాభాలు పెరిగాయి. స్వావలంబన ఎజెండా భారీ ఎదురుదెబ్బకు గురవుతోంది, ఎందుకంటే మన స్వాతంత్ర్యానికి స్వప్రకటిత యజమానులుగా ప్రకటించుకున్నవారు, పాలకులు కలిసి భారతదేశ ప్రజల ఆసక్తులను, ప్రయోజనాలను చెవికెక్కించుకోకుండా, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ప్రయోజనాల కోసం పని చేయటంలో ఎక్కువ ఆసక్తిని కలిగి ఉన్నారు. స్వయం సమృద్ధితో కూడిన ఆర్థికవ్యవస్థను అభివృద్ధి చేసుకోవాలంటే దీనిని తిప్పికొట్టాలి.

**(అనువాదం: కె పుష్పవల్లి)**

# మతతత్వం - సామాజిక సమస్యలు



రచయిత సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు

బి.వి.రాఘవులు

మన సమాజపు సామాజిక జీవనాన్ని నడిపించడానికి సనాతన ధర్మాన్ని కచ్చితంగా పాటించాలని, హిందూ జాతి స్వచ్ఛతను కాపాడుకోవాలని ఆరెస్సెస్ విశ్వసిస్తుంది. ఈ అభివృద్ధి నిరోధక అవగాహన మూలంగానే, జెండర్ పట్ల, కులం పట్ల దాని తిరోగామి దృక్పథం ఆవిర్భవిస్తుంది. జెండరు, కుల విభజనలు దైవ నిర్దేశితాలని, ప్రకృతి సహజమైన వైవిధ్యాలని చెబుతుంది. ఈ వైవిధ్యాలను వ్యక్తం చేయడమే వాటి పాత్ర అని అంటుంది. జెండరు ఆధారిత, కుల ఆధారిత అణచివేత, వివక్ష, అసమానతల ఆరోపణలు కేవలం సనాతన ధర్మ వ్యతిరేకుల కల్పితాలని, లేదా ముస్లిం, పాశ్చాత్య విదేశీ ప్రభావాల ఫలితమని కొట్టిపారేస్తుంది.

**మాటవరుసకే సమానత్వం**

హిందూత్వలో సమానత్వం అనే భావనను మైనారిటీల, దళితుల, మహిళల హక్కులను కాలరాయడానికి ఒక సాధనంగా సంఘపరివార్ వక్రీకరిస్తుంది. సమానత్వం పట్ల బిజెపి వైఖరి లాంఛనప్రాయమైనది. ఉదాహరణకు చట్టం ముందు అందరూ సమానమే అంటే సామాజిక, ఆర్థిక అసమానతలను విస్మరించడం. సమానత్వం పట్ల ఇలాంటి లాంఛనప్రాయమైన వైఖరి కలిగి ఉండటం మూలంగానే అధికరణం 370ని, 35ఎ ని వ్యతిరేకించడం, ఉమ్మడి పౌరస్మృతి కోసం డిమాండ్ చేయడం, మైనారిటీ కమిషన్ స్థానంలో మానవ హక్కుల కమిషన్ ఉండాలనడం, రిజర్వేషన్లను పునఃసమీక్షించాలని డిమాండ్ చేయడం జరుగుతున్నది.

అందరినీ సమానంగా పరిగణించాలనడాన్ని, చట్టం ముందు అంతా సమానమే అనడాన్ని మైనారిటీలకు కల్పించే ప్రత్యేక ప్రతిపత్తిపై దాడి చేయడానికి వినియోగించుకుంటున్నది. అన్ని మతాలను సమానంగా గౌరవించాలని అనడం అంటే, అసమానతకు దారితీసే సమాన పరిగణన కాదు. సమానంగా పరిగణించబడాలంటే ముందు అసమానంగా ఉన్న వాటిని అసమానంగా పరిగణనలోకి తీసుకోవడం అవసరం.

సామరస్యం, సమానత్వం సమాజ నిర్మాణ సూత్రం కాదని ఆరెస్సెస్ భావిస్తుంది. సమానత్వం అంటే అర్థం వైవిధ్యంలోనే సామరస్యం. అంటే అసమాన భౌతిక పరిస్థితుల లోపల సామరస్యం. సమానత్వానికి ఆరెస్సెస్ ఇచ్చే నిర్వచనం సమానత్వ స్ఫూర్తికే విరుద్ధమైనది.

**జండర్ అసమానతకు సమర్థన**

హిందూ సమాజంలో పురుషుడు అధికుడు అని ఆరెస్సెస్ భావిస్తుంది. మహిళ 'మాతృశక్తి' కి చిహ్నం అని చెబుతుంది. పురుషులు, స్త్రీల మధ్య అసమానత అనేదే లేదు. సమాజంలో వారి విభిన్న పాత్రలు, వారి సహజ స్వభావ వ్యక్తీకరణలే. సంతానోత్పత్తి చేసి, ఇంట్లో ఉండి పిల్లలను పెంచడం స్త్రీ బాధ్యత. ఆమె ప్రధాన బాధ్యత కొడుకులకు జన్మనివ్వడం, వారిని ఆరోగ్యవంతమైన, శక్తివంతమైన వారిగా అభివృద్ధిచేయడానికి తన శాయశక్తులా కృషిచేయడం. కుటుంబాన్ని పోషించేందుకు పురుషుడు సంపాదించాలి. ఇంటిని నిర్వహించడం మహిళ బాధ్యత. అందుచేత పురుషుడు విద్యావంతుడు కావడం స్త్రీ విద్యావంతురాలు కావడం కన్నా ముఖ్యమైనది. స్త్రీ బాధ్యతలు నాలుగు గోడల మధ్యనే కాబట్టి, బాలికలకు కూడ భవిష్యత్తులో తమ బాధ్యతలు నిర్వర్తించేలా వారికి నేర్పే విద్య, శిక్షణలు ఉండాలి. పురుషుల, స్త్రీల నిర్దిష్ట పాత్ర, బాధ్యతల పట్ల ఈ అవగాహనే హిందూ కుటుంబ వ్యవస్థ ఇంతటి పటిష్టంగా ఉండటానికి కారణం.

సంఘపరివార్ అవగాహన దాని మధ్య యుగాల పురుషాధిక్య, అభివృద్ధి నిరోధక భావజాలాన్ని బట్టబయలు చేస్తుంది. మహిళలకు వ్యక్తిత్వాన్ని, సమానత్వాన్ని ఆరెస్సెస్ నిరాకరిస్తుంది. ప్రాచీన హిందూ ఔన్నత్యం పేరుతో మహిళల అణచివేతను, వివక్షను చట్టబద్ధం చేయడానికి ప్రయత్నిస్తుంది. మహిళలను నాలుగు గోడలకే పరిమితం చేయాలని ఆరెస్సెస్ ప్రయత్నిస్తుంది. సంప్రదాయం పేరుతో వారిని దిగువ శ్రేణి వారిగా తయారు చేస్తుంది. సమాజం లోపల కాని, కుటుంబం లోపల కాని జండర్ సంబంధాల మార్పును అది కోరుకోదు. అసమానతలను, మహిళల పట్ల వివక్షను సహజమైనవేకాకుండా, హిందూ సమాజ లక్షణమని భావించే సామాజిక వ్యవస్థను నిర్మించాలని అది కోరుకుంటుంది.

బాలికలు తమ తల్లితండ్రులకు, భార్యలు తమ భర్తలకు లోబడి ఉండాలని, లేదంటే వారు కుటుంబ కలహాలకు బాధ్యులవుతారని ఆరెస్సెస్ చెబుతుంది. వితంతువులు తమ పిల్లల కోసం మళ్ళీ పెళ్లి చేసుకోరాదు. జండర్ హక్కులు అనే తప్పుడు అవగాహన, పురుషాధిక్యత అనే వూహాజనిత భావనకు దారితీస్తుంది.

ప్రజల 'పాశ్చాత్య జీవన విధానం' గ్యాంగ్

రేపులు, లైంగిక నేరాలు లాంటి మహిళలపై అత్యాచారాలకు కారణమని ఆరెస్సెస్ నిందిస్తుంది. నిరుద్యోగానికి కారణం ప్రభుత్వ విధానాలు కాదు, మహిళలు ఎక్కువగా ఉద్యోగాల్లో చేరడమే అని చెబుతుంది. కలిసి తిరగడం వల్ల కలిగే 'దుష్ఫలితాల'ను నివారించాలన్నా, హిందూ జాతి స్వచ్ఛతను పరిరక్షించాలన్నా (హిందూ జాతి స్వచ్ఛత అంటే అగ్రకుల (బ్రాహ్మణ జాతి స్వచ్ఛత) స్త్రీలను, పురుషులను విడివిడిగా ఉంచాలని ఆరెస్సెస్ చెబుతుంది. వర్ణాశ్రమ ధర్మం పేరుతో, మనుధర్మ శాస్త్రంలోని ఆదేశాల పేరుతో కులాంతర, మతాంతర వివాహాలను, సంబంధాలను అది వ్యతిరేకిస్తుంది. కులాంతర, మతాంతర వివాహాలు, స్నేహాల ఆరోపణలతో సంఘపరివార్‌కు చెందినవారు దేశవ్యాపితంగా యువజంటలపై అసంఖ్యాకమైన దాడులు చేస్తున్నారు. ముస్లిములు 'లవ్ జిహాద్'కు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ వారిపై హింసాత్మక దాడులు చేస్తున్నారు. నాజీలు చేసిన ఇలాంటి ప్రచారాన్నే ఇది గుర్తు చేస్తున్నది.

రూప్‌కన్వర్ సతీసహగమనం జరిగినపుడు ఆనాటి బిజెపి ఉపాధ్యక్షురాలు విజయరాజె సింధియా సతికి మద్దతుగా ర్యాలీలు నిర్వహించారు.

2018, సెప్టెంబరు 28న సుప్రీంకోర్టు శబరిమల అయ్యప్ప ఆలయం లోకి మహిళలను అనుమతించాలని తీర్పునిచ్చింది. ఆరెస్సెస్ తొలుత ఈ తీర్పును స్వాగతించినప్పటికీ, ఆ తర్వాత ప్లేటు ఫిరాయించి 'శబరిమలను రక్షించాలి' అంటూ హింసాత్మక ఆందోళనలను రెచ్చగొట్టింది.

### కుల వ్యవస్థకు మద్దతు – దళితుల పట్ల వివక్ష

ఆరెస్సెస్ భావజాలం వర్ణాశ్రమ వ్యవస్థ, కుల వ్యవస్థ నుండి విడదీయలేనిది. గోల్వాల్కర్ కులవ్యవస్థను ఈ విధంగా సమర్థించాడు: ప్రస్తుత అసమానతలు శాస్త్రీయ సమాజ నిర్మాణ పర్యవసానం అని, ఆ అసమానతలు శరీరంలోని వివిధ అంగాల వంటివని అభివృద్ధి చెందిన సమాజం గుర్తించినపుడు వైవిధ్యం చెడుగా పరిగణించబడదు. మన చాతుర్వర్ణాలు విరాట్ పురుషుని వివిధ అంగాలు అని దీన్ దయాల్ ఉపాధ్యాయ చెప్పాడు. ఈ అంగాలు ఒకదానికొకటి పరస్పర పూరకాలు మాత్రమే కాదు, వాటికి స్వంత వ్యక్తిత్వం, ఏకత్వం కూడ ఉంటుందని అన్నాడు. మనుస్మృతిలోని విలువలకు ఆధునిక,

“ ఆరెస్సెస్ కులవ్యవస్థలో విశ్వాసం కలిగి ఉంటుంది. నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో తనకు నిర్దేశించబడిన స్థానానికి అనుగుణంగా ప్రతి వ్యక్తి తన కర్తవ్యాన్ని ఎలాంటి ఫిర్యాదు లేకుండా నిర్వర్తించాలి. ఇదే ఆదర్శ మని ఆరెస్సెస్ కీర్తిస్తుంది. ”

సమాజీకరించబడిన రూపమే బిజెపి ప్రతిపాదించిన సమగ్ర మానవతావాదం. మానవ శరీరం సక్రమంగా పనిచేయాలంటే ప్రతి అంగం తనకు కేటాయించిన పనిని సక్రమంగా చేసుకుంటూ పోవాలని, అలాగే సమాజం సక్రమంగా నడవాలంటే ప్రతి సమూహం తనకు నిర్దేశించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలని చెబుతుంది. అంటే కులవ్యవస్థను ఆధునిక కాలంలో కూడ కొనసాగించాలి.

ఆరెస్సెస్ కులవ్యవస్థలో విశ్వాసం కలిగి ఉంటుంది. నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో తనకు నిర్దేశించబడిన స్థానానికి అనుగుణంగా ప్రతి వ్యక్తి తన కర్తవ్యాన్ని ఎలాంటి ఫిర్యాదు లేకుండా నిర్వర్తించాలి. ఇదే ఆదర్శమని ఆరెస్సెస్ కీర్తిస్తుంది.

ధర్మాల ఆచరణ గురించి వివిధ స్మృతులు వివరించాయి. వీటిలో అత్యంత దుర్మార్గమైనది మను ధర్మస్మృతి. అది శూద్రులకు అమానవీయమైన అనేక బాధ్యతలను నిర్దేశించింది. ఇతర ధర్మశాస్త్రాలు, పురాణాలు దళితుల పట్ల ఇదే క్రూరత్వాన్ని ప్రదర్శించాయి. అవి దళితులపై వైకల్యాన్ని రుద్దాయి. అవి దళితులకు విద్యను దూరం చేశాయి, దళితులను అవి మానవులుగా పరిగణించలేదు. ఇది శతాబ్దాల తరబడి కొనసాగింది.

నరేంద్ర మోడీ ఎంత వరకు వెళ్లాడంటే, చేతులతో పనిచేసే దళిత పాకీ పనివారు తమ పనిలో ఆధ్యాత్మిక ఆనందాన్ని అనుభవించాలని చెప్పాడు. ఇద్దరు దళిత పిల్లలు సజీవదహనం చేయబడితే కేంద్ర క్యాబినెట్ మంత్రి వికె సింగ్ దానిని కుక్క చావుతో పోల్చాడు.

ఆరెస్సెస్, దాని అసంఖ్యాక అంగాలు చరిత్రను తిరగరాయడానికి నిరంతరం ప్రయత్నిస్తుంటాయి. కులవ్యవస్థను ముస్లిములే భారతదేశంలో ప్రవేశపెట్టారని, వారి రాకకు ముందు అందరూ సామరస్యంతో, సమానత్వంతో జీవించారని చెబుతాయి.

ధృఢమైన సామాజిక బంధాలు ఏర్పరచడానికి కులవ్యవస్థ దోహదపడుతుందని ఆరెస్సెస్ విశ్వసిస్తుంది. సమరసత అంటే సాదృశ్యత గురించి, సమత అంటే సమానత్వం గురించి అది మాట్లాడుతుంది. ప్రతి కులము తన ఉనికిని కొనసాగించాలని, కులం అనేది సజీవంగా ఉండాలని, నిర్మూలించబడకూడదని కోరుకుంటుంది. దళితులను అంటరానివారుగా చూసేంతటి ధైర్యం అరెస్సెస్‌కు లేనప్పటికీ, రాజ్యాంగపరంగా కాని, చట్టపరంగా కాని, రిజర్వేషన్ల పరంగా కాని క్రింది కులాల పరిస్థితిని మెరుగుపరిచే సంస్కరణలు దానికి ఇష్టం ఉండవు.

దళితుల ఉద్యమాలు వేటిలోను, దళితుల ఆలయ ప్రవేశం కోసం జరిగిన ఏ ఉద్యమంలోను ఆరెస్సెస్ పాల్గొనలేదు. స్వాతంత్ర్యం లభించి ఇన్ని దశాబ్దాలు గడిచినా ఇప్పటికీ దేశంలో అనేక దేవాలయాలలోకి దళితులకు ప్రవేశం లేదు. అదే విధంగా ప్రాచీన హిందూ సంప్రదాయంలో భాగంగా చెప్పే అనేక దుష్ట ఆచారాలు నేటికీ సమాజాన్ని పట్టి పీడిస్తున్నప్పటికీ వాటిని ఆరెస్సెస్ బహిరంగంగా ఎన్నడూ ఖండించలేదు.

ఆరెస్సెస్ అధినేత రిజర్వేషన్ల విధానాన్ని సమీక్షించాలని చెప్పడం ఆరెస్సెస్ ఎజెండాలో ఒక భాగం. దళితులు, ఆదివాసీలు, వెనకబడిన తరగతుల సాధికారతను ఆరెస్సెస్ కోరుకోదు. మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేయడానికి పూనుకున్నపుడు అద్వానీ నాయకత్వంలోని బిజెపి ఆనాడు దేశవ్యాపితంగా ప్రజలను మతాలవారీగా రెచ్చగొట్టడానికి రామజన్మభూమి ఉద్యమాన్ని ఆరంభించింది. ఆరెస్సెస్ మద్దతుదారులు రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమాన్ని లేవగొట్టారు. ఆత్మాహుతులు కూడ చోటు చేసుకున్నాయి. వీటన్నింటి వెనుక హిందూత్వ శక్తులు ఉన్నాయి.

దళితులను హిందూత్వీకరించాలని ఆరెస్సెస్ కోరుకుంటుంది. అగ్రవర్ణ ఆధిపత్యం

> “ అంబేద్కర్ భావజాలం, ఆరెస్సెస్ భావజాలం రెండూ రెండు భిన్న ధృవాలు. అంబేద్కర్ సమానత్వం కోసం నిలబడితే, ఆరెస్సెస్ నిచ్చెనమెట్ల కులవ్యవస్థ కోసం నిలబడుతుంది. అంబేద్కర్‌కు ఆరెస్సెస్ భావజాలం పట్ల విశ్వాసం ఉందని ఆరెస్సెస్ చెప్పకుంటుంది. 2015 ఫిబ్రవరిలో మోహన్ భగవత్ ఈ మాట చెప్పాడు. అంబేద్కర్ 124వ జయంతిని పురస్కరించుకొని ఆరెస్సెస్ అనేక కార్యక్రమాలను చేపట్టింది. ఈ కార్యక్రమాలన్నీ అంబేద్కర్‌కు హిందూత్వపట్ల మొగ్గు ఉన్నట్లు చూపించాయి. ”

చెదరకుండా హిందువులను ఏకం చేయాలన్న దాని లక్ష్యంలో భాగమే ఇది. ముస్లిములను విదేశీ శత్రువులుగా దళితుల ముందు నిలబెట్టడం ద్వారా కుల వ్యవస్థలోని మరింత లోతైన సంఘర్షణకు ముసుగు వేసేందుకు సంఘపరివార్ ప్రయత్నిస్తున్నది.

దళితులలో ఎదిగి వస్తున్న వారిని సోషల్ ఇంజనీరింగ్ పన్నాగాల ద్వారా ఆరెస్సెస్ తనకు అనుసంధించుకుంటున్నది. కొంతమంది దళిత మధ్యతరగతివారిలో పైకి ఎదిగాలన్న కోరికను, సమాజంలో ఉన్నత హోదా పొందాలన్న ఆకాంక్షను సంఘపరివార్ వినియోగించుకుంటున్నది. వారిని సంస్కృతీకరించి తన హిందూత్వ పథకంలో భాగస్వాములను చేస్తున్నది. ఈ సంస్కృతీకరణ వారిని అగ్రవర్ణ హిందువులను అనుకరించేలా చేస్తుంది. రకరకాల బాబాల ఆధ్వర్యంలో నడుస్తున్న నూతన తెగలను కూడ ఆరెస్సెస్ వినియోగించుకుంటుంది. వారు ఆధునికత ముసుగువేసుకొని, తీపితీపి ప్రసంగాలు చేస్తూ దళితులలో పనిచేస్తుంటారు. దళిత అస్తిత్వాన్ని సార్వత్రిక హిందూ అస్తిత్వంలో కలిపేసుకోవడానికి ఆరెస్సెస్ రాత్రి పాఠశాలలను, వేసవి శిబిరాలను కూడ వినియోగించుకుంటున్నది. బలహీన వర్గాల కళ్ళు కప్పడానికి ఫూలె, అంబేద్కర్ లాంటి సంస్కర్తల పేర్లను కూడ బిడియం లేకుండా వినియోగించుకుంటుంది. ప్రభావశీలమైన దళిత కులాలకు ప్రాతినిధ్యం కల్పించడం, వాటి సామాజిక చిహ్నాలను గుర్తించడం బిజెపి అనుసరిస్తున్న నూతన సామాజిక ఇంజనీరింగ్‌లో భాగమే.

ప్రధాని నరేంద్ర మోడీ తనను తాను 'అంబేద్కర్ భక్తుని'గా అభివర్ణించుకున్నాడు. దళితులను ఆకర్షించడానికి బిజెపి తన రాజకీయ ప్రచారాందోళనల్లో అంబేద్కర్ పేరును, ఫోటోలను పథకం ప్రకారం వినియోగించుకుంటున్నది.

అంబేద్కర్ భావజాలం, ఆరెస్సెస్ భావజాలం రెండూ రెండు భిన్న ధృవాలు. అంబేద్కర్ సమానత్వం కోసం నిలబడితే, ఆరెస్సెస్ నిచ్చెనమెట్ల కులవ్యవస్థ కోసం నిలబడుతుంది. అంబేద్కర్‌కు ఆరెస్సెస్ భావజాలం పట్ల విశ్వాసం ఉందని ఆరెస్సెస్ చెప్పకుంటుంది. 2015 ఫిబ్రవరిలో మోహన్ భగవత్ ఈ మాట చెప్పాడు. అంబేద్కర్ 124వ జయంతిని పురస్కరించుకొని ఆరెస్సెస్ అనేక కార్యక్రమాలను చేపట్టింది. ఈ కార్యక్రమాలన్నీ అంబేద్కర్‌కు హిందూత్వపట్ల మొగ్గు ఉన్నట్లు చూపించాయి.

కాని అంబేద్కర్ భారత జాతీయత కోసం, లౌకిక తత్వం కోసం, సామాజిక న్యాయం కోసం కట్టుబడినవాడు. ఆరెస్సెస్ భావజాలం మాత్రం హిందూ జాతీయవాదం పైన, హిందూ రాజ్యం పైన ఆధారపడింది.

కులవ్యవస్థ నిజస్వరూపం గురించి ప్రజల కళ్ళు కప్పడానికి ఆరెస్సెస్ ఎన్ని వేషాలు వేసినప్పటికీ, హిందూ సంస్కృతిలో కుల వ్యవస్థ కీలకమైన అంశం అని, భారత దేశానికి అతిపెద్ద బలం కుల వ్యవస్థేనని ధృఢంగా విశ్వసిస్తుంది. కులం ఎప్పుడైతే బలహీనమవుతుందో అప్పుడు భారత దేశం కూడ బలహీనపడుతుందని ఆరెస్సెస్ భావిస్తుంది. కులం బలంగా ఉన్నపుడే భారత దేశం శక్తివంతంగా ఉండేది అని చెబుతుంది. గోల్వాల్కర్ ఇలా చెప్పాడు, “బుద్ధిజం కుల వ్యవస్థను విచ్ఛిన్నం చేసిన వాయవ్య భారతం కాని, ఈశాన్య భారతం కాని ముస్లిముల దండయాత్రలకు తేలిగ్గా లొంగిపోయాయని మనకు తెలుసు... కాని సంప్రదాయబద్ధమైన, కచ్చితమైన కులకట్టుబాట్లు కొనసాగిన ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్ ప్రాంతాలు ముస్లిముల దాడిని తట్టుకొని ప్రధానంగా హిందూ ప్రాంతాలుగా నిలబడ్డాయి.” ఇది సంఘపరివార్ మనుస్మృతికి ఎలా కట్టుబడి ఉందో స్పష్టంగా వెల్లడిస్తున్నది.

**ఆదివాసీలు మూలవాసులు కారట!**

భారతదేశంలోని అత్యధిక మూలవాసీ తెగలు తమను తాము ఆదివాసీలుగా చెప్పుకుంటారు. కాని సంఘపరివార్ వారిని 'ఆదివాసీలు' (తొలి నివాసులు) అని పిలవదు, వారిని 'వనవాసీలు' (అరణ్య జీవులు) అని పిలుస్తుంది. ఆదివాసీలను వనవాసీలు అని చెప్పడం సంఘపరివార్ భావజాలంలో ఒక కీలకమైన అంశం. ఆదివాసీలను అది తొలి నివాసులుగా గుర్తించకపోవడానికి కారణం ఉంది. వీరిని మూలవాసులుగా గుర్తిస్తే, **వేద నాగరికతను సృష్టించిన, హిందూజాతి స్థాపకులు అయిన ఆర్యులు ఈ గడ్డపై తొలినివాసులు** అని తాను ఇప్పటివరకు చెబుతున్న మాటలు చెప్పడానికి అవకాశం ఉండదు.

కాని ఆదివాసులు అనాది నుండి ఉంటున్నారు కాబట్టి వారు హిందూ సమాజంలో భాగంగా ఉండాలని సంఘపరివార్ కోరు కుంటుంది. క్రైస్తవ మిషనరీల చేత బలవంతం గాను, లేక తాయిలాలతోను క్రైస్తవం లోకి మార్చబడిన వీరందరిని తిరిగి హిందూయిజం లోకి తీసుకు రావాలని చెబుతుంది. 'ఘర్ వాపసి' లేక 'పునఃమార్పిడులకు' వత్తిడి చేసే కార్యక్రమాన్ని మధ్య భారతంలోను, ఈశాన్య భారతంలోను సంఘపరివార్ 1930ల నుండే చేపట్టింది. ఆర్య ధర్మ సేవక్ లాంటి మితవాద హిందూ సంస్థలు పాలక వర్గాల మద్దతుతో, ప్రత్యేకించి జష్పూర్ లాంటి సంస్థానాధీశుల సహాయంతో స్వంతంగా సంక్షేమ కార్యక్రమాలను చేపట్టాయి. భారతదేశంలో మొట్టమొదటి మతమార్పిడి వ్యతిరేక చట్టం తీసుకు రావడానికి, మిషనరీ కార్యకలాపాలను నిషేధించడానికి వారు జష్పూర్ రాజాను ఒప్పించారు. హిందూ మహాసభ చేపట్టిన సామూహిక పునఃమార్పిడులకు, శుద్ధి కార్యక్రమాలకు 1940ల కల్లా కాంగ్రెస్ పార్టీ కూడ లోపాయికారీ మద్దతు అందించింది. మిషనరీ కార్యకలాపాలను కొన్ని ప్రాంతాలలో నిషేధించడానికి, మరికొన్ని ప్రాంతాలలో నియంత్రించడానికి అంగీకరించడం ద్వారా 1940లలో, 50లలో హిందూత్వ ఎజెండాకు కాంగ్రెస్ అంతర్గత భాగస్వామి అయింది.

గిరిజనుల్లో క్రైస్తవ మత వ్యాప్తిని అరికట్టడానికి సంఘపరివార్ సంస్థలు క్రైస్తవ లక్ష్యాలపై హింసాత్మక దాడులను చేపట్టనారంభించాయి. వనవాసి కల్యాణ్

ఆశ్రమాలు, ఏకలవ్య విద్యాలయాలు, సేవాభారతులు, వివేకానంద కేంద్రాలు, భారత కల్యాణ్ ప్రతిష్టాన్‌లు, ఫ్రెండ్స్ ఆఫ్ ట్రైబల్ సొసైటీ లాంటి అనేక సంస్థలు 1970లలో స్థాపించబడినాయి. ఎమర్జెన్సీ తర్వాత అవి మరింత వేగంగా విస్తరించాయి. 21వ శతాబ్దం ఆరంభం నాటికి ఎన్‌డిఏ అధికారంలో ఉన్న సమయంలో 312 జిల్లాలలో 8,955 చోట్ల వనవాసి కల్యాణ్ ఆశ్రమాలు ఉన్నాయి. వాటిని 1203 మంది పూర్తి కాలం కార్యకర్తలు పర్యవేక్షిస్తున్నారు. హిందుత్వను వ్యాపింపచేయడానికి అనేకమంది స్వామీజీలు గిరిజన ప్రాంతాలకు పంపబడ్డారు. ఫుల్‌బోర్ని ప్రాంతంలో లక్ష్మానంద్, డాంగ్స్ ప్రాంతంలో అసీమానంద్, ఝబువా ప్రాంతంలో ఆశారాం శిష్యులు ఇలా పంపబడినవారే. హనుమాన్, శబరిలు గిరిజన దేవతలుగాను, రామ భక్తులుగాను ప్రచారంలో పెట్టబడ్డారు. గిరిజన ఉత్సవాలు హిందూత్వీకరించబడి పెద్దఎత్తున నిర్వహించబడినాయి.

ఆదివాసీలను హిందూత్వ చైతన్యంలోకి తీసుకురావడంలోను, ఆదివాసీ క్రతువులను స్థానిక హిందూ ఆచారాల్లో కలపడంలోను ఈ కార్యకలాపాలు ముఖ్యమైన పాత్ర నిర్వహించాయి.

సంఘపరివార్ దూకుడుగా చేపట్టిన ఈ చర్యలన్నీ ఆదివాసీ ప్రాంతాలలోకి వ్యాపారులు, బడా కంపెనీలు, విదేశీ ధనం ప్రవేశించడానికి దోహదపడ్డాయి. వనవాసీ కల్యాణ్ ఆశ్రమాలకు, సరస్వతీ శిక్షా సంస్థాన్‌కు (సంఘ పరివార్ విద్యాసంస్థల గొడుగు సంస్థ) వీరి నుండి విరివిగా విరాళాలు లభించాయి. ఈ విధంగా సంఘ పరివార్ కార్యకలాపాలు బ్రిటిష్ వారి ప్రవేశం నాటి నుండి ఆ ప్రాంతాలలో ఆదివాసీలను దోపిడీకి గురిచేస్తున్న శక్తులను నిర్మూలించడానికి బదులుగా అవి మరింత బలపడటానికి దోహదపడ్డాయి.

సంఘపరివార్ సంస్థలు చేపట్టిన ఈ హిందూత్వ విష ప్రచారం ఆదివాసీ సమాజంలో మతపరమైన విభజనను తీసుకొచ్చింది. మత ఘర్షణల్లో ఆదివాసీలు పాల్గొనేలా చేయడానికి ఇది దోహదపడింది. ఈ మతపరమైన విభజన, వారి శక్తి సామర్థ్యాలను వేరేవైపుకు మళ్ళించేలా చేయడానికి ఉపయోగపడింది. తమ భూములను, అడవులను, సహజవనరులను కాజేయచూసే శక్తులపై ప్రతిఘటించే ఆదివాసీ విధానాలను బలహీనపరిచింది.

**“ హిందూత్వ దృష్టిలో జాతి శత్రువులను సామాజికంగాను, సాంస్కృతికంగాను నిర్ణయించాలి. అందుచేతనే విదేశీ మతాలు అని చెప్పబడేవాటిని అనుసరించే వారు శత్రువులుగా పరిగణించబడతారు. ఆ విధంగా వర్గ ప్రాతిపదికన ఏర్పడే ఆర్థిక వైరుధ్యాలను విస్మరించి విదేశీ, స్వదేశీ పెట్టుబడులకు, భూస్వాములకు సేవ చేస్తారు. ”**

## ఫైనాన్స్ పెట్టుబడి సేవకు స్వదేశీ ముసుగు

బిజెపి ఆర్థిక సిద్ధాంతవేత్త జైదుబాషీ 1994లో ఆ పార్టీ ఆర్థిక సిద్ధాంతాన్ని వివరించాడు. ఆర్థికాభివృద్ధి లేదా పెరుగుదల, సామాజిక పటిష్టత లేదా సామరస్యం, స్వావలంబన లేదా స్వదేశీ – అనే ఈ మూడు మూల స్తంభాలపై అది ఆధారపడి ఉందని తెలిపాడు.

ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ ఇలా చెప్పాడు, “స్వదేశీ అంటే గ్లోబలీకరించబడిన ప్రపంచంలో జీవించేవాడు, అయితే భారతదేశానికి అనుకూలమైన షరతులతో జీవించేవాడు అని అర్థం. ఒక వస్తువు మన దేశంలో తయారవుతుంటే దాన్ని వేరే దేశం నుండి నేను ఎందుకు కొనుక్కోవాలి? ఎందుకు నా దేశీయ వాణిజ్యాన్ని నాశనం చేసుకోవాలి? – ఇది మన వైఖరిగా ఉండాలి. మనం స్వదేశీ మార్గం అనుసరించాలి. మనం ఇతర దేశాల నుండి కొనుగోలు చేయడానికి ప్రయత్నించాలి. అయితే అది మన స్వంత షరతుల మీద.”

ఇంతటి వాగాడంబరం ప్రదర్శిస్తున్న ఆరెస్సెస్, బిజెపిలు అన్నిరకాలైన నయా ఉదారవాద సంస్కరణలను ముందుకు తీసుకు వెళుతున్నాయి. అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడులకు ముకుళిత హస్తాలతో స్వాగతం పలుకుతున్నాయి. అమెరికా వ్యూహాత్మక ప్రయోజనాలకు అడుగులకు మడుగులొత్తుతున్నాయి. 1996 నుండి బిజెపి రాష్ట్ర ప్రభుత్వాలు, బిజెపి నాయకత్వంలోని కేంద్రప్రభుత్వాలు అనుసరించిన విధానాలు దీన్ని స్పష్టంగా నిరూపిస్తున్నాయి. ఈ విషయంలో కాంగ్రెస్, బిజెపిల మధ్య తేడా కేవలం అమలుచేసే వేగంలోను, సామర్థ్యంలోను మాత్రమే.

మోడీ ఎంతో అట్టహాసంగా ప్రకటించిన మేకిన్ ఇండియా పథకం విదేశీ పెట్టుబడిదారులకు మన లొంగుబాటును నాజూకైన మాటల్లో చెప్పడం తప్ప మరేమీ కాదు. ఆరెస్సెస్, బిజెపిలు భారత దేశంలో అభివృద్ధి చేయడానికి వైజ్ఞానిక సామర్థ్యాన్ని పెంచుకోకుండా ఆధునిక విదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని దిగుమతి చేసుకోవాలని భావిస్తాయి. మేడిన్ ఇండియా స్వావలంబనకు, మోడీ చెబుతున్న మేకిన్ ఇండియాకు మధ్య పెద్ద తేడా ఉంది. మొదటి దానిలో మనం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇముడ్చుకొని దాన్ని స్వంతంగా అభివృద్ధి చేసుకోవాలి. రెండవ దానిలో విదేశీ పెట్టుబడులు భారతదేశానికి వచ్చి వాటి పరిజ్ఞానాన్ని పంచుకోకుండా వస్తువులను తయారు చేయడం – ఇది మన మేధస్సును, శరీరాన్ని శాశ్వతంగా పాశ్చాత్య దేశాలపై ఆధారపడేలా చేసే విధానం.

హిందూత్వ దృష్టిలో జాతి శత్రువులను సామాజికంగాను, సాంస్కృతికంగాను నిర్ణయించాలి. అందుచేతనే విదేశీ మతాలు అని చెప్పబడేవాటిని అనుసరించే వారు శత్రువులుగా పరిగణించబడతారు. ఆ విధంగా వర్గ ప్రాతిపదికన ఏర్పడే ఆర్థిక వైరుధ్యాలను విస్మరించి విదేశీ, స్వదేశీ పెట్టుబడులకు, భూస్వాములకు సేవ చేస్తారు.

‘స్వదేశీ’ అని చెప్పబడేది దాని ఆర్థిక కార్యక్రమం. ఈ నిరాకార, అస్పష్ట భావన గతంలో వలసవాద కాలంలో బ్రిటిష్ వారికి, ఇప్పుడు అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడి దారులకు సంపూర్ణంగా లొంగిపోవడానికి ఒక ముసుగు మాత్రమే.

## సంఘపరివార్ సామాజిక, వర్గ పునాది

వలసవాద కాలంలోను, స్వాతంత్ర్యానంతర తొలి సంవత్సరాలలోను ఆరెస్సెస్, హిందూ మహాసభలు ప్రధానంగా పెటీ బూర్జువాల నుండి, మధ్యతరగతి వారి నుండి ప్రత్యేకించి వ్యాపారుల నుండి మద్దతు పొందేవి. బడా భూస్వామ్య వర్గాలు, అగ్రవర్ణ సెక్షన్లు వాటికి

> **" స్వాతంత్ర్యం తర్వాత, ప్రత్యేకించి 70లు, 80లలో మతాచరణ పెరగడాన్ని చిన్న పట్టణాలలో కొత్తగా ఆవిర్భవించిన మధ్యతర గతిలోకి చొచ్చుకుపోవడానికి సంఘపరివార్ విజయవంతంగా వినియోగించుకుంది. హరిత విప్లవ ఫలితంగా ఉత్తరాది రాష్ట్రాలలో ఆవిర్భవించిన ధనిక రైతాంగం కూడ మతతత్వ ధోరణులకు తేలిగ్గానే స్పందించారు. సంఘ పరివార్ నేడు సమాజంలోని ప్రతి సెక్షను లోకి విస్తరించింది. "**

పోషక పాత్ర నిర్వహించేవి. వాటి పలుకుబడి పట్టణ ప్రాంతాలకు మాత్రమే పరిమితమయి ఉండేది.

స్వాతంత్ర్యం తర్వాత, ప్రత్యేకించి 70లు, 80లలో మతాచరణ పెరగడాన్ని చిన్న పట్టణాలలో కొత్తగా ఆవిర్భవించిన మధ్యతరగతిలోకి చొచ్చుకుపోవడానికి సంఘపరివార్ విజయవంతంగా వినియోగించుకుంది. హరిత విప్లవ ఫలితంగా ఉత్తరాది రాష్ట్రాలలో ఆవిర్భవించిన ధనిక రైతాంగం కూడ మతతత్వ ధోరణులకు తేలిగ్గానే స్పందించారు.

సంఘపరివార్ నేడు సమాజంలోని ప్రతి సెక్షను లోకి విస్తరించింది. అది ఇంకెంత మాత్రం అగ్రవర్ణాలకు మాత్రమే సంబంధించిన అంశం కాదు. క్రింది కులాల వారిని కూడ తనలో ఇముడ్చుకుంది.

నయాఉదారవాద సంస్కరణల ఫలితంగా లాభపడిన మధ్యతరగతి వర్గంలోని పెద్ద సెక్షన్లు యధాతథ స్థితిని కొనసాగించడం ద్వారా బిజెపి తమ ప్రయోజనాలను రక్షించగలదని విశ్వసిస్తున్నారు. క్రింది కులాల వారి ఆకాంక్షలను బిజెపి అదుపులో ఉంచగలదని అగ్రకులాల వారు నమ్ముతున్నారు.

సరళీకరణ విధానాల అమలును బిజెపి కొనసాగిస్తూ ఉండటం వలన అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడిదారులు, భారత కార్పొరేట్ పెట్టుబడిదారులు కూడ సంతోషంగానే ఉన్నారు. జాతీయవాదాన్ని సంస్కృతిపరంగా పునర్నిర్వచించినపుడు మాత్రమే ఈ విధానాలు విజయవంతం కాగలవు. ఎందువల్లనంటే, అప్పుడు రాజకీయ సామర్థ్యాలు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా వినియోగించబడవు. అంతర్గత శత్రువులైన మైనారిటీలు, ప్రత్యేకించి ముస్లిములకు వ్యతిరేకంగా మళ్ళించబడతాయి.

అందువల్లనే సంఘపరివార్ రాజకీయ విభాగమైన బిజెపి పాలక వర్గాల ప్రధాన ప్రతినిధిగా ప్రస్తుతం ఉంది.

### హిందూత్వ ఉద్యమం - సంఘపరివార్ విభాగాలు

వివిధ సెక్షన్ల ప్రజానీకంలోకి హిందూత్వ సిద్ధాంతాన్ని వ్యాపింపచేయడానికి సంఘపరివార్ అనేక సంస్థలను స్థాపించింది. పార్లమెంటరీ రంగాన్ని వినియోగించుకొని తన రాజకీయ ఎజెండాను ముందుకు తీసుకు వెళ్ళడానికి తొలుత జనసంఘ్‌ను, తర్వాత బిజెపిని స్థాపించింది. ఇటీవలి కాలంలో సంఘపరివార్ తన కార్యకలాపాలను దేశం వెలుపలకు కూడ తీసుకు వెళ్ళింది. ఇతర దేశాల్లో ప్రత్యేకించి యుఎస్, యుకె, కరీబియన్ దేశాల్లో 'హిందూ' ఎన్నారైలతో సంబంధాలు పెట్టుకోవడానికి గుర్తించదగిన కృషి చేసింది.

సావర్కార్, గోల్వాల్కర్ రచనలు, ప్రత్యేకించి సావర్కార్ 'హిందూత్వ', గోల్వాల్కర్ 'పాంచజన్య' ఆరెస్సెస్ భావజాలానికి ప్రధాన వనరులు. ఈ భావజాలాన్ని సంఘపరివార్ నియమించిన స్వయం సేవకులు క్షేత్ర స్థాయిలో వ్యాప్తి చేస్తారు. ఈ స్వయం సేవకుల రిక్రూట్‌మెంట్, శారీరక, సైద్ధాంతిక శిక్షణ సంఘ్ స్థానిక యూనిట్ అయిన 'శాఖ' ద్వారా జరుగుతాయి. శాఖ సభ్యులు సమావేశమయిన ప్రతిసారి హిందూ రాజ్యానికి జేజేలు పలుకుతూ ప్రార్థన చేస్తారు. "హిందూ ధర్మాన్ని, హిందూ రాజ్యాన్ని, హిందూ సంస్కృతిని పరిరక్షించడానికి, ముందుకు తీసుకువెళ్ళడానికి నా శాయశక్తులా పనిచేస్తానని, దానికోసం నా సర్వస్వం త్యాగం చేస్తానని దైవసాక్షిగా ప్రమాణం చేస్తున్నాను." ప్రార్థన చివరిలో, "....హిందువుల అభివృద్ధి, దేశాభివృద్ధి ఆరెస్సెస్‌తో ఇమిడిఉంది కాబట్టి ఆ సంస్థకోసం నా శరీరాన్ని, హృదయాన్ని, ధనాన్ని సంపూర్ణంగా వినియోగించి సేవ చేస్తానని ప్రమాణం చేస్తున్నాను'' అని ఉంటుంది.

ఇటీవలి సంవత్సరాలలో ఆరెస్సెస్ శాఖలు దేశమంతటా విస్తరించాయి.

తన ప్రధాన సంస్థలే కాకుండా, దేశ సామాజిక, రాజకీయ ప్రతికోణంలోకి వ్యాపించడానికి వందలాది సంస్థలను ఆరెస్సెస్ స్థాపించింది. ఇవన్నీ కూడ స్వయం సేవకులచే పర్యవేక్షించబడతాయి. కేంద్రీకృతంగా సమన్వయం చేయబడతాయి. అయితే ఆరెస్సెస్‌కు తమకు సంబంధం లేదని, తమది స్వతంత్ర సంస్థఅనీ అవి చెప్పుకుంటాయి. ఈ అసంఖ్యాక సంస్థలన్నీ కలిసి సంఘపరివార్ అవుతాయి. అవి ప్రతిఒక్క మేథోరంగాన్ని, సాంస్కృతిక రంగాన్ని ఆవరిస్తాయి. స్కూళ్ళు, పబ్లిషింగ్ హౌసులు, లైబ్రరీ అసోసియేషన్లు, డ్రామా క్లబ్బులు, పర్యావరణ గ్రూపులు, ఆలయ పునరుద్దరణ సంఘాలు, భజన సంఘాలు మొదలయిన వాటిని ఏర్పాటు చేస్తాయి. బిజెపి (రాజకీయ విభాగం), విహెచ్‌పి (మత విభాగం), భజరంగదళ్ (పోరాట విభాగం), సేవా విభాగం, సేవా ఇంటర్నేషనల్, సేవా భారతి, విద్యాభారతి, ఎబివిపి, దుర్గావాహిని, విద్యావికాస్ పరిషత్, బిఎంఎస్, స్వదేశీ జాగరణ్ మంచ్, వనవాసి కల్యాణ్ ఆశ్రమ్, ఏకలవ్య విద్యాలయ ఫౌండేషన్, వికాస్ భారతి, సంస్కృతి భారతి, జనసేవవిద్యాకేంద్రం, సామాజిక సమరసతా మంచ్ (దళితులలో పనిచేసే విభాగం) మొదలైనవి వివిధ రంగాలలో పనిచేసే సంఘపరివార్ సంస్థలు.

సంఘపరివార్‌కు చెందిన అతి ప్రముఖ, అత్యంత క్రియాశీల సంస్థ ప్రతి ఒక్కదానికి దానికి సమానమైన సహోదర సంస్థ యుఎస్‌లోను, ఇంకా ఇతర పాశ్చాత్య దేశాలలోను తప్పని సరిగా ఉంటుంది.

ఆరెస్సెస్‌ను ప్రతిబింబించే సంస్థ హిందూ స్వయంసేవక్ సంఘ్, ఫ్రెండ్స్ ఆఫ్ ఇండియా సొసైటీ (ఎఫ్ఐఎస్ఐ) దానికి సంబంధించి బహిరంగంగా పనిచేసే సంస్థ. అమెరికాలో బిజెపి కార్యకలాపాలను ఓవర్సీస్ ఫ్రెండ్స్ ఆఫ్ బిజెపి నిర్వహిస్తుంది. ఇక్కడ విశ్వహిందూ పరిషత్ మాదిరిగానే విశ్వహిందూపరిషత్ ఆఫ్ అమెరికా ఉంది. అమెరికాలో సేవా విభాగపు కార్యకలాపాలను ఐడిఆర్ఎఫ్ నిర్వహిస్తుంది. సేవా ఇంటర్నేషనల్ అనేది అన్ని అంతర్జాతీయ నిధులను, సేవా కార్యకలాపాలను సమన్వయం చేసే సంస్థ. భారత దేశంలో సేవా విభాగం అనేది ఒక్కొక్క కార్యకలాపం కోసం దేశవ్యాపితంగా ఏర్పాటు చేసిన వందలాది సంస్థల ద్వారా పనిచేస్తుంది.

❋

# తెలంగాణాలో విస్తరించిన భూ పోరాటం



రచయిత సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

**ఎస్. వీరయ్య**

తెలంగాణలో వరంగల్ నగరంలో ప్రారంభమైన భూపోరాటం 22 జిల్లాలకు విస్తరించింది. 124 భూకేంద్రాలలో పోరాటం సాగుతున్నది. 78 సాగుభూమి కేంద్రాలలో 10;898 ఎకరాలు సాగుచేస్తూ, ఆ భూమి మీద హక్కుల కోసం రైతులు పోరాడుతున్నారు. 46 కేంద్రాలలో 280 ఎకరాలలో పేదలు 18;311 గుడిసెలు వేసుకున్నారు. ఇండ్ల పట్టాల కోసం పోరుబాటలో ఉన్నారు. సెప్టెంబర్ 21, 22 తేదీలలో కలెక్టర్ కార్యాలయాల దగ్గర 25 వేల మంది ధర్నాలలో పాల్గొన్నారు. 'తెలంగాణ రాష్ట్ర ప్రజాసంఘాల పోరాట వేదిక' ఆధ్వర్యంలో ఈ పోరాటం నడుస్తున్నది. వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, సిఐటియు, ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, కెవిపిఎస్, గిరిజన, వృత్తి సంఘాలు, సాంస్కృతిక సంఘాలు తదితర సుమారు 20కి పైగా ప్రజాసంఘాల ఆధ్వర్యం లో ఈ పోరాటవేదిక ఏర్పడింది.

**పోరాట వేదిక ఆవిర్భావం**

రాష్ట్రంలో అనేక సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయి. వివిధ సందర్భాలలో అసంతృప్తి చెందిన ప్రజలు ఆయా రంగాలు, తరగతుల వారీగా పెద్దఎత్తున పోరాడుతున్న సందర్భాలు ఉన్నాయి. పోడుభూముల కోసం గిరిజన సంఘాల ఆధ్వర్యంలో సమరశీల పోరాటమే జరిగింది. కనీస వేతనాల కోసం కార్మికులూ కదిలారు. మూడు రంగాలలో దీర్ఘకాలిక సమ్మెలు ముందుకొచ్చాయి. వీటన్నింటినీ మించి ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం పేదలు పెద్దఎత్తున కదులుతున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రజాసంఘాల పోరాట వేదిక ఏర్పడ్డది. ఇదొక దీర్ఘకాలిక లక్ష్యంతో ఏర్పాటైంది. ప్రజలు కదిలే సమస్యల మీద పోరాటాలు ఉధృతం చేయటం, క్రమంగా ఐక్య ఉద్యమాలు బలోపేతం చేయాలన్న ప్రయత్నమే ఇది. ఈ పోరాటాల అనుభవాల ప్రాతిపదికగా క్రమంగా ఈ పోరాట వేదికను అనేక ఇతర సంఘాలు, సంస్థలు, ప్రముఖ వ్యక్తులతో మరింత విస్తరించాలని వేదిక భావిస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా విస్తృతమైన ఐక్యవేదికల ఆధ్వర్యంలో, దీర్ఘకాలిక, సమరశీల పోరాటాలు చేసిన అనుభవాలున్నాయి. అవి నిర్దిష్ట సమస్యల ప్రాతిపదిక మీద, వాటిని సాధించే పరిమిత లక్ష్యంతో పని చేసాయి. మంచి ఫలితాలు, అనుభవాలనూ ఇచ్చాయి. తెలుగుదేశం ప్రభుత్వం పాలన కాలంలో కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కులవివక్షకు వ్యతిరేకంగా స్ఫూర్తిదాయకమైన పోరాట ఫలితంగా ఆనాటి ప్రభుత్వం జస్టిస్ పున్నయ్య కమిషన్‌ను నియమించింది. ఆ నివేదిక ఆధారంగా ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ సాధన కమిటి ఆధ్వర్యంలో సుదీర్ఘ పోరాటమే సాగింది. అంతిమంగా ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం సబ్‌ప్లాన్ చట్టం చేసేందుకు అంగీకరించింది. చట్టం చేసింది. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలోనే వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రారంభమైన భూపోరాటం క్రమంగా 195 సంఘాలతో భూసాధన కమిటీ ఏర్పడి, సుమారు ఏడు మాసాల సుదీర్ఘ, సమరశీల పోరాటం సాగింది. ఇవి రాష్ట్రంలో తీవ్ర ప్రభావం చూపిన పోరాటాలు. ఇప్పుడు ఏర్పడిన ప్రజాసంఘాల పోరాట వేదిక స్వభావం భిన్నమైంది. ఒక నిర్దిష్ట సమస్య సాధన కోసం మాత్రమే పరిమితమైంది కాదు. ప్రజల కదలికను బట్టి, వివిధ రంగాల ప్రజల పోరాటాలకు ఈ వేదిక నాయకత్వం వహించే ప్రయత్నం చేస్తున్నది. ఇండ్లు, ఇండ్ల స్థలాలు, సాగు భూమి కోసం కదులుతున్న పేదలను సమీకరించి, దీర్ఘకాలిక పోరాటానికి ఈ వేదిక సిద్ధమైంది.

హైదరాబాద్, వరంగల్ వంటి నగరాలలో ప్రభుత్వ భూములు, మిగులు భూములు, పట్టణీకరణ ఫలితంగా సాగుభూమిలేని శిఖం భూములు కోటీశ్వరులు, రియలెస్టేట్ వ్యాపారులు, ప్రజాప్రతినిధులూ కబ్జాలు చేస్తున్నారు. పేదలు ఇండ్లస్థలాలు అడిగితే మాత్రం పాలకులు నిరాకరిస్తున్నారు. మిగులు భూముల్లోగానీ, ప్రభుత్వ భూముల్లోగానీ, అభ్యంతరం లేని ఇతర భూములలోగానీ ఇప్పటికే నివసిస్తున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం 2014 డిసెంబరులోనే జీవో నెం.58, 59 విడుదల చేసింది. కానీ ఈ జీవోల ప్రాతిపదికగా కూడా కోటీశ్వరులకే తప్ప పేదలకు భూమిమీద హక్కులు ఇచ్చిన దాఖలాలు లేవు.

ఇండ్ల స్థలాల కోసం పేదలు చీమలదండు లాగా కదులుతున్నారు. పోలీసు నిర్బంధాన్ని కూడా లెక్కచేయటంలేదు. మరోవైపు ప్రభుత్వ భూములు ఆక్రమించుకోవడం ఏమిటని అధికారులు, పాలకులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి భూములు అవసరం అంటున్నారు. ఇదే ప్రభుత్వం ఆదాయం కోసం భూములు అమ్మకానికి పెడుతున్నది. కేంద్రంలో మోడీ సర్కారు మరో అడుగేసి భూములు బడాబాబులకు అప్పగించేందుకు 'మోనిటైజేషన్' అని ముద్దుపేరు పెట్టింది. రాష్ట్రంలో రాజీవ్ గృహకల్ప, రాజీవ్ స్వగృహ పేర్లతో నిర్మించిన వేలాది ఇండ్లు పగుళ్ళు చూపుతున్నాయి. ఏండ్లు గడిచినా పేదలకు ఇవ్వలేదు. ఇప్పుడు ఆ ఇండ్లన్నీ వేలం వేస్తున్నారు. పేదలకు ఇవ్వడానికి సిద్ధంగా లేరు. పేదలకు పట్టాలిచ్చిన ప్లాట్లు కూడా గందరగోళంలో పడ్డాయి. ఐదులక్షల డబల్ బెడ్రూమ్ ఇండ్లు కట్టిస్తామని రాష్ట్ర ప్రభుత్వం వాగ్దానం చేసింది. ఐదేండ్లయినా దిక్కులేదు. నిర్మించిన ఇండ్లు 2,80,000 కాగా 3,600 ఇండ్లు మాత్రమే పేదలకు ఇచ్చారు. ఖాళీ స్థలం ఉన్నవారికి, ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు ఇస్తామన్నారు. తర్వాత మాట మార్చి రూ.3లక్షలు ఇస్తామన్నారు. అది కూడా అమలు చేయలేదు.

పట్టణీకరణ వేగంగా జరుగుతున్న నేపథ్యం లో పట్టణ ప్రాంతాలలో ఇండ్ల స్థలాల సమస్య మరింత ముదురుతున్నది. ఈ పరిస్థితుల్లో ఇండ్ల సమస్య పేదలనే కాదు... మధ్యతరగతిని కూడా వెంటాడుతున్నది. ఇండ్ల కిరాయిలు కూడా బాగా పెరిగాయి. ఇండ్లు, ఇండ్ల స్థలాల సమస్య పరిష్కరించే బాధ్యతనుంచి పాలకులు తప్పించుకోజాలరు.

**"నగరాలలో ఆకాశహర్మ్యాల మధ్యనే పెద్దపెద్ద ఖాళీ స్థలాలు కూడా కనిపిస్తాయి. ప్రైవేటు స్థలాలుగా చెప్పుకుంటారు. కానీ వాస్తవాలు భిన్నంగా ఉన్నాయి. వరంగల్ నగరంలో జక్కలొద్ది ప్రాంతమే ఇందుకు నిలువెత్తు సాక్షి. 300ఎకరాల సీలింగ్ భూమిలో 250ఎకరాలు కోటీశ్వరులు, రాజకీయ నాయకులు ఆక్రమించుకున్నారు. కోర్టు విచారణను కూడా రెవిన్యూ అధికారులు నిర్లక్ష్యం చేయటంతో తీర్పులూ వారికే అనుకూలంగా వచ్చాయి."**

### ఖాళీస్థలం లేదా?

నగరాలలో ఆకాశహర్మ్యాల మధ్యనే పెద్దపెద్ద ఖాళీ స్థలాలు కూడా కనిపిస్తాయి. ప్రైవేటు స్థలాలుగా చెప్పుకుంటారు. కానీ వాస్తవాలు భిన్నంగా ఉన్నాయి. వరంగల్ నగరంలో జక్కలొద్ది ప్రాంతమే ఇందుకు నిలువెత్తు సాక్షి. 300ఎకరాల సీలింగ్ భూమిలో 250ఎకరాలు కోటీశ్వరులు, రాజకీయ నాయకులు ఆక్రమించుకున్నారు. కోర్టు విచారణను కూడా రెవిన్యూ అధికారులు నిర్లక్ష్యం చేయటంతో తీర్పులూ వారికే అనుకూలంగా వచ్చాయి. రెవిన్యూ అధికారులు లంచావతారులై, కబ్జాదారులతో కుమ్మక్కైన ఫలితం ఇది. నాగర్‌కర్నూల్‌లో 2400 ఎకరాలు మాజీ జాగీర్దారు అమ్ముకునే ప్రయత్నం చేసాడు. సీపీఐ(ఎం) నాయకత్వంలో ప్రజలు కదిలి కాపాడుకున్నారు. మంచిర్యాల జిల్లా దండేపల్లి దగ్గర 2000 ఎకరాలు ఉంది. 150 ఎకరాలలో ఆదివాసీలు పోడుకొట్టారు. వీరిని లేపేసి 2000 ఎకరాలు కాజేయాలని భూస్వాములు, ప్రజాప్రతినిధులూ ప్రయత్నిస్తున్నారు. వికారాబాద్ జిల్లా పరిగి దగ్గర ప్రభుత్వ భూమిని ఒక ప్రజాప్రతినిధి పట్టా చేయించుకుని రియలెస్టేట్ వ్యాపారులకు అమ్ముకున్నాడు. వ్యవసాయకూలీలు, గ్రామ పేదలు కదిలి ఆ భూమిని కాపాడుకున్నారు. ఎక్కడ చూసినా ఇదే తంతు. రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు, కోటీశ్వరులు కుమ్మక్కై అందినకాడికి కబ్జాపెడుతున్నారు.

బడాబాబులు కబ్జాలు పెడతారు. పోలీసులు, అధికారులు, రెవిన్యూ అధికారులూ కబ్జాకోర్ల సేవలో తరిస్తారు. పేదలు 120గజాల స్థలం అడిగినప్పుడే ప్రభుత్వానికి అవసరాలు గుర్తొస్తాయి. గుడిసెలు వేస్తే భూకబ్జాదార్లుగా నిందించి కేసులు పెడుతున్నారు. పారిశ్రామిక వేత్తలకు, కాంట్రాక్టర్లకు భూములు ఉచితంగా, కారుచౌకగా కట్టబెడుతున్న పాలకులు, పేదలకు మాత్రం మొండిచేయి చూపిస్తున్నారు.

### పట్టణాలతో పేదల బంధం

పట్టణ జీవితానికీ, పేదలకు విడదీయరాని బంధం. పేదల సేవలు లేకుండా పట్టణ ప్రజాజీవితమే లేదు. ఇంటిపనివారు, ఆటో, క్యాబ్ డ్రైవర్లు, మెకానిక్కులు, అడ్డాకూలీలు, షాపు, హోటల్ కార్మికులు, చెత్త తొలగించే కార్మికులు, ఫుట్‌పాత్ వ్యాపారులు, కార్యాలయాలలో వాచ్‌మెన్‌లు మొదలైనవారంతా ఉండటానికి గూడులేనివారే. వారి మహిళలకు తడికచాటు లేనివారే. వీరంతా నగరాలు, పట్టణాల నడిబొడ్డునే, బహుళ అంతస్తుల భవనాల నీడనే జీవించటం సామాజిక అవసరం. వీరికి ఇండ్లు, ఇండ్ల స్థలాలు కేటాయించడం ప్రభుత్వ బాధ్యత. కానీ పాలకుల నిర్లక్ష్యానికి హద్దులు లేవు. అందుకే ప్రభుత్వ భూములలో పేదలు, తామే గుడిసెలు వేసుకుంటున్నారు. ఇది వారి సహజ హక్కు.

### పోలీసుల నిర్బంధం

వరంగల్ నగరం జక్కలొద్ది ప్రాంతంలో 10వేల మంది పేదలు ఇండ్లస్థలం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఏడాది పాటు ఎదురు చూసి, తప్పని స్థితిలో గుడిసెలు వేసారు. పోలీసులు బుల్డోజర్లతో కూలగొట్టి తగులబెట్టారు. అర్ధరాత్రులు దాడులు చేసారు. మహిళలను తాకగూడని చోట తాకి అవమానపరిచారు. తీవ్రంగా లాఠీచార్జీ చేసి నాయకుడి తల పగులగొట్టారు. ముస్లిం గర్భిణి పొట్టమీద తన్నారు. 40మంది గాయాలపాలయ్యారు. దాడులు, అవమానాలు తట్టుకోలేక మహిళలు పోలీసులను తరమాల్సివచ్చింది. రెచ్చిపోయిన పోలీసులు పేద కార్మికుల ఆటోలను, మోటారు సైకిళ్ళను ధ్వంసం చేసారు. 400మంది పేదలను అరెస్టు చేసారు. 20మంది నాయకులు మీద అనేక కేసులు పెట్టారు. వేలాదిమంది కదిలి రెవిన్యూ అధికారులముందు నిరసన ధర్నా చేయాల్సి వచ్చింది. ఇన్ని దాడులను తట్టుకుని 4,600 గుడిసెలలో పేదలు ఇప్పటికీ, అక్కడే నివాసం ఉంటున్నారు. 150రోజులు దాటినా, పట్టువదలకుండా పోరాడుతూనే ఉన్నారు.

హన్మకొండ జిల్లాలో నాలుగు భూకేంద్రాలలో గుడిసెలు కూల్చి తగులబెట్టారు. వేలాదిమంది నిరసన ప్రదర్శన చేసారు. 18మంది మీద పోలీసులు కేసులు పెట్టారు. ముగ్గురిని బైండోవర్ చేసారు. మంచిర్యాల జిల్లా దండేపల్లిలో రెండువేల ఎకరాల భూమికై రిజర్వు ఫారెస్టు పేరుతో ఆదివాసీల మీద ఫారెస్టు అధికారులు విరుచుకుపడ్డారు. 8మంది ఆదివాసీ మహిళలను తాళ్ళపల్లి రేంజి ఫారెస్టు ఆఫీసులో బంధించి కొట్టారు. ఒక నాయకురాలిని వేరుచేసి, విడిగా సెల్‌లో వేసి చిత్రహింసలు పెట్టారు. అయినా పేదలు భయపడలేదు. వందలాదిగా తరలి పోలీస్‌స్టేషన్ ముట్టడించారు. అరెస్టయిన వారిని విడిపించుకున్నారు. ఆ భూమ్మీదనే నిలబడి ఉన్నారు. నిజానికి అది రిజర్వు ఫారెస్టు కాదు. ప్రభుత్వ పాఠశాల, మంచినీళ్ళ బావి నిర్మించారు. అమరచింతలో 25 ఏండ్లనాడే 13 ఎకరాల భూమి గ్రామ పేదల కోసం గ్రామ పంచాయితీ కొనుగోలు చేసింది. కానీ నేటికీ పేదలకు ఇవ్వలేదు. 600మంది గుడిసెలు వేసుకున్నారు. వికారాబాద్‌లో సీలింగ్ భూమి కబ్జాకోర్ల చేతుల్లో ఉన్నంతకాలం నోరు మెదపని పోలీసులు, పేదల మీద మాత్రం ప్రతాపం చూపిస్తున్నారు. సూర్యాపేట జిల్లా వెలిసాల గ్రామంలో తెలుగు దేశం ప్రభుత్వం ఉన్నప్పుడే పేదలకు 5 ఎకరాలలో పట్టా ఇచ్చింది. ఇప్పుడు టీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రి డబుల్ బెడ్రూం ఇండ్లు కడతామని శంకుస్థాపన చేసారు. ఏండ్లు గడిచినా దిక్కులేదు. పేదలు గుడిసెలు వేస్తే రెండుసార్లు పీకేసారు. మూడవసారి మళ్ళీ వేసారు.

### పేదలకు ఎందుకింత విశ్వాసం?

ఈ పోరాటాలకు స్ఫూర్తినిచ్చిన వరంగల్ అనుభవం పరిశీలించదగినది. వరంగల్ మహానగరంలో వేలాదిమందికి ఉపాధి కల్పించే బీడీ పరిశ్రమ దెబ్బతిన్నది. మిల్లులు సక్రమంగా పనిచేయటంలేదు. పేదలు ఇండ్ల కిరాయిలు భరించలేని పరిస్థితి. మరోవైపు భూముల ధరలు పెరిగాయి. దళితులకూ, ముస్లింలకూ ఇండ్లు కిరాయికి ఇవ్వడం లేదు. ఈ రెండు తరగతులే 30శాతం ఉంటారు. వీరికితోడు ఇతర పేదలు, వెనకబడిన తరగతులు. ఈ పేదలకు ఎర్రజెండా ఆశా దీపంగా కనబడింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సీపీఐ (ఎం) చరిత్రే ఇందుకు కారణం. హన్మకొండ బస్‌స్టాండ్ పక్కనే 22 ఎకరాల విలువైన భూమి, ఆనాటి వరంగల్ మున్సిపల్ ఛైర్మన్ హయగ్రీవాచారి కబ్జా పెట్టాడు. ఇది ప్రభుత్వ

(మిగతా 34వ పేజీలో)

# మౌర్య సమాజంలో కులవ్యవస్థ, మతాలు



రచయిత ప్రజాశక్తి మాజీ ఎడిటర్

ఎం.వి.ఎస్.శర్మ

మౌర్య సమాజంలో బలమైన పాలకవర్గం ఏర్పడింది. ఆ సమాజంలో పోగుబడిన మిగులులో అధికభాగాన్ని తన అధీనంలో ఉంచుకున్న ఈ పాలకవర్గం అప్పటి పట్టణాలలో ఉండే సంపన్నులైన వారితోనూ, కాంభోజ, లిచ్ఛవీ వంటి యుద్ధవీరుల గణాల నాయకులతోనూ ఏర్పడింది. అధికార యంత్రాంగం కూడా కులీన తరగతులవారితోనే ప్రధానంగా ఉండేది. చాణక్యుడు చంద్రగుప్తుడి ప్రధాన మంత్రి. అతడు బ్రాహ్మణుడు. అదే రాజ్యంలో సౌరాష్ట్ర ప్రాంతాన్ని పాలించ దానికి నియమించబడిన పుష్యగుప్తుడు వైశ్యుడు. అతడి ఆస్థానంలో అశోకుడి కాలంలో నియమించబడిన తుషస్పుడు ఇరానియన్ తెగకు చెందిన కాంభోజ వీరుడు.

ఇలా విభిన్న స్వభావం కల పాలకవర్గం కుల వ్యవస్థతో ఉన్న సమాజాన్ని పాలించింది. ఆ కుల వ్యవస్థ మూడు విధా లుగా బలపడింది. మొదటిది పుట్టుకతోటే నిర్ధారించబడినది. రెండవది వంశపారం పర్యంగా వచ్చే వృత్తిని బట్టి నిర్ణయించ బడింది. కులాంతర వివాహాలపై గట్టి నిషేధాలు, ఆంక్షలు అమలులో ఉండడం మూడోది. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాలుగా విభజించబడిన చాతుర్ వర్ణ వ్యవస్థను ధర్మసూత్రాలు నిర్దేశించాయి. మనుధర్మ సూత్రాలు క్రీ.పూ. ఒకటో శతాబ్దంలో రూపొందాయి. కౌటిల్యుడి అర్ధశాస్త్రం ఆ ప్రాతిపదికను ప్రధానంగా అనుసరించింది.

ఐతే కుల వ్యవస్థ ఈ నాలుగు వర్ణాల చట్రాన్ని దాటి చాలా ఎక్కువగా విస్తరించింది. ఆ నాలుగు వర్ణాల విభజన ప్రాతిపదికను దాటి కొత్త కులాలు పుట్టుకు వచ్చాయి. వర్ణ చట్రాన్ని, దాని కట్టుబాట్లను అతిక్రమించి వివిధ వర్ణాల ప్రజల మధ్య వైవాహిక, వివాహేతర సంబంధాల ఫలితం గా కొత్త కులాలు ఉనికిలోకి వచ్చాయి.

(ప్రస్తుత కుల సమాజంలో కులాంతర వివాహాలు జరుగుతున్నా, ఆ వివాహాల ఫలితంగా కలిగిన సంతానానికి తండ్రి కులమే సంక్రమిస్తోంది. ఇందుకు భిన్నంగా మౌర్య సమాజంలో వర్ణాంతర వివాహాలు కొత్త కులాలకు దారి తీశాయి. ఈ తేడాను గమనించాలి). ఇతర భూభాగాలనుంచి వలస వచ్చి స్థిరపడిన యవనులు, పారశీకులు వంటివారితో సంపర్కం కూడా కొత్త కులాలు రూపొందడానికి దారి తీసింది. విదేశీయుల్ని మ్లేచ్ఛులు అని పేర్కొన్నారు.

వివిధ కారణాలరీత్యా సమాజం నుండి వెలివేయబడినవారిని ఛండాలురు అని వారిని దూరంగా ఉంచడం ఈ కాలంలో మనం చూస్తాం. అన్ని కులాల కన్నా అతి హీనమైన స్థానంలో వీరిని ఉంచారు. వర్ణాంతర వివాహాలవలన కలిగిన సంతానం కొత్త కులాలుగా ఏర్పడినా, అటువంటి కొత్త కులాలు ఏవీ ఛండాలుర కన్నా తక్కువ స్థానంలో చేరలేదు. వర్ణాంతర వివాహం కారణంగా తమ తమ కులాల నుండి వెలివేయబడినవారికి అర్ధశాస్త్రం శూద్ర విధులను నిర్దేశించింది. అదే సమయంలో వారికి ఛండాలుల విధులు అప్పజెప్పకూడదని కూడా చెప్పింది. ఊరికి దూరంగా స్మశానాలవద్ద మాత్రమే ఛండా లురు నివసించాలి. వారు ఉన్నత కులాల వారిని తాకితే అందుకు ఆ ఛండాలురు భారీ జరిమానా చెల్లించుకోవలసివుండేది. కొన్ని ఆటవిక తెగలు (శబరులు, పుళిందు లు, వాగురికులు వగైరా) ఈ ఛండాలురతో సమానంగా పరిగణించబడేవి.

మొదట్లో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య కులాలు మూడు వర్ణాలుగా ఉన్న కాలంలో వైశ్యుల ప్రధాన వ్యాపకం వ్యవసా యం. తర్వాత కాలంలో వ్యవసాయం, చేతివృత్తుల అభివృద్ధితో వ్యాపారం పెరిగి, డబ్బు ముఖ్యమైన పాత్ర పోషించడం మొదలయ్యాక

వైశ్యుల ప్రధాన వ్యాపకం వ్యాపారం అయింది. అర్ధశాస్త్రంలో మాత్రం వైశ్యుల వ్యాపకాలలో వ్యవసాయం, పశుపోషణ, వ్యాపారం – ఈ మూడూ పేర్కొన్నారు. కాని, వ్యవసాయం, పశుపోషణ చేసేవారికి మాత్రం వైశ్యకుల హోదా ఇవ్వడానికి నిరాకరించారు. కొత్తగా విస్తరించిన పంట భూములలో వ్యవసాయం చేసేవారందరూ శూద్రులుగానే పరిగణించబడ్డారు. అంటే, వైశ్యులు కావాలనుకుంటే వ్యవసాయమూ చేయవచ్చు కాని వ్యవసాయం చేసేవారంతా వైశ్యులు కారు. వైశ్యకుల వ్యాపకంగా మొదట పరిగణించబడిన పశపోషణ ఇప్పుడు తక్కువస్థాయి వ్యాపకంగా దిగజారి పోయింది. ముఖ్యంగా గొర్రెల, మేకల పెంపకందారులు, మత్స్యకారులు దాదాపు ఛండాలురతో సమానంగా పరిగణించ బడేవారు. వృత్తి నైపుణ్యంకారణంగా వ్యాపారంలో ఎక్కువరేటు తెచ్చిపెట్టగల చేనేత, వడ్రంగం, స్వర్ణకారవృత్తి చేపట్టిన వారిని దాదాపు వైశ్యులతో సమానంగా గౌరవంచేవారు.

శూద్రులుగా, ఛండాలురుగా పరిగ ణించబడేవారు అగ్రకులాలవారు ఏ పనులు కేటాయించినా చేయవలసిందే. ధర్మసూత్రా

**“ భారతదేశంలో బానిస వ్యవస్థ అనేదే లేదని కొందరు వాదిస్తూవుంటారు. కాని బానిస వ్యవస్థ లక్షణాలన్నింటినీ కలిగివుండడంతో బాటు అదనంగా దోపిడీ వర్గాలకు ఊతం ఇచ్చే లక్షణాలు కుల వ్యవస్థలో ఉన్నాయి. ”**

లను పాటించడానికి నిరాకరిస్తే కఠిన శిక్షలు ఉండేవి. వీరి శ్రమకు అతి తక్కువ ప్రతిఫలం ముట్టేది. ఆ విధంగా ఉత్పత్తిలో మిగులును అధిక మోతాదులో పోగేసుకోడానికి అగ్రవర్ణాల పాలక వర్గాలకు వీలు కలిగింది.

అప్పటి సమకాలీన గ్రీకు వ్యవస్థలో ఉండిన బానిస విధానానికి, ఇక్కడి వర్ణవ్యవస్థకు మధ్య ఉన్న తేడా గురించి గౌతమబుద్ధుడు తన “మజ్జిమ నికాయ” (గౌతమబుద్ధుని బోధనలు)లో ఈ విధంగా పేర్కొన్నాడు: “యవన-కాంభోజ ప్రాంతంలో (ఇది గ్రీక్-ఇరాన్ తెగల ప్రజలు ప్రధానంగా ఆధిపత్యం చెలాయించిన ప్రాంతం. అలెగ్జాండర్ దండయాత్ర అనంతరం ఈ ప్రాంతానికి పంపిన గ్రీక్ అధికారులు, సైన్యాలు,, వారితోబాటు తెచ్చిన ఇరాన్ ప్రాంత సైన్యాలు ఇక్కడ బలం కలిగివుండేవి. వారితో అశోకుడు సంధి కుదుర్చుకుని ఆ ప్రాంతాన్ని తన సామ్రాజ్యంలో భాగంగా చేశాడు) ‘అయ్యలు’ (ఆర్యులు అన్న పదానికి పాళీ భాషలో పర్యాయ పదం) ‘దాసులు’ అన్న రెండే వర్ణాలు ఉన్నాయి. అక్కడ అయ్య దాసుడు గా మారవచ్చు, దాసుడు అయ్యగా మారవచ్చు.”

దీనిని బట్టి మౌర్య సామ్రాజ్యం ఏర్పడకమునుపు నుంచీ భారతదేశపు వాయవ్య ప్రాంతంలో పశ్చిమదేశాలతో పోల్చదగ్గ బానిస వ్యవస్థ ఉండేదని తెలుస్తోంది. కాని అటువంటి వ్యవస్థ తక్కిన భారతదేశంలో రావలసిన అవసరం లేకుండా పోయింది. ఆ అవసరాన్ని వర్ణ వ్యవస్థ తీర్చింది. బానిస వ్యవస్థలో లేని కఠిన నియ మం (పుట్టుకతోటే కులం నిర్ధారించబడడం, కట్టుబాట్లను వ్యతిరేకిస్తే కఠిన శిక్షలు) ఇందులో ఉంది. ఒక బానిస యజమానిగా మారే అవకాశం ఉంది. కాని, ఇక్కడ ఏ కులంలో పుడితే, ఇక ఆ కులంలోనే ఉండాలి. అగ్రవర్ణాలు ఎంత ప్రతిఫలం ఇస్తే అంతే తీసుకోవాలి. బానిసలంతా ఏకమై తిరగబడే అవకాశం ఉంది, ఇక్కడ వర్ణ వ్యవస్థలో శ్రమజీవులు వేరు వేరు కులాలుగా విభజింపడివుండడమే గాక, వివిధ కులాలమధ్య సంపర్కం నిషేధం. అందుచేత శ్రమజీవులను ఏకం కానివ్వ కుండా అడ్డుపడగల లక్షణం కులవ్యవస్థలో అంతర్భాగంగా ఉంది.

భారతదేశంలో బానిస వ్యవస్థ అనేదే లేదని కొందరు వాదిస్తూవుంటారు. కాని బానిస వ్యవస్థలక్షణాలన్నింటినీ కలిగివుండడంతో బాటు అదనంగా దోపిడీ వర్గాలకు ఊతం ఇచ్చే లక్షణాలు కుల వ్యవస్థలో ఉన్నాయి.

ఛండాలురనుండి, ఇతర సంచార తెగలనుండి జనాలని దాసులుగా, దాసీలుగా తీసుకోవడం, వారిని కొనుక్కోవడం, అమ్మడం వంటివి కూడా మౌర్య సామ్రాజ్యంలో అమలులో ఉండేవి. తన యజమాని ద్వారా సంతానాన్ని కని, ఆ యజమానికి అప్పజెప్పిన తర్వాతనే బానిస స్త్రీకి బానిసత్వం నుండి విముక్తి అభిస్తుందని అర్థశాస్త్రం నిర్దేశించింది.

(వాస్తవానికి సంతానాన్ని కూడా కన్న తర్వాత ఆ స్త్రీ వేరే ఎక్కడికి పోగలదు?)

మహిళలందరి పరిస్థితీ ఒకే విధంగా ఉండేది కాదు. నాట్యగత్తెలు, గాయనీ మణులు ఎక్కువ స్వేచ్ఛ కలిగివుండేవారు. వారు మగవారితో వారికి నచ్చిన విధంగా వ్యవహరించవచ్చు. ఏ ప్రాంతానికైనా పోవచ్చు. అదే మత్స్యకారులు, పశువుల పెంపకం దారులు, సారా కాచేవారు తదితర వృత్తులలోని మహిళలకు నడ్డి విరిగే పనిభారం ఉండేది. నూలు వడికే పనిలో నియమితులైన మహిళలు పనికి హాజరు కాకపోతే వారి బొటనవేలును, చూపుడు వేలును నరికే శిక్ష అమలు చేసేవారు.

ఆడవాళ్ళున్నది సంతానాన్ని కని పెంచడం కోసమే నన్నది అర్ధశాస్త్రం సూత్రాలలో ఒకటి.

కన్యాశుల్కం పద్ధతి అమలులో ఉండేది. దానితోబాటు స్త్రీ ధనం అనేది కూడాఉండేది. విడాకులకు అర్ధశాస్త్రం అవకాశం కల్పించింది. ఐతే అలా విడిపోయినప్పుడు ఆమె తన స్త్రీధనాన్ని ఒదులుకోవలసివుంటుంది. బహు భార్యాత్వం అమలులో ఉండేది. స్త్రీలకు చాలా చిన్న వయస్సులోనే వివాహం చేయవలసివచ్చి నందున, చిన్న వయస్సులోనే సంతానాన్ని కనవలసి వచ్చినందున, వారి ఆరోగ్యం తొందరగా దెబ్బ తినేది.

**మతం**

అశోకుడి శిలాశాసనాలను బట్టి మౌర్యసామ్రాజ్యంలో బ్రాహ్మణ, శ్రమ ణక,అజివక మతాలు ఉండేవి. బౌద్ధులు, జైనులు - ఈ రెండు మతాలవారినీ శ్రమణకులు అనేవారు. ఒక మతానికి చెందినవారిని తక్కినవారు పాషండులు అనేవారు. అన్యమతస్తులు అన్న అర్థంలో దీనిని చూడాలి. కాలక్రమేణా బ్రాహ్మణ సాహిత్యంలో ఇదొక తిట్టుగా మారింది.

అంతకు పూర్వం ఉన్నంత బలమైన స్థానంలో బ్రాహ్మణ మతం మౌర్య సామ్రాజ్యంలో లేకపోయినా, అత్యంత విస్తృతంగా వ్యాపించిన మతంగా ఉండేది. వైదిక క్రతువులు బాగా తగ్గిపో యాయి. ఆ క్రతువులలో జంతువులను బలి ఇవ్వడం, ఆ క్రతువులకు భారీగా జనాన్ని సమీకరించడం అశోకుడి కాలంలో నిషేధించబడింది. అహింసను పాటించడం అన్ని వర్ణాలవారికీ తప్పనిసరి విధి అని అర్ధశాస్త్రం పేర్కొంది. బ్రాహ్మణ మతంలో సాంఖ్యం, యోగం, లోకాయతం అనే దర్శనాలు ఉన్నాయని అర్ధశాస్త్రం ప్రస్తావిం చింది. అసురుల దర్శనంగా పరిగణించే లోకాయతాన్ని కూడా బ్రాహ్మణదర్శనం గా పేర్కొనడం ఆసక్తికరమైన అంశం.

వాసుదేవుడు (కృష్ణుడు) ఒక ప్రధాన దైవంగా ఉత్తరభారతంలో మధుర ప్రాంతంలో ఆరాధించబడినట్టు ఆధారాలు ఉన్నాయి. శివుడు అంతకు ముందునుంచీ ఆరాధించబడుతున్న ప్రాచీన దైవం. ఇంద్రుడు, వరుణుడు, అగ్ని తదితర వైదిక దేవతల ఆరాధన కొనసాగింది.

పండితులైన బ్రాహ్మణుల ఆధీనంలోని దేవాలయాలు మినహా తక్కిన దేవాలయాను రాజు దోచుకోవచ్చునని అర్ధశాస్త్రం చెప్తోంది. దేవతా విగ్రహాలను ప్రధానంగా కొయ్యతో,

> "అశోకుడి కాలం నుండి బౌద్ధం ఆధిపత్యం మన దేశంలో మొదలైంది. ఆ ఆధిపత్యం ఆ తర్వాత ఐదువందల సంవత్స రాలపాటు కొనసాగింది. తేరవాద, మహాయాన బౌద్ధ శాఖలు రెండూ విస్తృతంగా ప్రచారంలో ఉండేవి. 84 వేల బౌద్ధ విహారాలను అశోకుడు నిర్మించాడని అశోక వదన గ్రంధంలో ఉంది. ఈ సంఖ్య కొంత అతిశయోక్తిగా అనిపించినా, బౌద్ధ మత విస్తృతిని ఇది సూచిస్తుంది."

జేగురుమట్టితో చేసేవారు. శిలా విగ్రహాలను స్థాపించిన దాఖలాలు లేవు.

(చూ. ఆదిమాత విగ్రహాల చిత్రాలు. ఇవి తక్షశిల ప్రాంతంలోని భిర్ పీఠం వద్ద తవ్వకాలలో దొరికాయి)

ఆదిమాత విగ్రహాలు జేగురుమట్టితో చేసినవి తక్షశిల, కౌశాంబి, అహిచ్ఛత్ర, వారణాసి, పాట్నా, బక్సర్ తదితర ప్రాంతాల్లో లభించాయి. అప్పటి స్త్రీలలో అమిల, కిమిల, వాయుచార, ప్రయోగ, ఫక్క, వాయుహ్వా, విహల, దంతకాటక తదితర క్షుద్ర శక్తులను ఆరాధించే ఆనవాయితీ ఉండేదని అశోకుడి శాసనాలు ప్రస్తావించాయి. పురుషులలో కూడా ఇటువంటి క్షుద్రదేవతల ఆరాధన ఉండేది. దానితోబాటు రాక్షస, పిశాచ, భూత శక్తుల భయాన్ని పారదోలి, రక్షించగల శక్తి అధర్వణవేద మంత్రాలలో

ఉన్నదన్న మూఢనమ్మకాలు కూడా బలంగా ఉండేవని అశోకుడి శాసనాలు తెలుపుతున్నాయి.

అశోకుడి కాలం నుండి బౌద్ధం ఆధిపత్యం మన దేశంలో మొదలైంది. ఆ ఆధిపత్యం ఆ తర్వాత ఐదువందల సంవత్స రాలపాటు కొనసాగింది. తేరవాద, మహాయాన బౌద్ధ శాఖలు రెండూ విస్తృతంగా ప్రచారంలో ఉండేవి. 84 వేల బౌద్ధ విహారాలను అశోకుడు నిర్మించాడని అశోకవదన గ్రంధంలో ఉంది. ఈ సంఖ్య కొంత అతిశయోక్తిగా అనిపించినా, బౌద్ధ మత విస్తృతిని ఇది సూచిస్తుంది. సారనాథ్ లోని అశోకుడి స్థూపాలలో తేలికగా ఆదాయం సంపాదించదలచుకున్న కొందరు స్వార్ధపరులు బౌద్ధసన్యాసులుగా వేషం మార్చి బౌద్ధమతాన్ని కలుషితం చేస్తున్నారని, వారిని బహిష్కరించారని పేర్కొన్నారు.



FIG. 3.6 'Mother Goddess'. Terracotta figurines from Bhir Mound, Stratum II, Taxila. (Reprod. J. Marshall)

తక్షశిలలో లభించిన దేవతా మూర్తుల టెర్రకోటా విగ్రహాలు

క్రీ.పూ. 258 నుండి బౌద్ధాన్ని ప్రపంచ వ్యాప్త మతంగా ప్రచారం చేయడానికి అశోకుడు పూనుకున్నాడు. అందుకోసం బౌద్ధమత ప్రచారకులను గ్రీస్ దేశానికి, పశ్చిమ ఆసియా ప్రాంతానికి, ఆగ్నేయ ఆసియా ప్రాంతానికి, హిమాలయ ప్రాంతానికి పంపారు. అశోకుడి కాలంలోనే బౌద్ధం శ్రీలంకలో ప్రవేశించింది.

జైనమతం కూడా అశోకుడి కాలంలో విస్తరించింది. అదే సమయంలో చీలికలకు కూడా గురైంది. చంద్రగుప్తుని కాలంలో సంభవించిన పెద్ద కరువు కాలంలో జైన సన్యాసులు అక్కడినుండి కర్నాటక, తమిళ దేశాలకు వలసలు పోయారని శ్వేతాంబర జైన సాంప్రదాయం తెలియజేస్తోంది. ఆ విధంగా వలస పోకుండా ఉండిపోయినవారు శ్వేతాంబరులుగా, వలసలు పోయినవారు దిగంబరులుగా చీలిపోయారు.

బౌద్ధ., జైన మతాల మాదిరిగా దీర్ఘకాలంపాటు కొనసాగలేకపోయిన మతం అజివక మతం. అజివకులు సమాజానికి దూరంగా ఏకాంతంలో కాలం గడిపేవారని, అతి తక్కువ మోతాదులో అవసరాలు తీర్చుకునేవారని, యాచకవృత్తి ద్వారా పొట్ట పోసుకునేవారని, నగ్నంగా తిరిగేవారని, ఏ ప్రాణికీ అపకారం తలపెట్టకూడదన్నది వారి విధానం అని బౌద్ధ, జైన గ్రంధాలలో ఉంది. అజివకులకు అశోకుడు రెండు గుహలు కేటాయించి వారికి విరాళం ఇచ్చినట్టు శాసనాలు తెలుపుతున్నాయి. అశోకుడి వారసుల్లో దశరధుడు అనేవాడు అజివకులకు మూడు గుహలు విరాళం ఇచ్చినట్టు వివరాలు ఉన్నాయి. ఐతే ఆ తర్వాత కాలంలో ఎక్కడా ఈ అజివకులు అనేవారు కొనసాగినట్టు దాఖలాలు లేవు.

(సశేషం)

**జాతీయ పరిణామాలు**

# పారిశ్రామిక పునాదిని నాశనం చేస్తున్న మోడీ ప్రభుత్వం


రచయిత మార్క్సిస్టు పత్రిక బాధ్యులు

**ఎ.కోటిరెడ్డి**

నరేంద్ర మోడీ ప్రభుత్వం స్వాతంత్ర్యానంతరం మన దేశం సాధించిన పారిశ్రామిక పునాదిని దెబ్బతీయడం ద్వారా దేశానికి తీవ్ర ద్రోహం చేస్తున్నది. బిజెపి చేస్తున్న ద్రోహం ముందు బ్రిటీష్ పాలకులు కూడా చిన్నబోతారని కొన్ని ఉదాహరణలు చూస్తే మనకు స్పష్టమౌతుంది. బ్రిటీష్ పాలకులు తమ దేశంలోని పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం మనదేశ పారిశ్రామికాభివృద్ధిని దెబ్బతీశారు. దేశీయ పరిశ్రమలు, చేనేత, ఇతర వృత్తులపై అనేక ఆంక్షలు విధించారు. బ్రిటన్‌లో తయారవుతున్న సరుకులను స్వేచ్ఛగా మనదేశంలోకి దిగుమతి చేసుకున్నారు. పోటీకి తట్టుకోలేక దేశంలోని వృత్తులు, పరిశ్రమలు దెబ్బతిన్నాయి. బ్రిటన్‌లో తయారవుతున్న పారిశ్రా మిక సరుకులకు వినియోగదారుగా మనదేశం మారింది. ఆ విధంగా కోల్పోయిన పారిశ్రామిక పునా దిని తిరిగి నిర్మించుకోవటం కోసం స్వాతంత్ర్యానంతరం ప్రణాళికాబద్ధంగా ప్రయత్నం జరిగింది. కీలకమైన పరిశ్రమలను ప్రభుత్వరంగంలో నిర్మించుకోవటం పారిశ్రామికాభివృద్ధికి దారితీసింది. కొన్ని లోటుపాట్లు ఉన్నప్పటికీ చాలా దేశాల కన్నా పారిశ్రామికాభివృద్ధిలో ముందున్నాం. ఈ స్వతంత్ర ఆర్థికాభివృద్ధిని దెబ్బ తీయటం కోసం సామ్రాజ్యవాదులు అనేక ఆటంకాలు కల్పించారు. పారిశ్రామిక ప్రగతిని అడ్డుకోవటానికి పరిపరి విధాలుగా ప్రయత్నాలు చేశారు. కాని వారి వల్లకాలేదు. ఇపుడు ఆ పనిని బిజెపి ప్రభుత్వం చేస్తున్నది. ప్రభుత్వరంగాన్ని పూర్తిగా రద్దుచేసి, పారిశ్రామిక రంగాన్ని, దేశ ఆర్థికవ్యవస్థను సామ్రాజ్యవాదులు, కార్పొరేట్ల చేతుల్లో పెట్టటానికి అవసరమైన విధానాలను అమలుచేస్తున్నది.

స్వాతంత్ర్యానంతరం సామాజికంగా అనేక మార్పులు వచ్చాయి. జాతీయోద్యమ ప్రభావం, భూమికోసం సాగిన రైతాంగ ఉద్యమాలు ప్రభుత్వం పరిమితంగానైనా భూములు పంచక తప్పని పరిస్థితిని కల్పించాయి. కొద్దిమేరకే అయినా వివిధ కులాలకు చెందిన వారి చేతుల్లోకి భూమి వచ్చింది. విద్య, ఉద్యోగాలలో దళితులు, గిరిజనులకు కల్పించిన రిజర్వేషన్లు వారిని ప్రోత్సహించటానికి ఉపయో గపడ్డాయి. అంతకు ముందే విచ్ఛిన్నం కావటం మొదలైన ఫ్యూడల్ వ్యవస్థ, వృత్తుల విభజన బలహీనపడ్డాయి. అన్ని సామాజిక తరగతుల లోనూ విద్య విస్తరించింది. అన్ని కులాలు, మత సమూహాలకు చెందిన వారు ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థలలో ఉద్యోగాలు చేయటం ప్రారంభమైంది. వివిధ రకాలైన వృత్తులు, వ్యాపారాలలోకి అన్ని రకాల వారూ ప్రవేశించారు. అంటరానితనం తీవ్రత తగ్గింది. అన్ని కులాల వారి చేతుల్లోకి భూమి రావటం, విద్య నేర్చుకోవటం, ఉద్యోగాలు చేయటంతో సామాజికంగా దిగువనున్న కులాలు, తరగతులు పైస్థాయికి రావటం ప్రారంభమైంది.

రాజకీయరంగంలో సాధించిన అభివృద్ధి వలన ప్రజాస్వామిక వ్యవస్థలు, భావజాలం విస్తరించాయి. గ్రామ పంచాయితి సర్పంచ్ నుండి పార్లమెంటు వరకు ప్రజలు ఓటుహక్కును ఉపయోగించుకొని ఎన్నుకుంటున్నారు. రాజకీయరంగంలో కల్పించిన రిజర్వేషన్ల వలన దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలకు చెందిన వారు తగిన సంఖ్యలో చట్టసభలకు ఎన్నికౌతున్నారు. మంత్రులు, ముఖ్యమంత్రులు, ఉపరాష్ట్రపతి, రాష్ట్రపతి తదితర పదవులకు ఎన్నికౌతున్నారు. మొత్తంగా దోపిడీ వర్గాల ఆధిపత్యం కొనసాగుతున్నప్పటికీ వివిధ తరగతులలోని పైస్థాయి వారు కూడా పాలనా వ్యవస్థలో భాగమయారు. ఆయా తరగతులలోని వారికి భూములు, ఇతర విధాలైన ఆస్తులు, సంపద పెరిగాయి. ఫలితం గా సామాజికంగా వారి స్థాయి పెరిగింది.

మనుస్మృతికి అనుగుణమైన సామాజిక వ్యవస్థను నెలకొల్పటానికి పూనుకున్న సంఘ్ పరివార్‌కు ఈ విధమైన సామాజికాభివృద్ధి ఎంతమాత్రమూ ఆమోదయోగ్యం కాదు. చాతుర్వర్ణ వ్యవస్థను తిరిగి నెలకొల్పటానికి ఈ పరిణామాలు వారికి ఆటంకంగా ఉన్నాయి. అందువలన ఈ అభివృద్ధిని వెనక్కు మళ్ళించటానికి, సమాజాన్ని తిరిగి చాతుర్వర్ణ వ్యవస్థ కాలం నాటికి తీసుకెళ్ళటానికి పూనుకున్నారు. అందుకోసమే అభ్యుదయాశాలలన్నింటిపైనా దాడి చేస్తున్నారు.

దేశంలో మతపరమైన విభజనలను తీవ్రం చేస్తూ, దేశాన్ని బలహీనం చేస్తున్నారు. వలస పాలనకు వ్యతిరేకంగా భారతీయులు సమైక్యంగా పోరాటం చేయటాన్ని జీర్ణించుకోలేని బ్రిటీష్ పాలకులు కుల, మత, ప్రాంతాల ప్రాతిపదికగా ప్రజలను విడదీయటం ద్వారా ఐక్యతను విచ్ఛిన్నం చేయటానికి పూనుకున్నారు. పరాయి పాలకులు భారతీయులను అణచివేయటానికి ఉపయోగించిన ఆయుధాన్ని ఈ రోజు సంఘ్ పరివార్ ఉపయోగిస్తున్నది. అంటే భారత ప్రజలను అణచివేయటం, వారిని మతపరంగా చీల్చటం బ్రిటీష్ వారికి ఉపయోగపడినట్లుగానే సంఘ్ పరివార్‌కు ఉపయోగపడుతున్నది. అయితే స్వదేశీయులుగా, అసలైన భారతీయులుగా చెప్పుకుంటున్న సంఘ్ పరివార్‌కు బ్రిటీష్ వారి తరహాలోనే భారతీయుల మధ్య మతపరమైన విభజనను పెద్దది చేయాల్సిన అవసరం ఏమొచ్చింది? విదేశీ పాలకులకు వచ్చిన అవసరం అసలైన స్వదేశీ పాలకులమని తమకుతాము కితాబులిచ్చుకుంటున్నవారికి ఎందుకొచ్చింది?

సంఘ్ పరివార్‌కు, దాని ప్రతినిధిగా దేశాన్ని పాలిస్తున్న బిజెపికి బ్రాహ్మణవాదాన్ని, చాతుర్వర్ణ వ్యవస్థను, దానిని ప్రబోధిస్తున్న మనుస్మృతిని అమలుచేయటమే ప్రధానలక్ష్యం. అందుకోసం కేవలం బ్రాహ్మణవాదాన్ని, చాతుర్వర్ణ వ్యవస్థను కాపాడటం కోసం మాత్రమే వారికి హిందువులను ఒకటి చేయాల్సిన అవసరం వచ్చింది. కాని ఆ విషయాన్ని బహిరంగంగా ప్రకటిస్తే హిందువులు ఒకటి కావటం కాదు, మరింతగా విభజన పెరుగు

“ అందువలన బిజెపి ప్రభుత్వ విధానాలు దేశాన్ని ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అధోగతికి దిగజారుస్తాయి. సంఘ్ పరివార్ సహా సామ్రాజ్యవాదుల వరకు కావలసినది ఇదే. అందువలననే ఈ కూటమి ఐక్యంగా వ్యవహరిస్తూ కార్మికవర్గం, రైతాంగం, అభ్యుదయశక్తులపై దాడి చేస్తున్నది. దీనిని వ్యతిరేకించే శక్తులపై తీవ్రమైన దుష్ప్రచారం చేస్తున్నారు. నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారు. ”

తుంది. సంఘ్ పరివార్ దేశప్రజలకు అంతరానిదైపోతుంది. కాబట్టి దానిని తమ రహస్య ఎజెండాగా ఉంచి, మైనారిటీ ముస్లింలపై ప్రజలలో సందేహాలు రేకెత్తిస్తు న్నారు. వారు కుట్రలు చేస్తున్నారని, జనాభాను పెంచుతున్నారని, కొద్దికాలంలోనే భారతదేశం ముస్లిందేశంగా మారుతుందనే భయాన్ని హిందువులలో పెంచుతున్నారు. అకారణంగా ముస్లింలపై దాడులు, హత్యలు చేస్తున్నారు. వారి జీవనోపాధులను దెబ్బతీస్తున్నారు. ఈ విధమైన భయాలను రేకెత్తించటం ద్వారా హిందువుల మధ్య ఉన్న వైరుధ్యాలు, అణచివేత, సామాజిక పీడన తదితరాలను కప్పిపుచ్చటానికి ప్రయత్నం చేస్తున్నారు. ఇదే సమయంలో ఏనాటి కన్నా ఎక్కువగా సామాన్యప్రజలపై ఆర్థికదోపిడీని తీవ్రం చేశారు. దోపిడీకి మతం ముసుగు వేస్తున్నారు. సామ్రాజ్యవాదుల దోపిడి, దేశంలోని బడా పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్లు, ఫ్యూడల్శక్తుల దోపిడి, సంఘ్ పరివార్ హిందుత్వ ఉన్మాదం కలగలిసిపోయాయి. కాబట్టే ఈ శక్తులన్నీ సంఘ్ పరివార్ విద్వేషపూరిత విధానాలకు సంపూర్ణ మద్దతునిస్తున్నాయి.

అందువలన బిజెపి ప్రభుత్వ విధానాలు దేశాన్ని ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అధోగతికి దిగజారుస్తాయి. సంఘ్ పరివార్ సహా సామ్రాజ్యవాదుల వరకు కావలసినది ఇదే. అందువలననే ఈ కూటమి ఐక్యంగా వ్యవహరిస్తూ కార్మికవర్గం, రైతాంగం, అభ్యుదయశక్తులపై దాడి చేస్తున్నది. దీనిని వ్యతిరేకించే శక్తులపై తీవ్రమైన దుష్ప్రచారం చేస్తున్నారు. నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారు. కాని భారతీయ సమాజం ఆర్ఎస్ఎస్ కట్టుబాట్లలో ఒదిగిపోవటానికి, సాధించిన అభివృద్ధిని వమ్ముచేసుకోవటానికి సిద్ధంగా లేదు. వివిధ తరగతులు, సామాజిక శక్తుల నుండి ఈ విధానాలకు ప్రతిఘటన పెరుగుతున్నది. ఈ శక్తులు సంఘ్ పరివార్ విద్వేష విధానాలకు సమాధి కట్టి, సామాజిక ఐక్యతను కాపాడ గలవు. సంఘ్ పరివార్ నాయకత్వంలో ఉన్న దోపిడి, ప్రతీఘాతుక శక్తులకు, లౌకికశక్తుల నాయకత్వంలోని కార్మిక, కర్షక, అభ్యుదయ శక్తుల మధ్య జరుగుతున్న పోరాటం సమాజ గతిని నిర్ణయించనుంది. మతోన్మాదశక్తులు తాత్కాలికంగా విజయాలు సాధించినప్పటికీ అభ్యుదయ శక్తులు మతోన్మాద శక్తులను ఓడించి, సమాజాన్ని ప్రగతి పథంలో పయనింపజేయటం తథ్యం.

అయితే ఈ పోరాటంలో కొన్ని బూర్జువా లౌకికపార్టీలు వేస్తున్న పిల్లిమొగ్గలను ప్రజలు గమనిస్తున్నారు. టిఎంసి అధినేత్రి మమతాబెనర్జి తానే బిజెపిని ఎదుర్కొంటున్నట్లు, బిజెపి ప్రభుత్వాన్ని అధికారం నుండి తొలగించి, కేంద్రంలో ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి తానే నేతృత్వం వహించనున్నట్లు ఫోజులు పెట్టింది. బెంగాల్లో బిజెపికి వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటం చేస్తున్నట్లు ప్రచారం చేసుకుంది. టిఎంసి పాల్పడుతున్న అవినీతి, ఆ పార్టి నాయకుల అక్రమాలను ఆధారం చేసుకొని కేంద్రం ఇడి, సిబిఐ తదితర సంస్థలను ఉపయోగించి నాయకులపై కేసులు నమోదు చేయటం, విచారణ జరగటం ప్రారంభమైన తర్వాత అనేక అవినీతి ఉదంతాలు వెలుగు లోకి వచ్చాయి. ఆ పార్టి నాయకులు అనేక మంది ఇంకా కేసులలో ఇరుక్కోవటానికి అవకాశాలు ఉన్నాయని స్పష్టమౌతున్నది. స్వయానా మమతాబెనర్జికి రాజకీయ వారసుడుగా పరిగణించబడుతున్న ఆమె మేనల్లుడు కూడా అవినీతిలో కూరుకుపోయాడని వాస్తవాలు వెల్లడిస్తున్నాయి.

ఇటువంటి పరిస్థితులలో మమతాబెనర్జి హఠాత్తుగా ప్లేటుమార్చి, ఆర్ఎస్ఎస్, బిజెపిల భజన ప్రారంభించింది. ఆర్ఎస్ఎస్లో ఉన్న వారందరూ చెడ్డవారు కాదని, కేంద్రం ఇడి, సిబిఐ, ఎన్ఐఎ తదితరాలను దుర్వినియోగం చేయటం ప్రధానికి తెలియదని ప్రకటించింది. ఇంతకాలం గవర్నర్గా ఉన్నవ్యక్తి తమ ప్రభుత్వానికి ఇబ్బందులు కలిగిస్తున్నాడని చేస్తున్న ఆరోపణలను దిగమింగి, ఆయన ఉప రాష్ట్రపతి కావటానికి లైన్క్లియర్ చేసింది. ప్రతిపక్షాల అభ్యర్థికి మద్దతు ఇవ్వటానికి, కనీసం ఓటింగ్లో పాల్గొనటానికి కూడా సిద్ధం కాలేదు. ఇంతకన్నా కాళ్ళబేరానికి రావటం ఉంటుందా? ఆర్ఎస్ఎస్, బిజెపిలు మంచివైతే ఇంతకాలం ఎందుకు వ్యతిరేకించినట్లు? ఇంతకాలం లేని మంచి వాటిలోకి హఠాత్తుగా వచ్చిందా? వాటిలో అంతమంచి ఉందని భావిస్తున్న మమతాబెనర్జి వాటి విధానాలకు వ్యతిరేకంగా పోరాటానికి ముందుకువస్తుందా? ఒకవైపున వాటి మంచిని గురించి పొగుడుతూ మరోవైపున వాటిపై పోరాటం చేయటం సాధ్యమౌతుందా?

ఈ విధంగా మమతాబెనర్జి ప్రకటనలు చేయటం ద్వారా బిజెపి-టిఎంసిల లాలూచి కుస్తీని గురించి కూడా ప్రజలు అర్థం చేసుకోవటానికి అవకాశం వచ్చింది. బెంగాల్లో బలంగా ఉన్న వామపక్షాలను బలహీనపరచటానికి, లౌకిక, అభ్యుదయశక్తులను దెబ్బతీయటానికి ఈ రెండు పార్టీలు పథకం ప్రకారం మత విభజనలను తీవ్రం చేశాయి. సంఘ్ పరివార్ సంస్థలను వెనుకవేసుకున్న బిజెపి హిందువుల ప్రయోజనాల రక్షకుడుగా ఫోజు పెట్టి, మైనారిటీలపై వ్యతిరేకతను పెంచటానికి ప్రయత్నం చేసింది. దానిని ఎదుర్కొనేది, ముస్లిం మైనారిటీలకు రక్షణ కల్పించేది తానేనని టిఎంసి ప్రచారం చేసుకుంది. ఈ విధంగా మతపరంగా ప్రజలను విభజించటం ద్వారా వామపక్షాలను బలహీనపరచాలన్న వారి లక్ష్యం కొంతవరకు నెరవేరింది. ఇపుడు మమతాబెనర్జి వేస్తున్న పిల్లిమొగ్గలు ఆ రెండు పార్టీలు బెంగాల్ ప్రజలను విభజించటానికి కుట్రపూరితంగా వ్యవహరించిన విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఈ విధంగా బిజెపితో లాలూచి పడి, కాళ్ళబేరానికి వచ్చిన టిఎంసి బిజెపి, సంఘ్ పరివార్ను ప్రతిఘటించటం సాధ్యమౌతుందా?

ఆప్ పార్టిపై కూడా బిజెపి ప్రభుత్వం దాడి చేస్తున్నది. ఢిల్లీలో ఉన్న ఆప్ ప్రభుత్వానికి అడుగడుగునా ఆటంకాలు కల్పించటం, నాయకులపైకి విచారణా సంస్థలను ఉసిగొలపటం, సంఘ్ పరివార్ మూకచేత నాయకులపై దాడులు చేయించటం జరుగుతున్నది. ఆప్ వీటిని ఎదుర్కొంటున్నది. కాని జాతీయ స్థాయిలో ప్రతిపక్షాలతో కలిసి బిజెపికి వ్యతిరేకంగా వ్యవహరించటానికి సిద్ధం కావటం లేదు. ప్రత్యామ్నాయ విధానాలను కాక మృదు హిందుత్వ విధానాలను అనుసరించటానికి, ముస్లిం వ్యతిరేకతను సొమ్ము చేసుకోవటానికి ప్రయత్నిస్తున్నది. ప్రధాన

> **❝ ఇటువంటి పరిస్థితులలో సంఘ్ పరి వార్, బిజెపి అనుకూల శక్తులను ప్రతిఘటించ టంలో సిపిఐ(ఎం), వామపక్ష శక్తులు ప్రధాన పాత్ర నిర్వహిస్తున్నాయి. ప్రస్తుతం రాజకీయంగా కొంత బలహీనపడినప్పటికీ సంఘ్ పరివార్ సైద్ధాంతిక దృక్పధాన్ని నికరంగా వ్యతిరేకించగల, తమ ప్రత్యామ్నాయ విధానాల వెనుక ప్రజలను సమీకరించగల శక్తి వామపక్షాలకు మాత్రమే ఉంది. ❞**

ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ విధానాలు వారికే అయోమయంగా ఉన్నాయి. బిజెపి మతోన్మాద విధానాలను ప్రతి ఘటించటం కన్నా తాము కూడా హిందువుల ప్రయోజనాల కోసం నిలబడుతున్నామని రుజువు చేసుకోవటం, బిజెపి మతోన్మాద విధానాలను నికరంగా ప్రతిఘటిస్తున్న కమ్యూనిస్టులను బలహీన పరచటం కోసం ప్రయత్నం చేస్తున్నారు. ఇక వివిధ రాష్ట్రాలలో ఉన్న కొన్ని ప్రతిపక్ష పార్టీలు, వైసిపి, టిడిపి, బిజెడి తదితరాలు తమ స్వప్రయోజనాల కోసం బిజెపికి దాసోహం అంటున్నాయి.

ఇటువంటి పరిస్థితులలో సంఘ్ పరి వార్, బిజెపి అనుకూల శక్తులను ప్రతిఘటించ టంలో సిపిఐ(ఎం), వామపక్ష శక్తులు ప్రధాన పాత్ర నిర్వహిస్తున్నాయి. ప్రస్తుతం రాజకీయంగా కొంత బలహీనపడినప్పటికీ సంఘ్ పరివార్ సైద్ధాంతిక దృక్పధాన్ని నికరంగా వ్యతిరేకించగల, తమ ప్రత్యామ్నాయ విధానాల వెనుక ప్రజలను సమీకరించగల శక్తి వామపక్షాలకు మాత్రమే ఉంది. అందువలన బిజెపి, సంఘ్ పరివార్ విధానాలను వ్యతిరేకించే వారిని సమీకరించే కృషిలో వామపక్షాలు అగ్రభాగాన ఉంటాయి. బిజెపి వ్యతిరేకశక్తుల సమీకరణ పెరుగుతున్న కొద్ది ప్రతిపక్ష పార్టీల ఊగిసలాటలు కూడా తగ్గి, అనివార్యంగా పోరాటంలోకి రావలసిన పరిస్థితులు ఏర్పడతాయి. కాబట్టి కమ్యూనిస్టు, వామపక్ష పార్టీల నాయకత్వంలో కార్మిక, కర్షక, ఇతర పీడితవర్గాల ప్రజలు సంఘ్ పరివార్ విధానాలకు వ్యతిరేకంగా జరిపే భీకర పోరా టమే దేశ భవిష్యత్‌ను నిర్ణయించనుంది.

### కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికలు

సంవత్సరాల తరబడి వాయిదా పడుతూ వస్తున్న కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికలు అక్టోబరు 17 తేదీన జరపాలని నిర్ణయించారు. ఎన్నికలు జరుగుతాయని ప్రకటించిన తర్వాత కూడా కాంగ్రెస్ సాంప్రదాయం ప్రకారం, గాంధీల మెప్పుకోసం కొన్ని రాష్ట్రాల కాంగ్రెస్ కమిటీలు రాహుల్‌గాంధి అధ్యక్షుడుగా ఉండాలని తీర్మానాలు చేసి పంపించాయి. రాహుల్‌గాంధి తిరస్కరించిన తర్వాత గాంధీలకు విధేయంగా ఉండేవారి కోసం అన్వేషణ చేశారు. రాజస్థాన్ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అశోక్ గెహ్లాట్ అయితే విధేయంగా ఉంటాడని భావించి, అధ్యక్ష పదవికి ఆయన పేరును దాదా పుగా ఖరారు చేశారు. ఒక నాయకునికి ఒకే పదవి అన్న సూత్రం ప్రకారం అశోక్ గెహ్లాట్‌ను రాజస్థాన్ ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పించి, ఆ స్థానంలో సచిన్ పైలట్‌ను కూర్చోబెట్టాలని భావించారు. కాని సచిన్ పైలట్‌కు ముఖ్యమంత్రి పదవిని ఇవ్వటానికి అశోక్‌గెహ్లాట్ ఏ మాత్రం సుముఖంగా లేడు. నూతన ముఖ్యమంత్రిని ఎన్నుకోవటానికి వచ్చిన కాంగ్రెస్ ప్రతినిధుల సమక్షంలో గెహ్లాట్, ఆయన గ్రూపు నడిపిన డ్రామాకేంద్ర నాయకత్వానికి వ్యతిరేకంగా పూర్తిస్థాయి తిరుగుబాటుగా మారింది. అధికార ప్రతినిధుల సమక్షంలో జరగాల్సిన సమావేశాన్ని పక్కన పెట్టి, ఆయన గ్రూపు శాసనసభ్యులు వేరుగా సమావేశమై, గెహ్లాట్‌నే ముఖ్యమంత్రిగా కొనసాగించాలని, ఒకవేళ ముఖ్యమంత్రిని మార్చాల్సివస్తే తమగ్రూపులోని వారినే ముఖ్యమంత్రిని చేయాలని, పైలట్‌ను ముఖ్య మంత్రిగా చేయాలనుకుంటే తమగ్రూపు శాసనసభ్యులు మూకుమ్మడిగా రాజీనామా చేస్తారని ప్రకటించారు. దీనిలో తన ప్రమేయం లేదని అశోక్ గెహ్లాట్ చెబుతున్నప్పటికీ, ఆయన ప్రమేయం లేకుండా ఈ విధంగా సమావేశం జరపటం, తీర్మానం చేయటం సాధ్యమయేది కాదు. దానితో అనివార్యంగా అధ్యక్ష రేసు నుండి గెహ్లాట్‌ను తప్పించాల్సివచ్చింది.

తర్వాత దిగ్విజయసింగ్ పేరు రంగం లోకి వచ్చింది. అంతిమంగా నామినేషన్లు దాఖలు చేసే గడువు పూర్తయే టప్పటికి శశి థరూర్, మల్లిఖార్జున ఖార్గే, మరొకరు నామినే షన్లు దాఖలు చేశారు. తనకు ఎక్కువ మంది మద్దతు ఉందని శశిథరూర్ ప్రచారం చేసుకుం టున్నాడు. తమ కుటుంబం అధ్యక్ష ఎన్నికలలో పోటీ చేసి బాధ్యతలను చేపట్ట నప్పటికీ, తమ విధేయుడు ఎన్నికయేలా చేసి, పార్టీపై తమపట్టు ఏ మాత్రం సడలకుండా చూసుకోవాలని గాంధీల కుటుంబం, వారి అనుయాయులు ప్రయత్నం చేస్తున్నారు. వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే ఈ ప్రయత్నంలో గాంధీల కుంటుంబం విఫలమౌతుందని స్పష్టమౌతుంది. కాంగ్రెస్ పార్టీ బలహీనపడటం కన్నా వేగంగా కాంగ్రెస్ పార్టీపై గాంధీల నాయకత్వం బలహీనపడుతున్నది. దాదాపుగా నాలుగు దశాబ్దాల కాలంలో కాంగ్రెస్ పార్టీకి ఇతరులు కూడా అధ్యక్షులైనప్పటికీ, ఇందిరా గాంధి కుటుంబంతోనే నాయకత్వం మమేకమై ఉంది. ఇతరుల నాయకత్వాన్ని ఆ పార్టీ అఖిలభారత, రాష్ట్రస్థాయి నాయకత్వాలు కూడా పరిగణనలోకి తీసుకోలేదు. మొత్తం పార్టీ నిర్మాణ వ్యవహారాలను ఇందిరాగాంధి, తర్వాత రాజీవ్‌గాంధి, అనంతరం సోనియా గాంధి చక్కబెడుతూ వచ్చారు. కేంద్రంలో అధికారంలో ఉన్నపుడు, లేనపుడు కూడా ప్రజలలో గుర్తింపు, పార్టీ నాయకత్వంలోని వారిలో ఎక్కువ మంది విశ్వాసం పొందివు న్నారు.

ప్రస్తుతం రాహుల్, ప్రియాంకగాంధీలకు అటువంటి పరిస్థితి లేదు. తమకు ముందున్న వారివలె వారికి విస్తారమైన ప్రజా మద్దతు లేదు. పార్టీ నాయకత్వంలో ఎక్కువ భాగానికి వారిపై పూర్తి విశ్వాసం లేదు. తమ ముందు నాయకులవలె పార్టీ అధ్యక్ష బాధ్యతలలో ఉండి వారు వ్యవహరించటం లేదు. తమ తల్లి నాయకత్వంలో, చాలాకాలం నుండి తమ కుటుంబ పెత్తనంలో ఉన్న పార్టీ నాయకులతో వ్యవహరిస్తున్నారు. వారు వ్యవహారాలు నడుపుతున్న నాయకులు అనుభవం కలిగి, రాజకీయాలలో ఢక్కామొక్కీలు తిన్నవారున్నారు. ఈ క్రమంలో పార్టీ కన్నా, గాంధీల కుటుంబ నాయకత్వం వేగంగా బలహీనపడింది. పార్టీపై పట్టు వేగంగా క్షీణిస్తున్నది. తమ నాయకత్వం బలహీనపడుతుందని గమనించినా, తమ పూర్వీకుల వలెనే పార్టీపై పూర్తిగా పెత్తనం చేయాలని చూస్తున్నారు. కాని అది సాధ్యం కాదని జరుగుతున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. మొన్నటి వరకు విధేయునిగా ఉన్న అశోక్‌గెహ్లాట్ మరుచటి రోజు తిరుగుబాటు దారుడయాడు. ఇపుడు రేసులోకి తీసుకొచ్చిన మల్లిఖార్జున ఖార్గే కూడా రేపు ఇదేవిధంగా వ్యవహరించవచ్చు. అందువలన పార్టీలో ప్రజాస్వామ్య విధానాలను అనుసరించటానికి, పార్టీపై గాంధీల కుటుంబ

పెత్తనానికి పోసగే పరిస్థితులు లేవు. కాబట్టి ఎన్నికలు జరిగి ఎవరు అధ్యక్షుడుగా ఎన్నికైనా వారు గాంధీల కుటుంబ పెత్తనంలో ఉంటారనేది జరగకపోవచ్చు. ఒకవైపు కుటుంబ పెత్తనం, మరోవైపు ఎన్నికైన అధ్యక్షుని ప్రాధాన్యతలు ఆ పార్టీ మరింత త్వరగా బలహీనపడటానికి దారితీయవచ్చు. పార్టీల నాయకత్వాలను కుటుంబాలకు పరిమితం చేసిన బూర్జువా రాజకీయ పార్టీలు చివరికొచ్చే సరికి ఇటువంటి పరిణామాలను ఎదుర్కోవటం అనివార్యం. జరుగుతున్న పరిణా మాల నుండి పాఠాలు తీసుకొని, అంతర్గత ప్రజాస్వామ్యం ప్రాతిపదికగా పార్టీని నడపటానికి పూనుకుంటే ఆ పార్టీ మరికొంతకాలం ప్రధాన రాజకీయ పార్టీలలో ఒకటిగా మనుగడ సాగించ టానికి అవకాశాలు ఉంటాయి. అలాకాకపోతే ఆ పార్టీ విచ్ఛిన్నమయే క్రమం మరింత వేగం పుంజుకుంటుంది.

### అగమ్యంగా భారత్ జోడో యాత్ర

రాహుల్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ సెప్టెంబరు 7వ తేదీన తమిళనాడులోని కన్యాకుమారి నుండి భారత్ జోడో యాత్రను ప్రారంభించింది. ఈ యాత్ర 150 రోజులు జరుగుతుందని, భారతదేశాన్ని ఐక్యం చేయటం, బలపరచటం యాత్ర లక్ష్యమని ఆ పార్టీ ప్రకటించింది. కన్యాకుమారిలో ప్రారంభమైన యాత్ర 12 రాష్ట్రాలలో 3500 కిలోమీటర్ల దూరం సాగి జమ్మూ-కాశ్మీర్‌లో ముగుస్తుంది. ఈ యాత్ర కేరళలో సెప్టెంబరు 13 నుండి 30వ తేదీ వరకు 18 రోజుల పాటు జరుగుతుంది. తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, హర్యానా, పంజాబ్, జమ్మూ-కాశ్మీర్‌లలో యాత్ర జరుగుతుంది. తమిళనాడులో వారం రోజులు, కేరళలో 18 రోజులు, కర్ణాటకలో 21 రోజులు ప్రయాణిస్తుంది. అక్టోబరు 24వ తేదీన తెలంగాణలోకి ప్రవేశించి, 13 రోజులు పర్యటిస్తుంది. మహారాష్ట్రలో నవంబరు 7న ప్రవేశించి, 16 రోజుల పాటు పర్యటిస్తుంది. నవంబరు 25న మధ్యప్రదేశ్‌లోకి ప్రవేశించి, ఆ రాష్ట్రంలో 16 రోజులు ప్రయాణిస్తుంది. రాజస్థాన్‌లో 21 రోజులు పర్యటిస్తుంది. ఢిల్లీలో రెండు రోజులు, హర్యానాలో 12 రోజులు, పంజాబ్‌లో 12 రోజులు పర్యటించిన తర్వాత జమ్మూ-కాశ్మీర్‌లోకి ప్రవేశిస్తుంది. మొదట ప్రకటించిన కార్యక్రమం ప్రకారం ఉత్తరప్రదేశ్‌లో రెండు రోజులు మాత్రమే యాత్ర జరుగుతుంది. కేరళలో 18 రోజులు, యుపిలో 2 రోజులు పర్యటించటం ద్వారా బిజెపిపై పోరాటం నిజస్వరూపం వెల్లడౌతున్నదన్న విమర్శలు తీవ్రమైన తర్వాత ఆ రాష్ట్రంలో ఐదురోజులు పర్యటించే విధంగా కార్యక్రమాన్ని మార్చారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీ, ఛత్తీస్‌ఘర్‌లలో వచ్చే సంవత్సరం మొదట్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

> **“ ఈ కార్యక్రమం చూస్తేనే కాంగ్రెస్ బలహీనత ఏమిటో వెల్లడౌతుంది. భారతదేశాన్ని ఐక్యం చేస్తామని, బలపరుస్తామని యాత్రను ప్రారంభించిన వారు ఐక్యతకు విఘాతం కలిగించే, దేశాన్ని బలహీనం చేస్తున్న హిందుత్వశక్తుల బలమైన స్థావరాలను మినహాయించటం వారి ప్రస్వదృష్టికి నిదర్శనం అనుకోవాలా? బిజెపి- సంఘ్ పరివార్‌పై విధానపరమైన పోరాటం చేసేవారెవరైనా యుపి, గుజరాత్‌లను మినహాయిస్తే అర్థమేముంటుంది? ”**

ఈ కార్యక్రమం చూస్తేనే కాంగ్రెస్ బలహీనత ఏమిటో వెల్లడౌతుంది. భారతదేశాన్ని ఐక్యం చేస్తామని, బలపరుస్తామని యాత్రను ప్రారంభించిన వారు ఐక్యతకు విఘాతం కలిగించే, దేశాన్ని బలహీనం చేస్తున్న హిందుత్వశక్తుల బలమైన స్థావరాలను మినహాయించటం వారి ప్రస్వదృష్టికి నిదర్శనం అనుకోవాలా? బిజెపి-సంఘ్ పరివార్‌పై విధానపరమైన పోరాటం చేసేవారెవరైనా యుపి, గుజరాత్‌లను మినహాయిస్తే అర్థమేముంటుంది? కొన్ని రాష్ట్రాలలో ఎక్కువ రోజుల పర్యటనకు ఆ రాష్ట్రాలలో ఎక్కువ దూరం ప్రయాణించాల్సిరావటమే కారణమని చెబుతున్నారు. కాని ఆ రాష్ట్రాలలో అంతదూరం ప్రయాణించకుండానే యాత్ర మార్గాన్ని రూపొందించుకోవచ్చు. గుజరాత్‌ను కూడా యాత్రలో భాగం చేసి, ఆ రాష్ట్రం, యుపిలలో ఎక్కువ రోజులు గడిపేలా ప్లాన్ రూపొందించుకుంటే కొన్ని రాష్ట్రాలను వదిలేసినా సమస్యే ముండదు. కాని కాంగ్రెస్ పార్టీ బిజెపి విధానాలపై చేయాల్సిన పోరాటాన్ని వదిలివేసి, ఏ మాత్రం ప్రాధాన్యత లేని యాత్రమార్గాన్ని ఎంచుకొని, ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. దీని వలన ఆ పార్టీకి కలిగే ప్రయోజనం నామ మాత్రమే. బలహీనపడుతున్న తమపార్టీని బలపరుచుకోవాలంటే బిజెపి విధానాలను గట్టిగా ప్రతిఘటించటం అవసరం. దానిని వదిలివేసి, కమ్యూనిస్టులు, అభ్యుదయ శక్తులపై దాడిచేయటం కొనసాగిస్తే ప్రజల నుండి మరింతగా దూరమౌతారు. దానిని గమనించకుండా, మతోన్మాదశక్తులను ప్రతిఘటించకుండా కమ్యూనిస్టులు, అభ్యుదయశక్తులపై దాడిని కేంద్రీకరిస్తే ఆపార్టీ పతనం మరింత వేగవంతం అవుతుంది.

### అబార్షన్‌పై సుప్రీంతీర్పు సంఘ్ పరివార్‌కు చెంపపెట్టు

దేశంలో మనుస్మృతిని అమలుచేయాలని ఆర్ఎస్ఎస్ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుంటే మరోవైపున అబార్షన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వారికి చెంపపెట్టుగా పరిణమించింది. మహిళలను పురుషుని ఆధిపత్యంలో ఉంచటం, వారిని సంతానం కనే యంత్రాలుగా పరిమితం చేయాలన్న సంఘ్ పరివార్ భావజాలాన్ని ఈ తీర్పు పూర్తిగా వ్యతిరేకించింది. ఇష్టం లేని గర్భాన్ని తొలగించుకొనే హక్కు మహిళలందరికీ ఉందని, ఇందుకు పెళ్ళితో సంబంధం లేదని, పెళ్ళి తర్వాత కూడా భార్య అంగీకారం లేకుండా భర్త వ్యవహరిస్తే దానిని అత్యాచారంగానే పరిగణించాలని చెప్పిన అంశాలు ప్రాధాన్యత కలవి. తన శరీరం పైన మహిళ హక్కులను నొక్కిచెప్పేవి. పుట్టినప్పటి నుండి మరణించే వరకు స్త్రీలు తండ్రి, భర్త, కుమారుని ఆధీనంలో ఉండాలని, స్వతంత్రంగా వ్యవహరించరాదని చెబుతున్న మనుస్మృతికి పూర్తి భిన్నమైనవి.

మనుస్మృతి, సంఘ్ పరివార్ ప్రవచిస్తున్న కట్టుబాట్లను దాటి భారతీయ సమాజం ఇప్పటికే సుదూరం పురోగమించింది. ఆ పురోగమనాన్ని వెనక్కు తిప్పాలని, తిరిగి బ్రాహ్మణాధిక్యతను సమాజంపైన రుద్దాలని వారు ప్రయాస పడుతున్నారు. పురోగమనాన్ని అడ్డుకోవటానికి సంఘ్ పరివార్ చేస్తున్న ప్రయత్నాలు సమాజంలో కొంత విధ్వంసానికి దారితీయవచ్చు కాని పురోగమనాన్ని అడ్డుకోలేవు. తాత్కాలికంగా కొంత వెనుకడుగు వేసినా అభ్యుదయ శక్తులు పుంజుకొని, ప్రతీఘాతుక విధానాలను ప్రతిఘటించి, అభ్యుదయ పథంలో శరవేగంతో పురోగమిస్తాయి. సుప్రీంకోర్టు తీర్పు అభ్యుదయశక్తులు వేగంగా సమీకృతం కావటానికి, కాలం చెల్లిన సంఘ్ పరివార్ విధానాలను ప్రతిఘటించటాన్ని త్వరితం చేయటానికి దారితీస్తుంది.

❋

# ఇటలీ ఎన్నికలు - ఇయు సంక్షోభం


రచయిత మార్క్సిస్టు పత్రిక సంపాదకులు

**ఎస్ వెంకట్రావు**

సెప్టెంబర్ 22న ఇటలీలో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో.. ముస్సోలినీ ఫాసిస్టు పార్టీలో నేరుగా మూలాలు కలిగి ఉన్న పచ్చి–మితవాద 'ఇటలీ సోదరుల పార్టీ' (బ్రదర్స్ ఆఫ్ ఇటలీ– ఫ్రాటెల్లీ డి ఇటాలియా) మెరిటీ ఓట్లు, సీట్లు సంపాదించి అధికార పగ్గాలు చేపట్టడానికి సిద్ధమైంది. ఆ పార్టీ నాయకురాలు జార్జియా మెలోనిని ప్రభుతం ఏర్పాటు చేయాలని దేశాధ్యక్షుడు సెర్జియో మట్టరెల్లా పిలిచే అవకాశాలు మెండుగా ఉన్నాయి. అక్టోబర్ నెలాఖరులో మెలోని ప్రభుత్వం అధికార పగ్గాలు చేపడితే ఆమె ఇటలీకి ఎన్నికైన మొదటి మహిళా ప్రధాని అవుతారు. రెండో ప్రపంచ యుద్ధం తరువాత మొట్ట మొదటి సారిగా పచ్చిమితవాద ఫాసిస్టు తరహా పార్టీ అధికారం చేపట్టినట్లవుతుంది.

తీవ్రమైన ఆర్థిక సామాజిక సంక్షోభంలో కూరుకుపోయిన ఇటలీలో ప్రజాపోరాటాల వెల్లువను నివారించేందుకు గాను అమెరికా, ఐరోపా యూనియన్ల చొరవతో నాలుగేళ్ల క్రితం ఏర్పడిన మారియో డ్రాఘి ప్రభుత్వం అర్థంతరంగా కూలిపోవడంతో ఈ ఎన్నికలు అవసరమైనాయి. ఎన్నికల్లో మెలోని పార్టీకి 26 శాతం ఓట్లు, ఆమె నేతృత్వంలోని మధ్యేవాద–మితవాద సంఘటనకు 44 శాతం ఓట్లు వచ్చాయి. గత ఎన్నికల్లో మెలోని నాయకత్వం లోని ఇటలీ సోదరుల పార్టీకి వచ్చిన ఓట్లు 4 శాతం మాత్రమే. ఫాసిస్టు మూలాలున్న ఈ పార్టీ ఓట్ల శాతం ఒక్క సారిగా 4 నుండి 26 శాతానికి పెరగడం ఎన్నికల పరిశీలకులెవరినీ ఆశ్చర్య పరచలేదు. కారణం, దేశార్థిక సుస్థిరత పేరుతో డ్రాఘి నేతృత్వంలో ఏర్పడిన జాతీయ ఐక్య ప్రభుత్వంలో దేశంలోని ప్రధాన రాజకీయ పార్టీలన్నీ చేరిపోగా ఒక్క మెలోనీ పార్టీ మాత్రమే బయట ఉండి ప్రతిపక్ష పాత్ర పోషించింది. అంతకు ముందు ఐరోపా సెంట్రల్ బ్యాంకు అధిపతి అయిన డ్రాఘీని ఐఎంఎఫ్, ఐరోపా సెంట్రల్ బ్యాంకులు కలిసి ఇటలీ ప్రధానిగా నిలిపాయి. నాడు పార్లమెంటు లో ప్రాతినిధ్యం కలిగిన మితవాద, అతివాద పార్టీలన్నీ ఈ ప్రభుత్వంలో భాగస్వాములై నాయి. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన ఇటలీలో పెట్టుబడిదారుల మధ్య సర్దుబాటు చేస్తూ, కార్మికవర్గంపై భారాలు మోపడం కోసం సామ్రాజ్యవాదులు ఈ ఏర్పాటు చేశారు.

డ్రాఘీ ప్రభుత్వం అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడి చెప్పిన పద్ధతుల్లో పరిపాలన సాగించింది. పొదుపుచర్యల పేరుతో కార్మికుల ఉద్యోగాలకూ, సంక్షేమ పతకాలకూ కోత పెట్టింది. ప్రభుత్వ విధానాల వల్ల కార్మికులు, సామాన్య ప్రజల జీవనం దుర్భరంగా మారింది. ధరలు, ముఖ్యంగా ఇంధనం, గ్యాసు, నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలను తాకాయి. నిరుద్యోగం అధికారిక అంచనాల ప్రకారమే 8.4 శాతానికి చేరింది. ఐరోపా సగటు నిరుద్యోగం కన్నా ఇది రెండు శాతం అధికం. నిజానికి నిరుద్యోగిత పాలకులు చెప్పేదానికన్నా ఎక్కువగా ఉంది. అధికార గణాంకాల ప్రకారం దేశంలోని 34 లక్షల మంది ప్రజల ఉద్యోగాలు తుమ్మితే ఊడిపోయే ముక్కులా ఎప్పుడు పోతాయో తెలియని అనిశ్చితి. దీంతోపాటు కరోనా వైరస్ మహమ్మారి తాకిడికి తల్లడిల్లి పోయిన ఐరోపా దేశాల్లో ఇటలీ మొదటి స్థానంలో ఉంది. కరోనా కాలంలో 56 లక్షల మంది ఇటాలియన్లు నిష్ఠదారిద్ర్యంలోకి దిగజారిపోయారు. ద్రవ్యోల్బణం 8 శాతానికి చేరుకోగా ఇంధన ధరలు 50 శాతం వరకు పెరిగాయి.

ఇలాంటి పరిస్థితుల్లో ఇటలీ ప్రజల్లో అసంతృప్తి మరింత తీవ్రమైంది. కార్మికవర్గం పోరుబాట పట్టింది. ఉద్యోగాల కోత, చాలీచాలని వేతనాలు, అధిక పనిగంటలకు నిరసనగా సమ్మెపోరాటాలు వెల్లువెత్తాయి. రైల్వేలు, విమాన రవాణా, టెలికమ్ రంగాలతోపాటు కార్ల పరిశ్రమ, ఇతర పరిశ్రమల్లో పనిస్థంభించింది. ఈ ఏడాది ఏప్రిల్, మేనెలల్లో రెండు సార్లు ఇటలీ కార్మికవర్గం సార్వత్రిక సమ్మె నిర్వహించింది.

కార్మికుల్లోనూ, ప్రజల్లోనూ పెరిగిన అసంతృప్తి పచ్చి మితవాత నినాదాలతో ప్రజల ముందుకు వచ్చిన ఇటలీ సోదరుల పార్టీకి సానుకూలంగా మారింది. సహజంగానే ఆర్థిక సంక్షోభాన్ని ఉపయోగించుకుని ప్రపంచ వ్యాపితంగానూ, ఐరోపాలోనూ మితవాద శక్తులు పెద్ద ఎత్తున బలాన్ని పెంచుకోవడం, అనేక చోట్ల అధికారంలోకి రావడం జరుగుతోన్న కాలమిది. ఇటలీలో మరింత తీవ్రంగా ఉన్న సంక్షోభం మెలోనీ నేతృత్వంలోని మితవాద పార్టీకి, దాని నాయకత్వంలో ఏర్పడిన మూడు పార్టీల సంఘటనకు బాగా కలిసి వచ్చింది. నిజానికి దుర్భర జీవన పరిస్థితులను ఎదుర్కొంటున్న ఇటలీ కార్మిక వర్గం ఈ సారి ఎన్నికల్లో పాల్గొనడానికి ఆసక్తి చూపలేదు. అందుకే ఇటలీ చరిత్రలోనే అత్యంత తక్కువ ఓటింగు జరిగింది.

**ఎన్నికలకు దారితీసిన పరిణామాలు**

ఇటలీలో ఏడాదికో, రెండేళ్లకో ప్రభుత్వాలు పడిపోవడం సర్వసాధారణం. అందువల్ల ఇవి ప్రపంచంలోనూ, ఐరోపాలోనూ పెద్ద వార్తలుగా కనిపించవు. కానీ డ్రాఘీ ప్రభుత్వం కూలిపోవడం మాత్రం పెద్ద చర్చనీయాంశం అయింది. తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో ఉన్న ఇటలీకి 2600 కోట్ల యూరోల ఆర్థిక సహాయ ప్యాకేజీపై పార్లమెంటులో జరిగిన ఓటింగు డ్రాఘీ రాజీనామాకు దారితీసింది. ఇటలీ ప్రభుత్వం చెత్తను కాల్చి బూడిద చేసే ప్లాంటును నెలకొల్పాలన్న షరతు ఈ ప్యాకేజీలో ఒక భాగంగా ఉంది. దీన్ని వ్యతిరేకిస్తూ ప్రభుత్వంలో రెండవ అతి పెద్ద పార్టీ అయిన 5స్టార్ మూవ్‌మెంట్ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకోవడంతో డ్రాఘీ రాజీనామా చేశారు. వాస్తవానికి 5స్టార్ మూవ్‌మెంట్ మద్దతు ఉపసంహరించుకున్న తరువాత కూడా డ్రాఘీ

ప్రభుత్వం విశ్వాస ఓటింగ్‌లో నెగ్గింది. 5స్టార్ మూవ్‌మెంట్ ఓటింగ్‌కు గైర్హాజరు కావడంతో సెనేట్‌లో అధికార పక్షానికి అనుకూలంగా 172 ఓట్లు రాగా, వ్యతిరేకంగా 39 ఓట్లు వచ్చాయి. అయినప్పటికీ తన ప్రభుత్వంపై విశ్వాసం సన్నగిల్లింది అనే పేరుతో డ్రాఘీ రాజీనామా చేశారు.

**“ ప్రస్తుత ఎన్నికల్లో ప్రభుత్వంపట్ల అసంతృప్తి స్పష్టంగా కనిపించింది. మొదటిది, ఈ ఎన్నికల్లో ఓటింగు శాతం రికార్డు స్థాయిలో పడిపోయి 63.91 శాతం నమోదయింది. 2018 ఎన్నిలకన్నా ఇది 9 శాతం తక్కువ. రెండవది, గత ప్రభుత్వంలో భాగం పంచుకున్న పార్టీలన్నీ ఈ ఎన్నికల్లో ఓట్లు కోల్పోయాయి. ప్రతిపక్షంగా వ్యవహరించిన మెలోనీ పార్టీ మాత్రం ఓటింగు శాతాన్ని 4.4 నుండి 26.2 కు అంటే ఆరు రెట్లకు పైగా పెంచుకుని అధికార పగ్గాలు చేపట్టింది. ”**

రుణప్యాకేజీపై పాలక సంఘటనలో శిగపట్లు ప్రభుత్వం సంక్షోభంలో పడడానికి కారణమైనప్పటికీ అసలు కారణం ఇంకా తోతైనది. తీవ్ర ఆర్థిక సంక్షోభంతో ఇటలీ సమాజం నిట్టనిలువునా అనేక చీలికలు పేలికలైంది. దేశంలోని ప్రధాన పార్టీలన్నీ ప్రజల విశ్వాసం కోల్పోయాయి. అందుకే అక్కడ నిత్యం ఉద్రిక్తత, ఘర్షణలు జరుగుతూ వస్తున్నాయి.

2021 ఫిబ్రవరిలో డ్రాఘీ ఇటలీ ప్రధాని బాధ్యతలు స్వీరించారు. అంతకు ముందు మూడేళ్ల పాటు 5స్టార్ మూవ్‌మెంట్ అధ్యక్షుడు గుస్సెప్పె కాంటే ప్రధానిగా కొనసాగారు. 2008 ఆర్థిక సంక్షోభం తరువాత ఇటలీలో 5స్టార్ మూవ్‌మెంట్ ప్రతిపక్ష పార్టీగా ఆవిర్భవించింది. 2018 ఎన్నికల్లో ఈ పార్టీ మట్టో సిల్వినీ నాయకత్వంలోని లెగా పార్టీతో కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అంతకు ముందు ఈ రెండు పార్టీలకు ఒకటంటే మరోదానికి అస్సలు పడదు.

కరోనా మహమ్మారి సందర్భంగా ప్రజల ప్రాణాలు రక్షించడంలో ప్రధాని కాంటే ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యింది. ఉత్తర ఇటలీలో ఆసుపత్రులు రోగులతో నిండిపోయి, రాత్రిపూట మిలిటరీ ట్రక్కుల్లో వందలాది శవాలను తరలిస్తున్న దృశ్యాలు ఇటలీ ప్రజలనే కాదు మొత్తం ప్రపంచాన్నే దిగ్భ్రాంతికి గురిచేశాయి. ఈ పరిస్థితుల్లో కాంటె ప్రభుత్వం రాజీనామా చేసింది. దాంతో పార్లమెంటులో ప్రాతినిధ్యం వహిస్తున్న అన్ని పార్టీలు కలిసి ఐరోపా సెంట్రల్ బ్యాంకు అధిపతిగా పనిచేసిన 74 ఏళ్ల డ్రాఘీని ప్రధానిగా చేసి అవన్నీ ప్రభుత్వంలో చేరిపోయాయి. ఇటలీని తీవ్రమైన సంక్షోభం నుండి గట్టెక్కించడానికి తమకున్న మార్గం ఇదొక్కటేనని అవి తలిచాయి. మెలోని నేతృత్వంలోని ఇటలీ సోదరుల పార్టీ మాత్రం అధికారానికి బయట ఉండిపోయింది. అంతకు ముందు డ్రాఘీ ఐరోపా సెంట్రల్ బ్యాంకు ఛైర్మన్‌గానే కాకుండా ప్రపంచ బ్యాంకులోనూ, అమెరికాకు చెందిన గోల్డ్ మాన్ శాచ్‌లోనూ అనేక బాధ్యతలు నిర్వహించారు. ఐరోపా సెంట్రల్ బ్యాంకు అధిపతిగా ఆయన తీసుకున్న



జార్జియా మెలోని

పొదుపు చర్యలు కార్మికవర్గ జీతాలకూ, ఉద్యోగాలకూ ఎసరుపెట్టాయి.

డ్రాఘీ ప్రభుత్వ నయా-ఉదారవాద విధానాలు కార్మికులను, ప్రజలను మరింత దుర్భల దారిద్ర్యంలోకి నెట్టాయి. మరోవైపు గతంలో కొంత స్వతంత్రంగా వ్యవహరించిన ఇటలీని డ్రాఘీ పూర్తిగా అమెరికా, ఐరోపా దేశాల కూటమికి సామంత రాజ్యంగా మార్చేశాడు. ఉక్రెయిన్ యుద్ధం సాకుతో రష్యాపై నాటో విధించిన ఆంక్షలకు మద్దతివ్వడంలో డ్రాఘీ అత్యుత్సాహం చూపించాడు. కానీ వాస్తవానికి రష్యాపై ఆంక్షల వల్ల ఐరోపాలో అధికంగా నష్టపోయేది ఇటలీనే. ఎందుకంటే ఇతర ఐరోపా దేశాలకాన్నా ఎక్కువగా ఇటలీ రష్యా ఇంధనం, చమురుపై ఆధారపడి ఉంది. ఇటలీ ఇంధన అవసరాల్లో 40 శాతం వరకు రష్యానుండి దిగుమతి అవుతుంది. ఆంక్షల వల్ల ఐరోపా మొత్తంగా, ముఖ్యంగా ఇటలీలో ఇంధనం ధరలు విపరీతంగా పెరిగాయి. పుండుమీద కారం చల్లినట్లు అసలే ద్రవ్యోల్బణం, అధిక ధరలతో బాధపడుతున్న ప్రజలకు ఈ ధరల భారం భరించలేని విధంగా దెబ్బతీసింది. రష్యా నుండి ఇంధన దిగుమతులు దాదాపు ఆగిపోవడంతో రానున్న శీతాకాలం ఇటలీ వాసులకు చాలా గడ్డు కాలం అని పరిశీలకులు చెబుతున్నారు.

డ్రాఘీ ప్రభుత్వం సుస్థిరత తెస్తుందన్న ఇటలీ పాలక వర్గాల ఆశలు ఫలించలేదు. డ్రాఘీ తన పాలనా కాలంలో ఇటలీ ఆర్థిక వ్యవస్థను అమెరికా కనుసన్నల్లో నడపడానికి అన్ని విధాలా కృషి చేశాడు. అమెరికా యుద్ధ సన్నాహాల్లో ఇటలీని ప్రధాన భాగస్వామిని చేశాడు. సంక్షోభ భారాలను కార్మికవర్గం మీదకు నెట్టడానికి అన్ని రకాల చర్యలూ తీసుకున్నాడు. అన్ని పార్టీలనూ ప్రభుత్వంలో చేర్చుకోవడం ద్వారా ప్రజల్లో అసంతృప్తిని చల్లార్చడానికి ప్రయత్నించాడు. ఇన్ని చేసినా కార్మికవర్గంలో అసంతృప్తిని అణచివేయలేకపోయాడు. ప్రస్తుత ఎన్నికల్లో ప్రభుత్వంపట్ల ఈ అసంతృప్తి స్పష్టంగా కనిపించింది. మొదటిది, ఈ ఎన్నికల్లో ఓటింగు శాతం రికార్డు స్థాయిలో పడిపోయి 63.91 శాతం నమోదయింది. 2018 ఎన్నిలకన్నా ఇది 9 శాతం తక్కువ. రెండవది, గత ప్రభుత్వంలో భాగం పంచుకున్న పార్టీలన్నీ ఈ ఎన్నికల్లో ఓట్లు కోల్పోయాయి. గతంలో అధికారం చెలాయించిన 5స్టార్ మూవ్‌మెంట్ ఓటింగు శాతం 32.7 శాతం నుండి ఒక్కసారిగా 15.1 శాతనికి పడిపోయింది. డెమోక్రటిక్ పార్టీ మాత్రమే తన పాత ఓటింగు-సుమారు 19 శాతం నిలుపుకుంది. లెగా పార్టీ ఓటింగు 17.4 శాతం నుండి సగానికి సగం పడిపోయింది. ఇతర అన్ని పార్టీల ఓటింగ్ తగ్గింది. ప్రతిపక్షంగా వ్యవహరించిన మెలోనీ పార్టీ మాత్రం ఓటింగు శాతాన్ని 4.4 నుండి 26.2 కు అంటే ఆరు రెట్లకు పైగా పెంచుకుని అధికార పగ్గాలు చేపట్టింది.

**మెలోని ఆమె పార్టీ**

రెండవ ప్రపంచ యుద్ధంలో ఫాసిస్టుల కూటమిలో భాగంగా ఉన్న ఇటలీ నియంత బెనిటో ముస్సోలినీకి రాజకీయ వారసురాలు

> **“ఇయు వ్యవస్థాపక సభ్య దేశమైన ఇటలీ నేడు ఈ పరిస్థితికి రావడం ఆందోళన కలిగించే విషయం. (అక్కడ మితవాద ప్రభుత్వం రావడం) ఇయుకీ ఇటలీకీ ప్రమాదకం” అని జర్మన్ సోషల్ డెమోక్రాటిక్ పార్టీ నాయకుడు రాల్ఫ్ మౌంట్జెనిచ్ పేర్కొన్నారు. “ఐరోపాలో అత్యంత ప్రమాద కరమైన మహిళ” అని జర్మన్ పత్రిక స్టెర్న్ పతాక శీర్షికతో మెలోనీ ఎన్నికను ప్రకటించింది.**

మెలోని. ముస్సోలినీ చనిపోయిన తరువాత ఆయన పార్టీ కార్యకర్తలు యుద్ధానంతరం స్థాపించిన నయా-ఫాసిస్టు ఉద్యమం నుండి ఇటలీ సోదరుల ఉద్యమం పుట్టుకొచ్చింది. ఇతర ఐరోపా నయా-నాజీల మాదిరిగానే ఈమె పార్టీ కూడా మహిళల హక్కులను, స్వలింగ సంపర్కులకు ప్రత్యేక రక్షణలనూ వ్యతిరేకిస్తుంది. వలస ప్రజల పట్ల, ముస్లిం మైనారిటీల పట్ల విద్వేషాన్ని ప్రదర్శిస్తుంది. తెల్లజాతి దురహం కారాన్ని ప్రదర్శిస్తుంది. ఐరోపా యూనియన్‌ను వ్యతిరేకిస్తుంది.

గతంలో ఈ పార్టీని వ్యతిరేకించిన ఇటలీ పెట్టుబడిదారీ వర్గం, దాని మీడియా ఈ ఎన్నికల్లో ప్లేటు ఫిరాయించి మెలోని, ఆమె పార్టీ పట్ల సానుభూతి ప్రదర్శించింది. మెలోని కూడా గతంలో ఇచ్చిన ఫాసిస్టు తరహా నినాదాలను ఎన్నికల్లో తగ్గించారు. రష్యా పట్ల గతంలో ఉన్న సానుకూల వైఖరిని మార్చుకుని అమెరికా సామ్రాజ్యవాదులకు అనుకూలంగా మాట్లాడ్డం మొదలు పెట్టారు. ఇతర మితవాద పార్టీల మాదిరిగానే కార్మికులు, సామాన్య మధ్యతరగతి ప్రజలను ఆకర్షించే నినాదాలతో ప్రాబల్యం సంపాదించిన ఇటలీ సోదరుల పార్టీ ఎన్నికల ఫలితాలు వచ్చిన తరువాత తన గళం మార్చిం ది. అంతకు ముందు స్వదేశీ నినాదాలిచ్చింది. బడా కార్పొరేషన్లకు వ్యతిరేకం అంది. రష్యా-ఉక్రెయిన్ వివాదంలో నాటోతో వెళితే ఇటలీకి నష్టం అని పేర్కొంది. కానీ ఎన్నికల తరువాత పార్టీ మెలోనీ ఉక్రెయిన్‌కు అనుకూలంగా మాట్లాడ్డం ప్రారంభించారు. నాటో సైనిక సన్నాహాలకు స్వాగత వచనాలు పలుకున్నారు.

దేశంలో ఒకవైపు తీవ్రమవుతున్న ఆర్థిక సంక్షోభం, దానికి కార్మికవర్గం నుండి వస్తున్న ప్రతిఘటన ఇటలీ పాలక వర్గాలను తీవ్రంగా కలవర పెడుతున్నాయి. పాలక వర్గాల సంక్షోభాన్ని నివారించి కార్మికవర్గంపై భారాలు నెట్టేపని చేయగలిగినంత వరకు డ్రాఘీ ప్రభుత్వం వారికి సేవలు చేసింది. ఇక దానికా శక్తి లేనప్పుడు కార్మిక అశాంతిని అణచివేసే



మేరియో డ్రాఘీ

శక్తి వారికి కావలసి వచ్చింది. అన్ని చోట్లా మాదిరిగానే మితవాద శక్తులతో తమ పని జరుగుతుందని ఇటలీ పాలక వర్గాలు గ్రహించాయి. కనుకనే ఈ ఎన్నికల్లో నయా-ఫాసిస్టులకు మద్దతిచ్చాయి. ముందు ముందు మరిన్ని దుర్భర భారాలను మోయడమా లేక ఐక్య పోరాటాలతో తీవ్రమైన అణచివేతను ఎదుర్కొని ముందుకు పోవడమా, రెండే మార్గాలు ఇటలీ కార్మికవర్గం ముందున్నాయి.

**ఐరోపా భయాలు**

ఇటలీ ఎన్నికల ఫలితాల పట్ల ఐరోపా యూనియన్‌లో భయ సందేహాలు వ్యక్తమయ్యాయి. తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న ఐరోపాలో వరుసగా అనేక దేశాల ఎన్నికల్లో పచ్చిమితవాద శక్తులు అధికారంలోకి వస్తున్నాయి. రష్యాపై ఇయు ఆంక్షల వల్ల ఐరోపాలో ఇంధన ధరలు పెరిగాయి. నిత్యావసరాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. రష్యా నుండి ఐరోపాకు గ్యాస్ సరఫరా చేసే నార్డిక్ గ్యాస్‌పైప్‌లైన్‌ను నుండి సరఫరాలు ఆగిపోయాయి. రెండోదైన నార్డిక్2 పైప్‌లైన్ నుండి సరఫరాలు ప్రారంభం కాలేదు. తమ దేశంపై ఆంక్షలు పెట్టిన ఇయు చర్యకు నిరసనగా రష్యా అధ్యక్షుడు వ్లదిమీర్ పుతిన్ నార్డిక్ పైప్‌లైన్ నుండి గ్యాస్ సరఫరాలను పూర్తిగా బంద్ చేస్తే ఐరోపా దేశాలు రానున్న కాలంలో మరిన్ని గడ్డు పరిస్థితులను ఎదుర్కోవలసి వస్తుంది. శీతాకాలంలో ప్రజల ఇబ్బందులు మరింతగా పెరిగుతాయి. ప్రజల్లో అసంతృప్తిని మితవాద శక్తులు ఉపయోగించుకుని విజృంభించొచ్చు. ఇటలీ ఎన్నికల ఫలితాలు ఈ శక్తులకు మరింత ఊతం ఇస్తాయని భావిస్తున్నారు. “గతంలో ఎన్నటి కన్నా ఎక్కువగా ప్రజా మద్దతు పొందుతున్న మితవాద పార్టీలు ఐరోపా యూనియన్ -ఇయు విధానాలనే మార్చగల స్థితికి చేర వచ్చు” అని పోలాండ్‌కు చెందిన రాజకీయవేత్త దిస్లా క్రస్నోదెబస్కియా పేర్కొన్నారు.

“ఇయు వ్యవస్థాపక సభ్య దేశమైన ఇటలీ నేడు ఈ పరిస్థితికి రావడం ఆందోళన కలిగించే విషయం. (అక్కడ మితవాద ప్రభుత్వం రావడం) ఇయుకీ ఇటలీకీ ప్రమాదకం” అని జర్మన్ సోషల్ డెమోక్రాటిక్ పార్టీ నాయకుడు రాల్ఫ్ మౌంట్జెనిచ్ పేర్కొన్నారు. “ఐరోపాలో అత్యంత ప్రమాద కరమైన మహిళ” అని జర్మన్ పత్రిక స్టెర్న్ పతాక శీర్షికతో మెలోనీ ఎన్నికను ప్రకటించింది. ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ కూడా మెలోనీ ఎన్నిక పట్ల ప్రయివేటుగా ఆందోళ వ్యక్తం చేశారని మీడియా తెలిపింది. అయితే అధికారికంగా మాత్రం ఫ్రెంచ్ ఇటాలియన్ సంబంధాలు స్థిరంగా ఉంటాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. బ్రస్సెల్స్‌లోని ఇయు ప్రధాన కేంద్రం నాయకులు మాత్రం ఐరోపా సెంట్రల్ బ్యాంకుతో ఇటలీ కుదుర్చుకున్న 19200 కోట్ల యూరోల రుణ ఒప్పందం గురించి ఆందోళన చెందుతున్నారు. ఇటలీలో తీవ్రమైన సంస్కరణలు (అంటే కార్మికుల జీతాలు, సంక్షేమంపై కోతలు, సామాన్యులపై అదనపు పన్నులు వేయడం, కార్పొరేట్లకు రాయితీలు కల్పించడం) ప్రవేశ పెడితేనే ఒప్పందం ప్రకారం రుణం మొత్తం విడుదలవుతుంది. జాతీయవాద నినాదాలతోనూ, ప్రజానుకూల వాగ్దానాలతోనూ అధికారంలోకి వచ్చిన ఈ ప్రజా వ్యతిరేక సంస్కరణలు ఎంత బాగా అలమలు చేస్తారా అని ఇయులో అగ్రరాజ్యా లుగా ఉన్న జర్మనీ, ఫ్రాన్స్ ఎదురుచూ స్తున్నాయి.

అయితే మెలోనీ ఎన్నిక పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్న దేశాలు కూడా ఐరోపాలో ఉన్నాయి. రష్యాను ఇయు అనవసరంగా యుద్ధం వైపు నెట్టిందని ఐరోపాలోని హంగరీ,

(మిగతా 34వ పేజీలో)

ఆర్థిక రంగం

# మళ్లీ ముందుకొచ్చిన బ్యాంకుల ప్రైవేటీకరణ

**సిపి చంద్రశేఖర్**



రచయిత ప్రముఖ ఆర్థిక వేత్త. ఆర్థిక వ్యవహారాలపై పుస్తకాలు, పత్రికల్లో వందలాది వ్యాసాలు, రాశారు.

బ్యాంకులను ప్రైవేటికరించాలా వద్దా అని చాలాకాలంగా కొనసాగుతున్న చర్చ మళ్లీ తెరమీదికి వచ్చింది. సంస్కరణలను వేగవంతం గా కొనసాగించాలని కోరుకునే వారి రెండు వ్యాసాలు ఈ చర్చను మళ్లీ ముందుకు తెచ్చాయి. అందులో ఒకటి సంకల్పితంగా చర్చకు తెరలేపితే రెండోది అసంకల్పితంగా ఈ చర్చలను లేవదీసింది.

ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్తలు పూనమ్ గుప్త, అరవింద్ పనగరియాలు బ్యాంకులను వెంటనే ప్రైవేటీకరించాలని భారతదేశ విధాన రూపకల్ప న వేదికలో మాట్లాడడంతో చర్చ మళ్ళీ ప్రారంభమయింది. లాభాపేక్షే గాని దేశ ప్రయోజనాలు నెరవేర్చవలసిన అవసరం ప్రైవేటు బ్యాంకులకు లేదు కాబట్టి ప్రభుత్వ బాధ్యతలను నిర్వర్తించడానికి ఒక్క స్టేట్ బ్యాంక్ ను మినహాయించి దేశంలోని మిగిలిన అన్ని బ్యాంకులను ప్రైవేటీకరించాలని, అందువలన బ్యాంకులు లాభాల బాటలో పయనిస్తాయని ఉదారవాదులు ప్రతిపాదిస్తున్నారు.

రిజర్వ్ బ్యాంకులో ఆర్థిక విధానపర పరిశోధనా విభాగంలో పనిచేస్తున్న స్నేహాల్. ఎస్. హీర్వాద్కర్, సోనాలి గోల్, రిషుక బన్సల్‌లు రాసిన మరో వ్యాసం కూడా ఈ చర్చకు కారణం. ఈ వ్యాసం 2022 ఆగస్టు నెలలో ఆర్‌బిఐ బులెటిన్‌లో ప్రచురించ బడింది. ప్రభుత్వరంగ బ్యాంకుల పనితీరుపై కేంద్రీకరించి రాసిన వ్యాసం ఇది. 2021లో తన బడ్జెట్ ఉపన్యాసంలో ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ బ్యాంకుల విజాతీయకరణ అంశా న్ని లేవనెత్తారు. రెండు ప్రభుత్వ బ్యాంకులు, ఒక సాధారణ బీమా కంపెనిని ప్రైవేటీకరిస్తున్న ట్టు ప్రకటించారు. భారతదేశ విధాన నిర్ణయ వేదిక సీతారామన్ గారి ప్రైవేటీకరణ వేగంతో సంతృప్తి చెందలేదన్నది స్పష్టంగా తెలుస్తున్నది.

**ఆర్‌బిఐ పత్రం**

సాదారణంగా ఆర్‌బిఐ పత్రాలు పొందే గుర్తింపు కన్నా ఆర్‌బిఐ బులెటిన్‌లో ప్రచురించబడిన ఈ వ్యాసం ఎక్కువమంది దృష్టిని ఆకర్షించింది. భారతదేశాన్ని అభివృద్ధి పథంలోనడిపించడంలో ప్రభుత్వ బ్యాంకుల పాత్ర గురించి రచయితలు ఇందులో రాయడమే అందుకు కారణం. అప్పటి వరకు అందుబాటులో లేని అన్ని తరగతులకు, రంగాలకు, సమూహాలకు బ్యాంకుల సేవలను ప్రభుత్వ బ్యాంకులు అందుబాటులోకి తెచ్చాయి. వారికి రుణ పరపతి దొరికే విధంగా కృషి చేశాయి అని రచయితలు ఈ వ్యాసంలో రాశారు.

కేవలం లాభాలే పరమావధిగా తీసు కుంటే ప్రైవేటు బ్యాంకులు బాగా పనిచేస్తున్నట్టు కనిపించే మాట వాస్తవం అయినా, అవసరమైన అన్ని రంగాలకు రుణ పరపతి అందించవలసిన బాధ్యతను కూడా పరిగణనలోకి తీసుకుంటే ప్రభుత్వరంగ బ్యాంకులు తమ కర్తవ్యాన్ని సమర్థవంతంగా నిర్వహించాయని ఒప్పుకోక తప్పదు. పైగా ప్రభుత్వ రంగ బ్యాంకులు ప్రైవేటురంగంలోని బ్యాంకుల లాగా వ్యాపారాలలో ఎగుడుదిగుడులతో సంబంధం లేకుండా రుణాలు అందించడంలో ముందుం టాయి. అందువలన బ్యాంకులను ప్రైవేటీక రించాలనుకుంటే మరింత జాగ్రత్తగా, మెలకు వతో వ్యవహరించాలని ఈ వ్యాసం సూచిం చింది.

జాతీయం చేసిన నాటి నుంచి బ్యాంకులు తమ లక్ష్యాన్ని చేరుకోవడంలో ముందున్నాయి. నిజానికి జాతీయం చేయడానికి కూడా కారణం ఇదే.

**బ్యాంకుల జాతీయకరణ చరిత్ర**

స్వాతంత్రం వచ్చిన నాటి నుండి 1969 వరకు పెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకులను రూపొందించడమే కాక, ప్రైవేటు బ్యాంకులు కూడా దేశ అభివృదిలో భాగస్వాములు కావాలని ప్రభుత్వం కోరింది, బుజ్జగించింది. కానీ ఏ మాత్రం ఫలితం లేకపోయింది. చూడగా చూడగా ప్రైవేటు రంగంలో ఉన్న బ్యాంకులలో యజమానుల భాగస్వామ్యం చాలా తక్కువగా ఉన్నప్పటికీ, ప్రజల పొదుపును వినియోగించుకుని లాభాలను విపరీతంగా పొందడంలో ముందున్నట్లు తెలియవచ్చింది. కానీ అభివృద్ధిలో ఏ మాత్రం బాధ్యత తీసుకో డానికి సిద్ధంగా లేని విషయం కూడా స్పష్టమైంది.

1960ల మధ్యలో కూడా స్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయ రంగం గణనీయ భాగం కలిగి ఉన్నప్పటికీ, షెడ్యూల్డ్ ప్రైవేటు బ్యాంకులు ఆ రంగానికి 2 శాతానికి మించి రుణాలు మంజూరు చేయలేదు. అంతేకాదు, ప్రైవేటు బ్యాంకులు తమ డైరెక్టర్లకు, యజమానులకు సంబంధించిన వ్యాపారాలకు మాత్రమే అధిక మొత్తాల్లో రుణాలు మంజూరు చేస్తున్నాయి.

అందువలన ప్రభుత్వ పథకాలకు మద్దతుఇవ్వడానికి ప్రైవేటు బ్యాంకులు నిరాకరించిన కారణంగా ప్రభుత్వం తన అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించడంలో భాగంగా బ్యాంకులను జాతీయం చేయల్సి వచ్చింది. జాతీయం చేయడం వలన మంచి ఫలితాలు సాధించగలిగిన దృష్ట్యా, ఇప్పుడు విజాతీయం చేయడం అంటే అభివృద్ధి కుంటు పడుతుందని, ఆర్థికరంగం అభివృద్ధి చెందాలనే లక్ష్యాన్ని చేరుకోవడం కష్టమవుతుందని ఆ పరిశీలకులు నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ వ్యాసం అసలు ప్రైవేటీకరణ వద్దనడం లేదని మనం గమనించాలి.

ఆర్థికమంత్రి ప్రకటనకు కనుగుణంగా ప్రైవేటీకరణను అంచెలంచెలుగా మాత్రమే చేపట్టాలని సూచిస్తుంది. కానీ ఈ వ్యాసం నయా–ఉదారవాద విధానాలకు అనుగుణం గా ఎన్‌డిఏ ప్రభుత్వం తీసుకుంటున్న తప్పుడు విధానాలను ఎత్తి చూపిస్తున్నట్టుగా భావించడం జరిగింది.

ఈ వ్యాసం యొక్క ఉద్దేశానికి, నిర్ధారణ లకు వచ్చిన స్పందన కేంద్ర బ్యాంకు సీనియర్

> **“ నిరర్థక ఆస్తులు పేరుకుపోయింది ప్రాథమిక రంగానికి ప్రభుత్వ బ్యాంకులు అప్పులిచ్చి నందు వలన కాదు. కార్పొరేట్లకు అప్పులు ఇవ్వడం వలన. అది కూడా నయా-ఉదారవాద విధానాలు కనుగుణంగా అప్పులు ఇవ్వడం వలన. ఈ మధ్యకాలంలో పెరిగిన నిరర్థక ఆస్తుల మూలాలు నయా - ఉదారవాద విధానాల ఆధారంగా అభివృద్ధి చేయడంలో ఉన్నాయి. ”**

అధికారులను కలవరపరిచింది. అందువలన ఈ వ్యాసంలోని అభిప్రాయాలు రచయితల వ్యక్తిగత అభిప్రాయాలని ఆర్‌బిఐ పదేపదే వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. పైగా రచయితలు కూడా ఒకేసారి పెద్దదెబ్బ కొట్టడం వలన నష్టం జరుగుతుంది గాని నెమ్మదిగా, క్రమంగా ప్రయివేటీకరణ చేయాలని అభిప్రాయ పడినట్లు కూడా వ్యాసంలోని అంశాలను, పంక్తులను ఉటంకించడం జరిగింది.

విషయం అంతా గమనించిన మీదట బ్యాంకులను విజాతీయం చేయడంలో కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బిఐ ఒకే ఆలోచనలో లేవని అర్థం అవుతుంది. బ్యాంకింగ్ రంగాన్ని ప్రైవేటీకరించాలని నరసింహం కమిటీ 1991లో, 1998లో చేసిన సిఫారసులను త్వరగా అమలు చేయాలని కేంద్రం భావిస్తున్నట్లు ఉన్నది. ఆర్‌బిఐ క్రమపద్ధతిలో మార్పు కోరుకుంటు న్నట్టు కనిపిస్తున్నది.

ఆ అభిప్రాయాలకు అనుగుణంగా గుప్త, పనగరియాలు బ్యాంకులను విజాతీయం చేయడం, ప్రైవేటీకరించడం గురించి వ్రాసారు. ఆ క్రమంలోనే జాతీయం చేయడం వలన కలిగిన ప్రయోజనాలను అపజయాలుగా చూపారు. అందులో ఒకటి ప్రైవేటు బ్యాంకుల కన్నా ప్రభుత్వ బ్యాంకులు తక్కువ లాభాలు ఆర్జించడం. బ్యాంకులను జాతీయం చేయడం వలన బ్యాంకు శాఖలు లేని అనేక ప్రాంతాలకు బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి తేవడానికి వీలయింది. చిన్న మొత్తాలలో రుణాలు ఇవ్వడానికి వీలయింది. పంటలు పోవడానికి అవకాశం గల చిన్న చిన్న రైతులు, వ్యాపారులు పరపతి పొందగలిగారు.

ఇటువంటి శాఖలు నష్టాలు తెచ్చిపెట్టేవే కాదు, అప్పులు తిరిగి తీర్చలేని వారికి కూడా రుణాలు మంజూరు చేయాల్సిన పరిస్థితి వస్తుందని, లావాదేవీలు చిన్న మొత్తాలలో ఉండడం వలన తలసరి ఖర్చులు పెరుగుతాయని, అదే లావాదేవీలు అధిక మొత్తాల్లో ఉంటే లాభాలు ఆర్జించడం సులభమవుతుందని, లాభదాయకంగా ఉంటుందని ఆ వ్యాసంలో రచయితలు తమ అభిప్రాయం వ్యక్త పరిచారు. కానీ అనేక రంగాలకు విస్తృతంగారుణాలు ఇవ్వడం వలన లాభాలు తక్కువగా ఆర్జించినా, అనేక ప్రాంతాలకు, రంగాలకు విస్తరించటం ద్వారా జాతీయం చేసిన లక్ష్యాన్ని బ్యాంకులు అందుకోగలిగాయని రాశారు.

రెండో అంశం ప్రభుత్వ రంగంలో బ్యాంకులు ఉండడం వలన లాభాలు తక్కువగా వచ్చే రంగాలకు, తరగతులకు రుణాలు ఇవ్వవలసి రావడం వలన తక్కువ లాభాలు రావడమే కాదు, ఇచ్చిన రుణాలు తిరిగి వసూలు చేసుకోవడం కూడా కష్టమవుతుందని రాశారు. ప్రభుత్వం ప్రాధాన్యతా రంగానికి రుణాలు మంజూరు చేయడం వలన నిరర్థక ఆస్తులు పెరుగుతాయని, ఆ తర్వాత ఉత్పత్తి రంగాలకు తగినంతగా రుణాలు ఇచ్చే అవకాశాలు తగ్గుతాయని రాశారు.

“ఎక్కువగా” అప్పులు ఇవ్వడం వలన లాభాలు పోగొట్టుకోవడమే కాదు, లాభాలు ఇచ్చే లాభదాయక సురక్షితమైన ప్రైవేటు రంగానికి రుణాలు ఇవ్వడం జరగదని రాశారు. కానీ ఈ మధ్యకాలంలో ప్రభుత్వ విధానం వలన ప్రభుత్వ బ్యాంకులు కార్పొరేట్లకు రుణాలు ఇస్తున్న వాస్తవాన్ని, దాని వలన జరుగుతున్న నష్టాన్ని కప్పి పెట్టారు. ప్రైవేటు, లేదా ప్రైవేటు రంగంతో కలిసి చేసే ఉమ్మడి మౌలిక సదుపాయం కల్పనా ప్రాజెక్టులకు ప్రభుత్వ రంగ బ్యాంకుల నుంచి రుణాలు అందచేస్తున్న విషయాన్ని మరుగు పరిచారు.

సాంప్రదాయకంగా, బ్యాంకులు రిస్క్ ఎక్కువగా ఉండే ఇటువంటి దీర్ఘకాలిక రుణాలు మంజూరు చేయవు. అందువలననే తక్కువ కాల పరిమితి ఉన్న, ఎక్కువ రిస్కు లేని పొదుపులు, త్వరితగతిన డబ్బుగా మార్చుకోగలిగే సాధనాలను బ్యాంకులు ఇష్టపడతాయి. దీర్ఘకాల ప్రాజెక్టులకు రుణాలివ్వడానికి మొగ్గుచూపవు. దీనివల్ల పొదుపు చేసినవారు డిమాండ్ చేసినప్పుడు డబ్బులు తిరిగి ఇవ్వడం రిస్క్ అవుతుందని భావిస్తాయి.

కానీ ఉదారవాద విధానాలు అమలులోకి వచ్చిన తరువాత అభివృద్ధి బ్యాంకులు కనుమరుగవడంతో, మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయడానికి పెట్టుబడుల అవసరం ఏర్పడింది. అందువల్ల ప్రభుత్వం తన ఆధీనం లో ఉన్న బ్యాంకులను మౌలిక వసతుల కల్పనకు అప్పులు ఇచ్చే విధంగా ప్రోత్సహించింది. ఫలితంగా మౌలిక వసతులు కల్పించే కార్పొరేట్లు పెద్ద ఎత్తున రుణాలు పొందారు.

కానీ అనేక మౌలిక సదుపాయాలు కల్పించే కార్పొరేట్లు, తమ ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తి చేయలేదు. వారికెంతో అనువైన పద్ధతులలో రుణాలు మంజూరు చేసినప్పటికీ, సకాలంలో రుణాలు తిరిగి చెల్లించలేదు. అప్పులు పేరుకుపోవడం మొదలయింది. ఫలితంగా నిరర్థక ఆస్తులు బ్యాంకింగ్ రంగంలో పేరుకుపోయాయి.

### కార్పొరేట్ల నిరర్థక ఆస్తులు

నిరర్థక ఆస్తులు పేరుకుపోయింది ప్రాథమిక రంగానికి ప్రభుత్వ బ్యాంకులు అప్పులిచ్చి నందు వలన కాదు. కార్పొరేట్లకు అప్పులు ఇవ్వడం వలన. అది కూడా నయా – ఉదారవాద విధానాలు కనుగుణంగా అప్పులు ఇవ్వడం వలన. ఈ మధ్యకాలంలో పెరిగిన నిరర్థక ఆస్తుల మూలాలు నయా – ఉదారవాద విధానాల ఆధారంగా అభివృద్ధి చేయడంలో ఉన్నాయి. నిరర్థక ఆస్తులు పేరుకు పోవడానికి అసలైన మూలలను కనుక్కోవడం మానేసి గుప్త, పనగరియాలు ప్రభుత్వ యాజమాన్యంలో బ్యాంకులు ఉండటం కారణంగా చెప్పారు. ప్రైవేటీకరణ అందుకు పరిష్కార మార్గంగా చూపారు.

చివరిగా, బ్యాంకులు ప్రభుత్వ యాజమాన్యంలో ఉండడం “ఆర్థిక అణచివేత” విధానాలలో అవశేషాలుగా చెప్పుకొచ్చారు. అంటే, వడ్డీరేట్ల నియంత్రణ, అప్పులివ్వడం పై ఆంక్షలు, సెక్యూరిటీలలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న పరిమితులు, బ్యాంకుల మధ్య పోటీకి పరిమితులు ఉండడం వలన పొదుపులపై వడ్డీలు పెంచి పొదుపు చేసే వారిని ఆకర్షించే అవకాశాలు లేకపోవడం, అధిక లాభాలు తెచ్చిపెట్టే అధిక రిస్క్ ఉన్న ప్రాజెక్టు లలో పెట్టుబడులు పెట్టడానికి వీలు లేకపోవడం వగైరాలు అన్నమాట. ఇవన్నీ పొదుపులు

(మిగతా 34వ పేజీలో)

# కర్తవ్య పథం పేరుతో మరోమోసం

హరీష్ ఖారె

అణగారిపోతున్న జాతీయ నాగరిక వైభవాన్ని నిలబెట్టేందుకు ప్రధానమంత్రి ఒక్కడే ఎంతగా పాటుపడుతున్నాడో చెప్పే కీలక ఆలోచనతో నిరంతరం పక్కదారి పట్టించే ప్రయత్నంలో భాగమే రాజ్‌పథ్ పేరుమార్పు. గతంలో ఇంపీరియర్ సెంట్రల్ ఎవెన్యూగా ఉన్న కింగ్స్‌వే పేరు స్వాతంత్ర్యానంతరం 'రాజపథ్'గా మారిందని ఏదైనా మంచి విశ్వవిద్యాలయంలో భారతీయ చరిత్ర మొదటి సంవత్సరం విద్యార్థి అయినా చెబుతాడు. భారతదేశ ప్రధానమంత్రి నరేంద్రమోడీకున్న మతిమరుపును గుర్తు చేయడానికి నిలదీయాలి. రాజ్‌పథ్ పేరును కర్తవ్యపథంగా మార్చడం ద్వారా వలసవాద తుది చిహ్నాల తలపోటును వదిలించుకున్నామని ఆయన ఇప్పుడు గొప్పగా ప్రకటించారు. వలసవాద గతాన్ని వీడి కొత్తదేశం పనిచేస్తున్నదని ప్రతీకాత్మకంగా చెప్పేందుకే కింగ్స్ వేను మార్చి రాజ్‌పథ్ అని కొత్తపేరు పెట్టారు. అందుకే మహాత్ముని సమాధి ప్రదేశాన్ని 'రాజ్‌ఘాట్'గా ప్రకటించారు. కొత్తదేశం, కొత్త పాలకులు, పాలితులు నిజమైన పుణ్యక్షేత్రం ముందు వినమ్రంగా అంజలి ఘటించడమే దీని ఉద్దేశం.



జాతీయ పునరుజ్జీవనానికి గుర్తుగా 'కర్తవ్యపథ్' అనే కొత్తపేరు పెడుతున్నామనే అసాధారణ చారిత్రక బూటకానికి ప్రధానమంత్రి మోడీ తెరతీసే ప్రయత్నం చేశారు. ఎల్.కె. అద్వానీ ఒకసారి చెప్పినట్లుగా మోడీ ఈవెంట్ మేనేజర్‌గా మిగిలిపోయాడు. ఇన్నేళ్లుగా కోట్లాదిమంది ప్రజలు ఆకలితో, కనీసావసరాలు తీరక అలమటించిపోతుంటే అటువంటి తీవ్రమైన విషయాలపై దృష్టి సారించడం కన్నా ప్రదర్శనలకు, పటాటోపాలకు మాత్రమే ప్రాధాన్యం ఇచ్చి, కేవలం ఈవెంట్ మేనేజర్‌గా మిగిలిపోయాడు. ఈ అంశాలపై ఆయన భక్తులకు ఎంతమాత్రం పట్టింపులేదు.

2014 అనంతరకాలంలో చోటుచేసుకున్న ఈ చారిత్రక సంఘటన ముందుగా నిర్ణయించుకున్న తీరులోనే సాగింది. దీని ముఖ్య ఉద్దేశం ప్రజలను పక్కదాని పట్టించటం, వారు ప్రశాంతంగా ఉండకుండా అన్నివేళలా నిప్పులకొలిమిలో మలమలమాడిపోయేట్లు చేయడమే. ఏదో ఒక ప్రమాదం పొంచి ఉందని అన్నివేళలా భ్రమలో ఉంచి, కూలిపోతున్న జాతీయ నాగరిక వైభవాన్ని, జాతి ఔన్నత్యాన్ని నిలబెడుతున్న ప్రవక్త ప్రధానమంత్రి అని ప్రజలను మభ్యపుచ్చుతున్నారు. ఈ నాటకంలో అన్నిరకాల చతురోక్తులు దర్శనమిస్తాయి.

2014 తర్వాత జాతీయ స్థాయిలో అన్ని రంగాలలో – ఆర్థిక వ్యవస్థ నిర్వహణ, విదేశాంగ విధానాల పనితీరు, రక్షణ వ్యవస్థ రూపకల్పన, రోజువారీ రాజకీయాలు ఇవన్నీ ఎన్నికల్లో తమకు అనుకూల ఫలితాలను సాధించుకునేందుకు ఉద్దేశించినవి. తన అధికారపు పట్టు మరింతగా బిగించడానికి, అనుచరవర్గాన్ని బలోపేతం చేసుకునేందుకే రూపొందించుకున్నారు. ప్రజల్లో భావోద్వేగాన్ని మరింతగా పెంచేందుకు, ఒకదాని తరువాత మరో అంశంపై వేడి ఎంతమాత్రం తగ్గకుండా చూసేందుకు ఈవెంట్ మేనేజర్లు నిరంతరం పనిచేస్తున్నారు.

అయినప్పటికీ, ఆధునిక సమాచార రంగ విద్యార్థులందరూ ప్రభుత్వ ప్రాయోజిత ప్రచారం వారి రాజకీయాలను విభేదించేవారిని వ్యతిరేకించేందుకు ఉద్దేశించినదని ఏకీభవిస్తున్నారు. మంచికోసం ప్రచారాన్ని వినియోగించాలి. కానీ అందుకు భిన్నంగా తమకు సానుకూలంగా లేని పౌరులపై బల ప్రయోగం చేస్తున్నారు. ఉదాహరణకు కొత్త పాలన వచ్చాక న్యూఢిల్లీలోని ఔరంగజేబ్ రోడ్డును డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం రోడ్డుగా మార్చారు. అయితే ఔరంగజేబు కాలంలోని అరాచకాలపై సగటు పౌరులలో ప్రచారం చేసి, దేశంలో మైనారిటీల పట్ల వివక్ష మరింత పెరిగేందుకు దోహదం చేయటం ఎంతమేరకు సమంజసం అవుతుంది? వారణాసిలోని ఒక మసీదులో ఉన్న 'మందిర్' ను కోరడంలోని ఔచిత్యం వారి ఆకాంక్షకు అద్దం పడుతుంది.

అదేవిధంగా 'రాజ్‌పథ్'ను 'కర్తవ్యపథంగా' పేరు మార్చడంలో వ్యూహాత్మక ప్రయోజనాన్ని

గుర్తించడం సులభం అవుతుంది. కొత్త పాలకవర్గం ఉద్దేశాలు స్పష్టంగా తెలుస్తున్నాయి. ప్రజల నుంచి 'కర్తవ్యాల' (విధులు) నిర్వహణ ఎలా ఉండాలని కోరుకుంటున్నారో తెలుస్తున్నది. అంటే ప్రతి ఒక్కరూ కొత్త పాలకుల పట్ల అణకువను, విధేయతను కలిగి ఉండాలనే వారి ఉద్దేశాలను స్పష్టం చేస్తున్నది.

ప్రధానమంత్రి ఇదే విషయాన్ని ఇంతకుముందే గుర్తుచేశారు. ఇది విలక్షణమైన ఉదారవాద భావజాలం నుండి ఉద్భవించిన ధోరణి. ఇది పూర్తి స్థాయిలో కార్యకలాపాలను నిర్వహించాల్సిన బాధ్యతను పౌరులపై ఉంచుతుంది. బాధ్యతను ఆశించడం లేదా డిమాండ్ చేయడం కంటే పవిత్రమైన సిద్ధాంతాల ప్రకారం పాలకుల పనితీరు 'రాజధర్మం' ఆధారంగా ఉండాలని వారు ఊహించారు.

ఒక బీజేపీ దిగ్గజ నాయకుడు గతంలో బహిరంగంగా ఉద్బోధించిన అంశాన్ని బట్టి అప్పటి ముఖ్యమంత్రి నరేంద్ర మోదీ తన 'రాజధర్మాన్ని' నిర్వహించేందుకు తన సొంత పార్టీ నాయకత్వాన్ని విజయవంతంగా ధిక్కరించి విజయం సాధించారని ప్రస్తావించారు. అద్భుతంగా ఆ ధిక్కరణ నుండి రాజరికాన్ని పునర్ నిర్వచించగలనని మోదీ విశ్వశిస్తున్నారు. రాజు ఇప్పటికే అవిశ్రాంతంగా ప్రజల కోసం పాటుపడుతున్నందున ప్రజలు తమ 'కర్తవ్య' నిర్వహణకు కట్టుబడి ప్రదర్శనాత్మకంగా తన వంతుగా ఆ అభాగ్యులు కట్టుబడి ఉండాలని కోరుతున్నారు.

ఆయన ఇప్పటికే రేస్ కోర్స్ రోడ్డుకు లోక కళ్యాణ మార్గ్ అని పేరు మార్చి తాను అంకితభావంతో చేసిన సేవకు గుర్తుగా కేటాయించుకున్నారు. భారతదేశ ప్రజలకు ఈ కేటాయింపులో వలుచన అనుమతించబడదు. ఎందుకంటే ఇది కొత్త ప్రభువుల మితిమీరిన మూర్ఖత్వానికి అవసరమైన రాజరిక ఉత్తర్వుగా నిలుస్తుంది. ఒక స్థాయిలో ఈ మొత్తం సెంట్రల్ విస్టా ప్రాజెక్ట్‌ను చూస్తే రెండు దశాబ్దాల క్రితం లక్నోలో మాయావతి చేసినవే పునరావృతం చేసేందుకు మోడీ ప్రయత్నిస్తున్నట్టు అర్థమవుతోంది. అంటే ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఆమె ప్రతిష్ఠించిన విగ్రహాలు, సాగించిన నిర్మాణాలు రాజకీయంగా తనకు ఉపయోగపడతాయని భావించిన మాదిరిగానే దేశ, మొత్తం మీద తాను చేసే సృష్టితో అటువంటి దేశభక్తిని ప్రదర్శించగలనని మోడీ భావిస్తున్నారు.

**(అనువాదం: జి ఆంజనేయులు)**

# తెలంగాణాలో భూ పోరాటం

**(20వ పేజీ తరువాయి)**

భూమి అనీ, పేదలకు ఇవ్వాలనీ సీపీఐ(ఎం) నాయకత్వంలో వేలాదిమంది పేదలు కదిలారు. పోలీసుల పాశవిక దాడులు భరించారు. ఆ భూమి రక్షణ కోసం, ఈ భూపోరాట నాయకుడైన జి రాములు పిటిషన్‌దారుగా 25 సంవత్సరాల లీగల్ పోరాటం ఫలించి, ప్రభుత్వ భూమిగా స్వాధీనమైంది. ఇప్పుడు దాని విలువ వెయ్యి కోట్లు. ఈ పోరాటం నడుపుతూనే నగరంలో అనేక ప్రాంతాలలో 30 వేల గుడిసెలు వేసి పట్టాలు సాధించారు. ఈ చరిత్ర నేపథ్యమే పేదలకు మరోసారి ధైర్యాన్ని ఇచ్చింది. ఇది కూడా ఒక నిర్మాణాత్మక కృషితోనే సాధ్యమైంది. వరంగల్ నగరంలో ఇందుకోసం వర్క్‌షాప్ నిర్వహించారు. 45 దళాలతో 30 వార్డులలో 15 రోజులు 56 వేల కుటుంబాలలో సర్వే చేసారు. 15 వేల మందికి ఇండ్లు లేవనీ, 10వేల మందికి స్థలం ఉండి ఇండ్లు లేవనీ తేలింది. వార్డు స్థాయిలో పోరాట కమిటీలు వేసారు. సంబంధిత అధికారులకు వ్యక్తిగత దరఖాస్తులు పెట్టించారు. 6 వేల మందితో కార్పొరేషన్ కార్యాలయం ముట్టడించారు. ఆ తర్వాతనే గుడిసెలు వేసారు. అవి స్పష్టంగా, ప్రభుత్వ లేదా సీలింగ్ భూమిగా నిర్ధారించుకున్న తర్వాతనే పేదలు అడుగుపెట్టారు.

❋

# మళ్లీ ముందుకొచ్చిన బ్యాంకుల ప్రైవేటీకరణ

**(32వ పేజీ తరువాయి)**

అదుపు చేస్తున్నట్టు, పెట్టుబడులను లాభాలను ఆర్జించిన పెట్టే పెట్టుబడి నుండి దారి మళ్లిస్తున్నట్టు చూడడం జరిగింది.

అయితే 2008 లోని ఆర్థిక సంక్షోభం తర్వాత ప్రపంచవ్యాప్తంగా బ్యాంకింగ్ రంగంలో సంక్షోభం రాకుండా ఉండాలంటే, బ్యాంకులు ప్రైవేటు రంగంలో ఉండకపోవడం ఉత్తమంగా భావించడం జరుగుతున్నది. ఎటువంటి క్రమబద్ధీకరణ లేకపోవడం, ఉదారవాద విధానాల అమలు, తమ ప్రాముఖ్యత కోల్పోయాయి. అయితే ఇవేవీ, నయా – ఉదారవాద విధానాలను ప్రచారం చేసే వారి ప్రచారానికి అడ్డంకి కాలేదు. వారు "సంస్కరణలు" అమలు చేయాలనే తమ ప్రచారాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు.

దేశ అభివృద్ధిలో ప్రభుత్వ రంగ బ్యాంకుల పాత్ర, ప్రైవేటు రంగ బ్యాంకుల బలహీనతలు, వరుస ప్రభుత్వాలు బ్యాంకులను విజాతీయం ఎందుకు చేయలేకపోయాయో తెలియచేస్తున్నాయి. బ్యాంకులను ప్రైవేటీకరించాలని 30 ఏళ్లుగా ప్రచారం చేస్తున్నప్పటికీ అది కష్ట సాధ్యం గానే ఉంది.

అదృష్టవశాత్తూ ప్రభుత్వ బ్యాంకుల "వైఫల్యం", బ్యాంకింగ్ రంగం ప్రభుత్వ పరిధిలో ఉండకూడదన్న వాదన తప్పని తేల్చింది. ఉదారవాద విధానాలు, క్రమబద్ధీకరణ లేకపోవడం అసంబధమని తేలిపోయింది. పగ్గాలు వేయాల్సింది ఆర్‌బిఐ అధికారులకు కాదు. ప్రైవేటీకరణను ముందుకు తీసుకొస్తున్న విధానాలకు.

❋

# ఇటలీ ఎన్నికలు

**(30వ పేజీ తరువాయి)**

పోలెండ్ వంటి దేశాలు గాఢంగా భావిస్తున్నాయి. నిజానికి రష్యాపై ఆంక్షలను హంగరీ ప్రధాని విక్టర్ ఆర్బన్ బహిరంగంగానే వ్యతిరేకించారు. ఇటలీ మాదిరిగానే హంగరీ కూడా తన దేశానికి కావలసిన గ్యాస్‌లో 40 శాతం రష్యా దిగుమతులపై ఆధారపడి ఉంది. ఇయు తమ ప్రజల ప్రయోజనాలను పణంగా పెట్టి రష్యా విషయంలో అమెరికా తోకపట్టుకు పోవడం విషయంలో ఇయు దేశాల మధ్య బేధాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇటలీలో మెలోనీ ఎన్నిక ఈ చీలికను పెంచుతుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

కానీ మెలోనీ ఎన్నిక వల్ల ఐరోపా రాజకీయాల్లో పెద్దగా మార్పు రాకపోవచ్చునని అమెరికన్ అధికార వర్గాలు ధీమాగా ఉన్నాయి. తన ముందు పాలించి డ్రాఘీ విధానాలనుండి పక్కకు మళ్లే ప్రసక్తే లేదని మెలోని ప్రకటించడమే తమ ధీమాకు కరారణమని అమెరికన్లు పేర్కొంటున్నారు. బహుశా రెండూ కరెక్టే కావచ్చు. తను ఎన్నికయితే ఇయు నుండి ఇటలీ విడిపోతుందనీ, ఉక్రెయిన్‌కు నాటో ఇస్తున్న మద్దతును వ్యతిరేకిస్తుందనీ ప్రచారం జరుగుతోంది. అవన్నీ నిజం కావు అని మెలోనీ ప్రకటించారు. అంటే నాటోతో సైనిక సహకారం, యూరోపియన్ యూనియన్‌తో సయోధ్య, ఐరోపా సెంట్రల్ బ్యాంకు సంస్కరణలను అమలు పరుస్తూనే మరోవైపు ప్రజా వెల్లువను అణచివేయడానికీ దేశీయంగా మితవాద ప్రచారానికీ, నిరంకుశ చర్యలకూ పూనుకోవచ్చు.

❋

# అణు ఇంధనం:

(2వ పేజీ తరువాయి)

మధ్య పౌర అణు ఒప్పందం కుదిరాక మనం అనేక లైట్ వాటర్ రియాక్టర్ల'ను దిగుమతి చేసుకోవలసివుందన్న అంచనాలకు రావచ్చు. ఆ ఒప్పందం పూర్తయి 13 సంవత్సరాలు నిండు తున్నాయి. కానీ ఒక్క కొత్త అణు ప్రాజెక్టు స్థాపనకు కూడా ఆ ఒప్పందం తోడ్పడలేదు. ఇటీవలి పార్లమెంట్ చర్చల్లో ప్రభుత్వ వైఖరి అత్యంత ఆందోళనకరంగా మారింది. ఈ ఒప్పందంతో కుదిరిన దిగుమతి పథకాలు రద్దయిపోతాయని విస్తారమైన ప్రజానీకం నమ్మకంతో ఉండగా, ప్రభుత్వం అందుకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుండటం అందుకు కారణం. ఆ ఒప్పందాలు మాత్రం పుస్తకాల్లో నిక్షేపంగా అలాగే వున్నాయి.

24 విదేశీ రియాక్టర్ల దిగుమతికి అనుమతి లభించింది. వాటిలో ఆరు డబ్లుఇఆర్(వాటర్ ఎనర్జిటిక్ రియాక్టర్) డిజైన్‌తో తయారైనాయి. తమిళనాడులోని 'కుడంకుళం'లో పై రియాక్టర్లతో పనిచేసే క్రమంలో పలువిధాలైన సమస్యలు ఎదురౌతున్నాయి. 2020లో ఇక్కడి 1 మరియు 2వ రియాక్టర్ల స్థాపక సామర్థ్యాన్ని చేరుకొనే క్రమంలో అనేక సమస్యలొస్తున్నాయి. స్థాపక సామర్థ్యంలో వరుసగా 53 మరియు 52 శాతం ఉత్పత్తి మాత్రమే జరుగుతున్నది.

అమెరికా నుండి 12 రియాక్టర్లను దిగుమతి చేసుకోవాలన్న ప్రతిపాదన ఉంది. వాటిలో కనీసం 6 'ఎపి 1000' రకం రియాక్టర్లు సౌత్ కరోలినాలో వదిలేసిన రియాక్టర్ల నమూనాలో తయారైనవే. అమెరికాలోనే 'వోగాటెల్ ప్రాజెక్టు'లో రెండు ఎపి 1000 రియాక్టర్లున్నాయి. ఒక్కొక్క రియాక్టర్ ఖరీదు తొలి అంచనా 14 బిలియన్ డాలర్ల నుండి ఇపుడు 30 బిలియన్ డాలర్లకు పెరిగింది.

మిగిలిన ఆరు రియాక్టర్లు ఇపిఆర్ నమూనాలో తయారయేవి. ఫ్రాన్స్ తన గడ్డపైనే వాటి నిర్మాణాన్ని జయప్రదంగా పూర్తిచేయలేక పోయింది. ఫ్రాన్స్‌లో ఆ నమూనా రియాక్టర్లతో నిర్మితమౌతున్న ఏకైక కేంద్రం 'ఫ్లామన్‌విల్లే' మాత్రమే. ప్రస్తుతం ఆ రియాక్టరు ఒక్కోదాని ఖరీదు 12.4 బిలియన్ డాలర్లుకు చేరుకుంది. అంటే 2007లో ఆ కేంద్రం నిర్మాణం ప్రారంభించిన నాటి అంచనా కంటే దాని ఖరీదు నాలుగు రెట్లు పెరిగింది.

మహారాష్ట్రలోని జైతాపూరులో ముందుగా అనుకున్న ఆరు ఇపిఆర్ రియాక్టర్లతో నిర్ణీత కాలంలో ఒక అణు విద్యుత్ కేంద్రం నిర్మించాలని 2013లో ప్రకటించారు. ఆ కేంద్రంలో ఉత్పత్తి అయ్యే యూనిట్ విద్యుత్ ఖరీదు కనీసం రు. 15గా వుంటుందని అంచనా వేశారు. విద్యుత్ ప్రసార ఖర్చులను అందులో కలుపలేదు. ఎపి 1000 రియాక్టర్ల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్ ఖరీదు కూడా అధిక రేటులో వుంటుందని 'ఓగాటెల్' తన ప్రకటనలో తెల్పింది.

ఇటీవలి వేలంలో సౌర విద్యుత్ యూనిట్‌కు రు.2.14లు, సౌర –పవన హైబ్రీడ్ ప్రాజెక్టుల విద్యుత్ యూనిట్‌కు రు.2.34లుగా నిర్ణయించబడింది. వాటితో పోల్చినపుడు నిల్వ సామర్థ్యం గల ప్రాజెక్టుల విద్యుత్‌కు యూనిట్ రు.4.30లుగా వేలంలో రేటు పలికింది. అణు విద్యుత్‌ను పోటీ రేట్లలో అమ్మాలనుకుంటే ప్రభుత్వం పెద్ద మొత్తంలో సబ్సిడీని సమకూర్చవలసి ఉంటుంది. కానీ దేశంలోని అన్ని అణు విద్యుత్ కేంద్రాలను 'న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్' మాత్రమే నిర్వహిస్తున్నదన్న అంశాన్ని గమనంలో ఉంచుకోవాలి.

**అపాయాలను అర్థంచేసుకోవాలి**

ఫుకుషిమా ప్రమాదం అణు కేంద్రాల్లో రక్షణ లేమితనాన్ని బైటపెట్టింది. దానితో రూపకల్పనలో ఉన్న ప్రతి రియాక్టరుకు వ్యతిరేకంగా ప్రజల ప్రతిఘటనలకు దారితీసింది. ఫుకుషిమా ప్రమాదం తర్వాత 'మితివిర్ది' అణు కేంద్రానికి వ్యతిరేకంగా స్థానికులు తిరుగుబాటు చేశారని గుజరాత్ ముఖ్యమంత్రి 2018 మార్చిలో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో అంగీకరించాడు.

అణు విద్యుత్ ప్రాజెక్టులపై ప్రజల ఆందోళనలు అహేతుకమైన భయాలపై ఆధారపడిలేవు. భారత్ వంటి జన సాంద్రత అధికంగా వున్న దేశాల్లో భూమి లభ్యత ఒక ప్రధానాంశంగా ఉంటుంది. అత్యవసర వైద్య సేవ అందరికీ ఒకేలా అందుబాటులో లేదు. ఒక అణు ప్రమాదంతో 'చెర్నోబిల్'లా భూమిలో అత్యధిక భాగం నివాసయోగ్యం కానిదిగా మారిపోతుంది. ఫుకుషిమాలో ప్రమాదం ఫలితంగా ఏర్పడిన కాలుష్యాన్ని శుభ్రం చేసేందుకైన ఖర్చు 600 బిలియన్ డాలర్లను దాటింది. ఇక్కడ కూడా ఆ ఖర్చు భరించలేని ఖరీదైన సమస్యగా మారవచ్చు.

భారత్‌లో తాము నిర్మించేఈ అణు రియాక్టర్లలో ఏదైనా ప్రమాదం సంభవిస్తే నష్టపరిహారం బాధ్యత తమది కాదంటూ బహుళజాతి అణు సరఫరాదారులు పట్టుబట్టారు. దానితో ప్రజల్లో తమ రక్షణ గురించిన ఆందోళనలు పెరుగుతున్నాయి. బహుళజాతి ఉత్పత్తిదారుల వత్తిడివల్ల ఈపాటికే భారత్‌లోని 'జవాబుదారీ బాధ్యత చట్టం' ప్రధానంగా వారికే రక్షణ కల్పిస్తున్నది. ప్రమాదాల్లో వారిని బాధ్యులను చేసేందుకు ప్రభుత్వానికున్న కొద్దిపాటి అవకాశం పట్ల బహుళజాతి సంస్థలు అభ్యంతరం తెల్పుతున్నాయి.

ఈ నేపథ్యంలో అణు రియాక్టర్ల ఉత్పత్తిదారులుగా తామిస్తున్న భరోసాపై వాస్తవంగా బహుళజాతి కంపెనీలకే నమ్మకం లేదని స్థానిక పౌరులకున్న సందేహాలు వాస్తవమని స్పష్టమౌతున్నది. వారికి తమ భరోసాపై నమ్మకముంటే ప్రతి వైఫల్యానికీ తమ బాధ్యతను అంగీకరించాలి. అందుకు భిన్నంగా ఏ ఇతర పరిశ్రమకులేని న్యాయపరమైన ప్రత్యేక ఏర్పాట్లు తమకు కావాలని వారు వత్తిడి చేస్తున్నారు.

**వాతావరణంపై ఆందోళనలు**

వాతావరణ మార్పులు అణు రియాక్టర్ల ప్రమాదాలను పెంచుతాయి. 'జపోరీజాజియా' అణు కర్మాగారంలో అగ్ని ప్రమాదం జరిగిన మరునాడు దక్షిణ కొరియాలోని హునాల్ అణు కర్మాగారంలో ప్రచండమైన అగ్ని కీలలు వ్యాపించాయి. అక్కడి రియాక్టర్లలో ఎలాంటి అగ్ని ప్రమాదం జరుగకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలని దక్షిణ కొరియా అధ్యక్షుడు ఆదేశించాడు. అమెరికాలోని 'దువానే ఆర్నాల్డ్ అణుప్లాంట్' పనిని ఒక గాలివాన భగ్నం చేసింది. భవిష్యత్‌లో ఇలాంటి వాతావరణ విలయాలు పెరిగే అవకాశం వుంది.

అణు విద్యుత్‌ను వాతావరణ మార్పులకు అనుగుణమైనదిగా రూపొందించటం సాధ్యం కాదు. అందుకు విద్యుత్ వ్యవస్థ (పవర్ సిస్టమ్)ల్లో స్థితిస్థాపకత అవసరముంది.

భారత్‌లోని కార్బన్ ఉద్గారాల తీవ్రతను తగ్గించేందుకు కూడా అణు విద్యుత్ సరైన పరిష్కారం కాదు. కారణం అవసరమైన స్థాయిలో అణు విద్యుత్‌ను ఉత్పత్తి చేయటం సాధ్యం కాదు. అణు విద్యుత్ ప్రాజెక్టుల కోసం వినియోగించే వనరులను పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల వైపు మళ్లించగల్గితే వేగవంతమైన ఫలితాలు తప్పక లభిస్తాయి.

అణు రియాక్టర్ల స్వాభావికమైన దుర్బలత్వాలతో పాటు వాటి భారీ ఖరీదును పరిగణనలోకి తీసుకుంటే అణు విస్తరణ వైపు మళ్లాలన్న పథకాలను ఎలాంటి శషభిషలకు తావు లేకుండా ప్రభుత్వం ఉపసంహరించుకోవటం ఉత్తమం.

(అనువాదం: వై సిద్ధయ్య)

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2021-23, Marxistu Monthly Magazine, Volume 18, issue : 5 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36

# ఉపాధి రంగం నుండి మాయమవుతున్న మహిళలు



**భా**రత దేశంలో ప్రతి యేటా లక్షలాది మంది మహిళలు ఉపాధి రంగం నుండి మాయమవుతున్నారనీ, కరోనా మహమ్మారి తరువాత ఈ క్రమం మరింత పెరిగిందని సర్వేలు చెబుతున్నాయి. కరోనా లాక్‌డౌన్ సందర్భంగా ఉద్యోగాలు కోల్పయిన 10 కోట్ల మందిలో పురుషుల కన్నా మహిళలే ఎక్కువగా నిరుద్యోగులయ్యారు. మోడీ ప్రభుత్వం విధించి ఆకస్మిక లాక్‌డౌన్‌తో పట్టణాల నుండి స్వగ్రామాలకు వెళ్లిన వారిలో మహిలు తిరిగి రావడం బాగా తగ్గిపోయిందని సర్వేల్లో వెల్లడైంది. ఉపాధి రంగం నుండి మహిళలు మాయమవుతున్నందున భారత దేశ ఆర్థిక వ్యవస్థకు అనేక లక్షల కోట్ల రూపాయల నష్టం జరుగుతున్నదని బ్లూమ్ బెర్గ్ ఎకనామిక్స్ తెలిపింది. భారత దేశంలో మహిళలు ఉపాధి రంగం నుండి ఎంతగా తప్పుకుంటున్నారంటే ప్రస్తుతం మనం దేశం ఈ విషయంలో నిత్యం యుద్ధాలతో రగిలిపోతున్న యెమెన్‌తో పోటీ పడుతోంది.

2010 నుండి 2020 మధ్య దశాబ్ద కాలంలో భారత దేశంలో మహిశా శ్రామికుల వాటా మొత్తం శ్రామికుల్లో 26 నుండి 19 శానికి పడిపోయినట్లు ప్రపంచ బ్యాంకు తెలిపింది. కరోనా తరువాత 2022 నాటికి మహిళా శ్రామికుల శాతం మరింతగా 9 శాతానికి పడిపోయిందని ముంబయికి చెందిన ఆర్థిక వేత్తల బృందం అంచేనా వేసింది. కరోనాకు ముందు నుండే మందగిస్తున్న భారత ఆర్థిక వ్యవస్థకు యిది మరింత విశానకరమైన వార్త. భారత దేశాన్ని అమృత కాలంలోకి తీసుకుపోతానని ప్రధాని నరేంద్ర మోడీ ఎన్ని తీయటి కబుర్లు చెబుతున్నప్పటికీ దేశంలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళా శ్రామికుల పరిస్థితి ఏమాత్రం మారడం లేదు సరికదా నానాటికీ దిగజారిపోతున్నది. 2050 నాటికల్లా మహిళల ఉద్యోగిత పురుషులతో సమానంగా పెంచగలిగితే మన దేశ స్థూల జాతీయోత్పత్తి మూడోవంతు అదనంగా పెరుగుతుందని బ్లూమ్‌బెర్గ్ ఎకనామిక్స్ అంచనా వేసింది. యిది 480 లక్షల కోట్ల రూపాయలకు సమానం. అంటే మహిళలకు అనాటికి పురుషులతో సమానంగా ఉపాధి కల్పించకపోతే దేశం అంత మొత్తం నష్టపోతుందన్నమాట.

భారత దేశ జనాభాలో మహిళలు 48 శాతం ఉన్నప్పటికీ వారి వల్ల జిడిపి పెరుగుదల 17 శాతం మాత్రమే. అదే చైనాలో అయితే మహిశా శ్రామికులు 40 శాతం జిడిపి సమకూరుస్తున్నారు. మహిళలు ఉపాధిలో పాలుపంచుకోకపోవడమే ఈ మన దుస్థితికి కారణం. మహిళలకు విద్య, శిశు సంరక్షణ సదుపాయాలు కల్పించి వారికి అనువైన ఉపాధిని గనకు సమకూరిస్తే 2050 నాటికి ప్రపంచ జిడిపిని వారు 20 లక్షల కోట్ల డాలర్లు (సుమారు 1600 లక్షల కోట్ల రూపాయలు) మేర పెంచగలరని బ్లూమ్‌బెర్గ్ ఎకనామిక్స్ తెలిపింది.

**చిరునామా**

**మేనేజర్,**

**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్: 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ. 15,** సంవత్సర చందా:**రూ. 150,** పోస్టు ద్వారా **రూ. 180** పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

**ఇంటి నెంబరు**.......................................

**వీధి**.......................................

**గ్రామం**.......................................

**మండలం లేదా పట్టణం**.......................................

**జిల్లా**.......................................

email: marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao,